# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 8 మే 2023 వెల : రూ.15

చిరస్మరణీయుడు శ్రీశ్రీ

కార్ల్ మార్క్స్ జీవితం - కృషి

మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ ప్రసంగం

మార్క్స్‌తో, మార్క్స్‌లో వ్యక్తిగత ప్రయాణం

రెండూ సామాజిక విప్లవ సిద్ధాంతాలే!

తెగిపడ్డ ఆ శిరస్సు చెప్పిన రహస్యం.. మేడే

మే నెల - కొత్త తరహా ఉద్యమాలకు ప్రేరణ కావాలి

కరిగిపోతున్న కార్మిక శక్తి

ఫాసిజం రూపురేఖలు ఎలా వుంటాయి?

మహా మానవతావాది చార్లీ చాప్లిన్

ప్రజాస్వామ్యంలో ఫాసిస్టులు ఎలా గెలుస్తారు?

చెవులు పగిలే మౌనం మధ్య నుంచి

దేశానికి రానున్నవి చీకటి రోజులు

ఆధునిక తెలుగు సాహిత్యంలో అస్తిత్వ స్పృహ

చరిత్ర సాహిత్యాల సంగమస్థలిలో ఉపశ్రేణులు

కారల్ మార్క్స్ పెట్టుబడి గ్రంథం.. పుట్టుక, నిర్మాణం

మే - 2023

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 8

డీవీవీఎస్ వర్మ

- సంపాదకులు

సంపాదక వర్గం

కొప్పర్తి వెంకటరమణ మూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..


1) చిరస్మరణీయుడు శ్రీశ్రీ .. సంపాదకీయం 3

2) కార్ల్ మార్క్స్ జీవితం - కృషి - ఫ్రెడరిక్ ఎంగెల్స్ 4

3) మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ ప్రసంగం 11

4) మార్క్స్‌తో, మార్క్స్‌లో వ్యక్తిగత ప్రయాణం - ఎన్.వేణుగోపాల్ 13

5) రెండూ సామాజిక విప్లవ సిద్ధాంతాలే! - మల్లేపల్లి లక్ష్మయ్య 16

6) తెగిపడ్డ ఆ శిరస్సు చెప్పిన రహస్యం.. మేడే - ఆకుల అమరయ్య 18

7) మే నెల - కొత్త తరహా ఉద్యమాలకు ప్రేరణ కావాలి - డీవీవీఎస్ వర్మ 21

8) కరిగిపోతున్న కార్మిక శక్తి - కొండూరి వీరయ్య 23

9) ఫాసిజం రూపురేఖలు ఎలా వుంటాయి ? - లారెన్స్ బ్రిట్ 26

10) మహా మానవతావాది చార్లీ చాప్లిన్ - డాక్టర్ దేవరాజు మహారాజు 27

11) ప్రజాస్వామ్యంలో ఫాసిస్టులు ఎలా గెలుస్తారు? - అశోక్ కుంబము 29

12) చెవులు పగిలే మౌనం మధ్య నుంచి - ఫే డి సౌజా 31

13) దేశానికి రానున్నవి చీకటి రోజులు - జస్టిస్ మార్కండేయ కట్జూ 32


14) ఆధునిక తెలుగు సాహిత్యంలో అస్తిత్వ స్పృహ - మందలపర్తి కిషోర్ 34

15) చరిత్ర సాహిత్యాల సంగమస్థలిలో ఉపశ్రేణులు - కొప్పర్తి వెంకటరమణమూర్తి 36

16) కారల్ మార్క్స్ పెట్టుబడి గ్రంథం.. పుట్టుక, నిర్మాణం - మార్సెల్లో మస్తో 39

17) మోలీ క్రిక్స్ కార్టూన్స్ 43

18) కొత్త పుస్తకాలు స్వీకారం 44



కార్టూన్ : సతీష్ ఆచార్య

దారి దీపం మాసపత్రిక

వివరాలకు సంప్రదించండి

డా॥ బి.రమేష్ చంద్రబాబు,
34-15-1,
దొడ్డిపట్ల వారి తోట వీధి,
తణుకు - 534211,
ప.గో.జిల్లా, ఏపీ
ఫోన్ : 93971 14495

రాజులకు చోటు లేని ప్రజాస్వామ్యంలో నియంతలకన్నా ఎక్కువ ప్రమాదకరమైన అధికారాన్ని చెలాయిస్తూ పీడించే పాలకులు నేడు తయారయ్యారు.



సంపాదకీయం

# చిరస్మరణీయుడు శ్రీశ్రీ

ఏప్రిల్ 30 శ్రీశ్రీ జయంతి. ఆకాశపు దారులంట అడావుడిగా వెళిపోయే జగన్నాథ రథచక్రాలను భూమార్గం పట్టిచ్చిన వాడు, భూకంపం సృష్టించిన వాడు శ్రీశ్రీ. ఈ శతాబ్దం నాది అని ఆయన ప్రకటిస్తే దానిని కాదన్నవారు ఎవరూ లేరు. శ్రీశ్రీ తర్వాత తెలుగు కవిత్వం అనేకదారులలో ముందుకు సాగింది. అనేక చీకటి కోణాలను వెలుగులోకి తెచ్చింది. మహోన్నత మానవీయ ఆదర్శాలతో తెలుగు కవిత్వం సుసంపన్నం అవుతున్నది. అయితే వీటన్నింటికీ మూలాలు శ్రీశ్రీలో ఉన్నవే. అందుకే ఈ శాతాబ్దిలో కూడా శ్రీశ్రీకి ఆదరణ తగ్గకపోగా మరింత విస్తృతం అవుతున్నది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న వామపక్ష స్రవంతులకు చెందిన పుస్తక ప్రచురణాలయాలు సంయుక్తంగా 'రెడ్ బుక్ డే' ను నిర్వహిస్తున్నాయి. ఈ సారి శ్రీశ్రీ మహా ప్రస్థానం పుస్తకాన్ని ఎంపిక చేసుకున్నాయి. మహా ప్రస్థానం పఠనంతోపాటు, అనేక పట్టణాలలో సభలు, సమావేశాలు గతంలో ఎప్పుడూ జరగనంత విస్తృతంగా జరిగాయి. నేటికీ తరగని శ్రీశ్రీ ప్రభావాన్ని అవి రుజువు చేశాయి. మహా ప్రస్థానం ముందుమాటలో చలం చెప్పినట్లు "కృష్ణశాస్త్రి తన బాధని అందరిలోనూ పలికిస్తే, శ్రీశ్రీ అందరి బాధను తనలో పలికిస్తాడు". అందువల్లే శ్రీశ్రీ మనల్ని మరో ప్రపంచానికి మహా ప్రస్థానం చేయించగలిగాడు.

దోపిడీపై రాసిన కవితలో..'అందరం కలిసి చేసిన
ఈ అందమైన వస్తు సముదాయం అంతా
ఎక్కడో ఒక్కడే వచ్చి ఎత్తుకుపోతూ ఉంటే చూచి
'అన్యాయం, అన్యాయం' అని మేమంటే
'అనుభవించాలి మీ కర్మ' అంటాడు. వర్తమానానికి ఇది అద్దం పట్టేదిగా ఉంది.

శ్రమ జీవులకు ఒక విస్తృత అర్థాన్ని శ్రీశ్రీ ఎలా చెప్పాడో చూద్దాం.

'కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫురింపజేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి, సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు నా విరచించే నవీన గీతికకు.. ప్రాణం' అన్నాడు.

అంతేకాదు.. 'పెనునిద్దుర వదిలించేదీ పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ కావాలోయ్ నవకవనానికి" అంటూ నవకవితకు మార్గదర్శనం చేశాడు.

చరిత్రగమనంపై రాస్తూ..

'నరజాతి సమస్తం – పరపీడన పరాయణత్వం' అని తేల్చి చెప్పడమే కాదు..

'చిరకాలం జరిగిన మోసం – బలవంతుల దౌర్జన్యాలూ
ధనవంతుల పన్నాగాలూ – ఇంకానా ? ఇకపై చెల్లవు' అని భవిష్యత్ దర్శనం చూపించాడు.

అలాగే "లోకపుట న్యాయాలు
కాల్చే ఆకలి, కూల్చే వేదన – దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ
పరిష్కరించే, బహిష్కరించే – బాటలు తీస్తూ పాటలు రాస్తూ
నాలో కదిలే నవ్య కవిత్వం,
కార్మిక లోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా...... భావి వేదముల జీవ నాదములు జగత్తుకంతా చవులిస్తానోయ్' అని తనకు తానుగా ప్రతిజ్ఞ తీసుకున్న మహాకవి శ్రీశ్రీ మన తరానికి, భావి తరానికి చిరస్మరణీయుడు.


– డీవీవీఎస్ వర్మ

# కార్ల్ మార్క్ - జీవితమూ, కృషి



- ఫ్రెడరిక్ ఎంగెల్స్

**సోషలిజానికీ, తద్వారా యావత్తు సమకాలీన కార్మికోద్యమానికి ప్రప్రథమంగా శాస్త్రీయమైన పునాదిని కల్పించిన కార్ల్ మార్క్స్ ట్రియర్ నగరంలో 1818లో జన్మించాడు. ఆయన బాన్, బెర్లిన్ నగరాల్లో విద్యాభ్యాసం చేశాడు. మొదట న్యాయశాస్త్రాన్ని అభ్యసించాడు. కాని త్వరలోనే ప్రత్యేకించి చరిత్ర, తత్వశాస్త్రాల అధ్యయనంలో పూర్తిగా నిమగ్నుడయ్యాడు. తత్వశాస్త్ర విభాగంలో అసిస్టెంటు ప్రొఫెసరుగా స్థిరపడబోతున్న తరుణంలో 1842లో మూడవ ఫ్రెడరిక్ విల్హెల్మ్ మరణానంతరం పెల్లుబికిన రాజకీయోద్యమం ఆయన జీవితాన్ని మరో మార్గంలోకి మళ్లించింది.**



### పత్రికా రంగం - ఓ మూల మలుపు !

మార్క్స్ సహకారంతో, రెయినిష్ ఉదారవాద బూర్జువా వర్గ నాయకులైన కాంప్ హౌసెన్, హాన్సెమన్ మొదలైన వారు కొలోన్‌లో రెయినిష్ జెయిటుంగ్ అనే దినపత్రికను స్థాపించారు. 1842 శరదృతువులో రేనిష్ శాసనసభ కార్యకలాపాలపై మార్క్స్ రాసిన విమర్శ పాఠకుల దృష్టిని విశేషంగా చూరగొనడంతో, ఆ పత్రికా నిర్వహణ ప్రధాన బాధ్యత ఆయనకు అప్పగించారు. ఆ పత్రిక సెన్సార్షిప్ నిర్బంధాల కింద వెలువడేది. కాని సెన్సార్షిప్ అధికారులు దాన్ని అదుపులో పెట్టలేకపోయారు. తన ముఖ్య వ్యాసాలను సెన్సారు కత్తెరకు గురికాకుండా రెయినిష్ జెయిటుంగ్ పత్రిక ప్రచురించగలిగేది. సెన్సారు పరిశీలనార్థం అంతగా ముఖ్యం కాని సమాచారం ముందుగా పంపేవారు. దాన్ని అధికారులు కత్తిరించి కత్తిరించి విసిగిపోయైనా ఊరుకునే వారు. లేకుంటే, ఇంకా కత్తిరిస్తే మరుసటిరోజు పత్రిక వెలువడదన్న బెదిరింపు మూలంగానైనా ఊరుకోక తప్పేది కాదు. రెయినిష్ జెయిటుంగ్ పత్రిక మాదిరిగా మరో పది వార్త పత్రికలు ధైర్యంగా వ్యవహరించి వుంటే వాటి స్వంతదారులు టైప్ సెట్టింగు కోసం మరి కొన్ని వందల డాలర్లను అదనంగా ఖర్చుపెట్టేందుకు అనుమతించి ఉంటే, జర్మనీలో 1843లోనే సెన్సార్షిప్ దుస్సాధ్యమై వుండేది. కాని, జర్మన్ వార్తా పత్రికల స్వంతదారులు అల్పబుద్ధులు, పిరికి, కూపస్థ మండూకాలు. కాగా, రెయినిష్ జెయిటుంగ్ ఈ పోరాటాన్ని ఒంటరిగానే సాగించింది. ఒక సెన్సారు అధికారి తర్వాత మరొక సెన్సారు అధికారి విసుగెత్తి పోయేలా చేసింది. చివరకు దానిపైన జమిలి సెన్సారు పద్ధతి మొదలైంది. మొదటి సెన్సారుషిప్ ముగిశాక, దాన్ని చివరిసారిగా మరోమారు సెన్సారు చేసేవారు. రెయినిష్ జెయిటుంగ్ విషయంలో ఈ పద్ధతి నిష్ఫలమే అయింది. 1843వ సంవత్సరం మొదట్లో ఇక ఈ వార్తపత్రికను అదుపులో పెట్టడం దుస్సాధ్యమని ప్రకటించి, ఎక్కువ ఆర్భాటమేమీ లేకుండా ప్రభుత్వం దాన్ని మూసేసింది.

### పెళ్లి ప్యారిస్

కుటుంబ సభ్యులతో ఎంగెల్స్ ఈలోగా ఫాన్ వెస్ట్ ఫాలెన్ తర్వాత అభివృద్ధి నిరోధక మంత్రి అయాడు. సోదరిని మార్క్స్ పెళ్లి చేసుకుని, తన నివాసాన్ని పారిస్‌కు మార్చుకున్నాడు. అక్కడ ఆయన ఎ.రూగా(రూజ్)తో కలిసి డాయిష్ ఫ్రాంజోసిషె యార్బ్యూషెర్ పత్రిక ప్రచురించేవాడు. దానిలో ఆయన 'హేగెలియన్ న్యాయ, తత్వ శాస్త్రంపై విమర్శ' అన్నదానితో ప్రారంభించి తన సోషలిస్టు రచనలను వరుసగా ప్రచురించాడు. వీటికితోడు ఎంగెల్స్‌తో కలిసి 'పవిత్ర కుటుంబం-బ్రూనో బౌవర్ ప్రభృతుల విమర్శనాత్మక విమర్శపై విమర్శ' అనే పుస్తకాన్ని అదేరోజుల్లో వెలువరించాడు. అది ఆనాటి జర్మన్

తాత్విక భావవాదపు సరికొత్త తప్పుడు రూపాలలో ఒకటైన బ్రూనో బౌవర్ భావాలపైన వ్యంగ్య విమర్శ. ఫ్రెంచి మహా విప్లవ చరిత్రనూ, అర్థశాస్త్రాన్నీ అధ్యయనం చేయడంలో నిమగ్నుడై ఉండి కూడా మార్క్స్ మధ్య మధ్య తగినంత తీరిక చేసుకొని ప్రష్యన్ ప్రభుత్వంపైన దాడులు చేస్తూ వచ్చాడు. 1845 వసంతంలో ఫ్రాన్స్ నుండి మార్క్స్‌ను – గిజో ప్రభుత్వం చేత – బహిష్కరింపజెయ్యడం ద్వారా ప్రష్యన్ ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకుంది. అలెగ్జాండర్ ఫాన్ హుంబోల్ట్ ఈ వ్యవహారంలో దళారీగా వ్యవహరించినట్లు వినికిడి. మార్క్స్ తన నివాసాన్ని బ్రస్సెల్స్‌కు మార్చుకొని, 'తత్వశాస్త్ర దారిద్ర్యం' అనే పుస్తకాన్ని 1847లో ఫ్రెంచి భాషలో ప్రచురించాడు. ప్రూడన్ రచించిన 'దారిద్ర్య తత్వశాస్త్రం" అనే పుస్తకంపై విమర్శ ఈ గ్రంథం. 1848లో "స్వేచ్ఛాయుత వాణిజ్యంపై ప్రసంగం' అనే రచనను కూడా ప్రచురించాడు.

## లీగు రూపాంతరీకరణ

జర్మన్ కార్మికసంఘాన్ని బ్రస్సెల్స్ స్థాపించే అవకాశాన్ని వినియోగించుకొని, తద్వారా ప్రత్యక్ష ఆందోళనా కార్యక్రమాన్ని అదే కాలంలో ఆరంభించాడు. ఆయనా, ఆయన రాజకీయ మిత్రులూ 1847లో రహస్య కమ్యూనిస్టు లీగులో (యీ లీగు అంతకుముందు పలు సంవత్సరాలుగా వుంది!) ప్రవేశించినప్పుడు యీ ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమానికి మరింత ప్రాధాన్యాన్ని ఇచ్చాడు. ఈ కమ్యూనిస్టు లీగు యావత్తు నిర్మాణ స్వరూపమూ అప్పుడిక విశేషంగా మారిపోయింది. అంతకు పూర్వం కొంచెం ఇంచుమించుగా కుట్రదారీ సంస్థగా వుంటూ వచ్చిన లీగు యిప్పుడు కమ్యూనిస్టు ప్రచారం చేసే మామూలు సంఘంగా రూపాంతరం చెందింది. పరిస్థితుల ఒత్తిడి వలన మాత్రమే జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ యొక్క ఈ తొలి సంఘం యింకా రహస్య సంఘంగా వుంది. జర్మన్ కార్మిక సంఘాలు ఉన్న ప్రతిచోటా లీగు వుంది. ఇంగ్లండు, బెల్జియం, ఫ్రాన్సు, స్విట్జర్లాండులలోని దాదాపు అన్ని కార్మిక సంఘాలలోనూ, జర్మనీలోని అత్యధిక సంఖ్యాక సంఘాలలోనూ నాయకులు లీగుకి చెందినవారే. ఆవిర్భవిస్తున్న జర్మన్ కార్మికోద్యమంలో లీగు గణనీయమైన పాత్ర వహించింది. అంతే కాదు, యావత్తు కార్మికోద్యమం యొక్క అంతర్జాతీయ స్వభావాన్ని నొక్కి చెప్పి, ఆచరణలో దాన్ని రుజువు చేసిన సంస్థల్లో మా లీగు మొట్టమొదటిది. ఇంగ్లీషువారు, బెల్జియన్లు, హంగేరియన్లు, పోలిష్ వారు మొదలైన వారు లీగులో సభ్యులుగా వున్నారు. లీగు అంతర్జాతీయ కార్మిక సమావేశాలను, ప్రత్యేకించి లండనులో నిర్వహించింది. 1847లో జరిగిన రెండు మహాసభల్లో లీగు రూపాంతరీకరణ జరిగింది. పార్టీ మూలసూత్రాలను ప్రణాళిక రూపంలో విశదీకరించి, ప్రచురించాలని రెండవ మహాసభ తీర్మానించింది. ఈ పార్టీ మూల సూత్రాలను రాసే పని మార్క్స్ -ఎంగెల్స్‌కు అప్పగించారు. 1848లో మొదటిసారిగా వెలువడిన 'కమ్యూనిస్టు ప్రణాళిక' యీ విధంగా ఆవిర్భవించింది. ఫిబ్రవరి విప్లవానికి కొంచెం ముందుగా వెలువడిన ఈ ప్రణాళికను దరిమిలా దాదాపు అన్ని యూరపియన్ భాషల్లోకి అనువదించారు.

'డాయిష్ బ్రుసెలర్ జెయిటుంగ్' పత్రికా నిర్వహణలో మార్క్స్ పాల్గొన్నాడు. మాతృదేశంలో పోలీసు పాలన దుష్ఫలితాలను ఈ పత్రిక నిర్దాక్షిణ్యంగా బహిర్గతం చెయ్యడంతో, ప్రష్యన్ ప్రభుత్వం మార్క్స్‌ను మళ్ళీ బహిష్కరింపజెయ్యాలని ప్రయత్నించింది. కాని ఆ ప్రయత్నంలో అది విఫలమైంది. అయితే, ఫిబ్రవరి విప్లవం ఫలితంగా బ్రస్సెల్స్‌లో సైతం ప్రజా సామూహిక ఉద్యమాలు ప్రారంభమై, బెల్జియంలో విప్లవం ముంచుకు రానున్నట్లు కనిపించడంతో బెల్జియం ప్రభుత్వం లాంఛనాల కోసం వేచి వుండకుండా మార్క్స్‌ను అరెస్టు చేసి బహిష్కరించింది. ఈలోగా, ఫ్రెంచి తాత్కాలిక ప్రభుత్వం ఫ్లోకోన్ ద్వారా, పారిస్‌కు తిరిగి రావలసిందిగా ఆయనకు ఒక ఆహ్వానాన్ని పంపింది. మార్క్స్ ఈ ఆహ్వానాన్ని ఆమోదించాడు.

ఆ రోజులలో పారిస్‌లోని జర్మన్లు విప్లవాన్నీ, రిపబ్లిక్‌ను జర్మనీకి ఎగుమతి చేసేందుకు గాను, ఫ్రాన్సులోని జర్మన్ కార్మికులను స్వచ్ఛంద సాయుధ దుస్సాహసిక దళాలుగా ఏర్పాటు చెయ్యడానికి ప్రయత్నిస్తూండేవారు. మార్క్స్ పారిస్‌లో ప్రత్యేకించి ఈ వంచనకు వ్యతిరేకంగా బాహాటమైన కృషి జరిపాడు. ఓ వైపు జర్మనీ తన విప్లవాన్ని తనే నిర్వహించుకునేందుకు ప్రయత్నాలు చేసేది. మరో వైపున ఫ్రాన్సులో ఏర్పాటు చెయ్యబడిన ప్రతి ఒక్క విప్లవాత్మక విదేశీ స్వచ్ఛంద దళం యొక్క సమాచారాన్నీ కూలదొయ్యబడవలసిన ప్రభుత్వానికి ముందుగానే చేరవేసేవారు తాత్కాలిక ప్రభుత్వపు లమర్టీన్లు. బెల్జియం, బాడెన్లలో ఇదే జరిగింది.

## మళ్లీ జర్మనీకి

మార్చి విప్లవానంతరం, మార్క్స్ కొలోన్ వెళ్లి, అక్కడ 'నెవె రెయినిష్ జెయిటుంగ్'ను ప్రారంభించాడు. ఆనాటి ప్రజాస్వామిక ఉద్యమ పరిధిలో శ్రామికవర్గ దృక్పథానికి ప్రాతినిధ్యం వహించిన పత్రిక ఇదొక్కటే. ఈ పత్రిక 1848 జూన్ 1 నుంచి 1849 మే 19 వరకు వెలువడింది. 1848 నాటి పారిస్ జూన్ తిరుగుబాటుదార్లకు యీ పత్రిక బేషరతుగా ఇచ్చిన తోడ్పాటు ఈ విషయాన్ని నిరూపిస్తుంది. ఈ తోడ్పాటుకు పర్యవసానంగా దాదాపు దాని వాటాదారులందరూ దాని నుంచి తప్పుకున్నారు. 'నెవె రెయినిష్ జెయిటుంగ్' పవిత్రమైన ప్రతి ఒకదానిపైనా, రాజు నుండి, ఆ ప్రాంతపు వైస్ రీజెంటు నుంచి సాయుధ పోలీసు దాకా, అందునా అప్పట్లో, ఎనిమిది వేల

మంది దుర్గ రక్షక సైనికులకు కలిగిన ప్రష్యన్ కోటలో, అత్యున్నత ప్రమాణంలో ధూర్తత్వంతో దాడి చేస్తున్నదని ఆ పత్రిక పేర్కొన్నా ఫలితం లేకపోయింది. ఆకస్మికంగా అభివృద్ధి నిరోధకులుగా మారిన రేనిష్ ఉదారవాద కూపస్థ మండూకాలు క్రోధావేశాన్ని ప్రకటించారు. అదీ నిష్ఫలమే అయింది. కొలోన్‌లో మార్షల్ ద్వారా 1848 శరదృతువులో పత్రిక దీర్ఘకాలంపాటు నిలిపివేయబడింది. దానివల్లా ప్రయోజనం లేకపోయింది. ఫ్రాంక్‌ఫర్ట్‌లోని రెయినిష్ న్యాయ మంత్రిత్వ శాఖ కొలోన్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎదుట ఈ పత్రికలో ప్రచురితమైన ప్రతి ఒక్క వ్యాసాన్ని వరసగా ఖండించి, పత్రికపైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేసింది. ఆ ప్రయత్నమూ నిష్ఫలమే అయింది. పోలీసుల కళ్ల ముందు పత్రిక సంపాదకత్వమూ, ప్రచురణా ప్రశాంతంగా సాగుతూ వచ్చాయి. ప్రభుత్వంపైనా, బూర్జువా వర్గంపైనా దాని దాడుల తీక్షణత పెరిగే కొద్దీ పత్రిక ప్రచారమూ, ప్రతిష్ఠా పెంపొందుతూ వచ్చాయి. 1848 నవంబరులో ప్రష్యన్ రాజకీయ కుట్ర జరిగినప్పుడు, 'నెవె రెయినిష్ జెయిటుంగ్' పత్రిక సంచికపైన పన్నులు చెల్లించవద్దనీ, బల ప్రయోగాన్ని బల ప్రయోగంతో ఎదుర్కోమనీ ప్రజలకు పిలుపునిస్తూ వచ్చింది. అలా చేసినందుకూ, మరో వ్యాసాన్ని ప్రచురించినందుకూ 1849 వసంతంలో పత్రిక న్యాయ విచారణను ఎదుర్కోవలసి వచ్చింది. కాని, రెండుసార్లు కూడా పత్రిక నిర్దోషిగా వదలి వెయ్యబడింది. చివరకు డ్రెస్డెన్‌లోనూ, రైన్ రాష్ట్రంలోనూ 1849 మే తిరుగుబాట్లు అణచివెయ్యబడినప్పుడూ, గణనీయమైన సంఖ్యలో సైనికులు సమీకరణ కేంద్రీకరణల ద్వారా బాడెన్ పలాటినేట్ తిరుగుబాటుకు వ్యతిరేకంగా ప్రష్యన్ ఉద్యమం ఆరంభింపబడినప్పుడూ 'నెవె రెయినిష్ జెయిటుంగ్' పత్రికను బలప్రయోగం ద్వారా అణచివేసే శక్తి తనకు తగినంతగా వున్నట్లు ప్రభుత్వం భావించింది. ఎర్ర సిరాతో అచ్చువెయ్యబడిన చిట్టచివరి సంచిక మే 19న వెలువడింది. మార్క్స్ తిరిగి పారిస్ వెళ్లాడు. కాని, 1849 జూన్ 13వ తేదీ ప్రదర్శనకు కేవలం కొద్ది వారాల తర్వాత, తన నివాసాన్ని బ్రిటన్‌కు మార్చుకోవడమో, లేక ఫ్రాన్సును విడిచి వెళ్లిపోవడమో తేల్చుకొమ్మన్న ఫ్రెంచి ప్రభుత్వ బెదిరింపును ఎదుర్కోవలసి వచ్చింది. ఆయన రెండో ప్రత్యామ్నాయాన్నే ఎంచుకొని లండనుకు తరలివెళ్లాడు. అప్పటి నుండి ఆయన నిరవరోధంగా అక్కడే ఉండిపోయాడు. 1850లో హాంబుర్గ్ నుంచి "నెవె రెయినిష్ జెయిటుంగ్" పత్రికను సమీక్ష రూపంలో ప్రచురించేందుకు చేసిన ప్రయత్నాన్ని, కొద్ది కాలం తర్వాత మానుకోవలసివచ్చింది. అభివృద్ధి నిరోధక శక్తుల బలప్రయోగం నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా, ఈ ప్రయత్నం విరమించుకోవలసి వచ్చింది. ఫ్రాన్సులో 1851 డిసెంబరులో రాజకీయ కుట్ర జరిగిన వెంటనే, 'లూయీ బోనపార్ట్ : బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ' పుస్తకాన్ని ప్రచురించాడు మార్క్స్. ఈ పుస్తకం బోస్టన్ నుంచి 1852లో ద్వితీయ ముద్రణ గానూ, 1869లో హాంబుర్గ్ నుంచీ ప్రచురితమైంది. 1853లో ఆయన 'కొలోన్ కమ్యూనిస్టు కుట్ర కేసు బండారం' రచించాడు. మొదట బాసెల్లోనూ, తర్వాత బోస్టన్‌లోనూ, ఆ తర్వాత యిటీవల లైప్జిగ్‌లోనూ ఇది పునః ప్రచురితమైంది.

## లండన్లో చదువుతూ - రాస్తూ..

కొలోన్ కమ్యూనిస్టు లీగు సభ్యులకు శిక్షలు పడిన తర్వాత, మార్క్స్ రాజకీయ ఆందోళనోద్యమం నుంచి ఉపసంహరించుకొని, పదేళ్లపాటు ఒక వంక అర్థశాస్త్రంపై బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో వున్న అపూర్వమైన సమాచార సంపదను అధ్యయనం చెయ్యడానికీ, మరో వంక న్యూయార్క్ డెయిలీ ట్రైబ్యున్ పత్రికకు వ్యాసాలు రాయడానికీ తన సమయాన్ని వెచ్చించాడు. అమెరికాలో అంతర్యుద్ధారంభం దాకా ఆ పత్రిక ఆయన సంతకంతో రచనలను ప్రచురించడమే కాకుండా యూరప్, ఆసియాలోని పరిస్థితులపై ఆయన లేఖిని నుండి వెలువడిన చాలా సంపాదక వ్యాసాలను ప్రచురించింది. బ్రిటిష్ అధికారిక సమాచారాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి, వాటి ఆధారంగా లార్డు పామర్‌స్టన్‌పై మార్క్స్ చేసిన విమర్శలు లండన్లో చిన్న పుస్తక రూపంలో ప్రచురితమయ్యాయి.

## 'అర్థశాస్త్ర విమర్శ - ఓ అధ్యయనం'

ఓ పలు సంవత్సరాల పాటు జరిగిన అర్థశాస్త్ర అధ్యయనం తొలి ఫలితంగా 1859లో 'అర్థశాస్త్ర విమర్శ– ఓ అధ్యయనం' మొదటి భాగం వెలువడింది (బెర్లిన్, డుంకెర్). ఈ రచనలో డబ్బుకు సంబంధించిన సిద్ధాంతంతోపాటు మార్క్సిస్టు విలువ సిద్ధాంతపు సుసంగత వివరణ వుంది. ఇటాలియన్ యుద్ధ కాలంలో, ఉదారమైనదిగా నటిస్తూ, పీడిత జాతుల విముక్తి దాత పాత్రను నటిస్తున్న బోనపార్టిజాన్నీ లండను నుంచి వెలువడే 'దస్ ఫోక్' అనే వార్త పత్రికలో మార్క్స్ ఖండించాడు. తాటస్థ్యం మరుగున కల్లోల పరిస్థితిని స్వలాభానికి వినియోగించుకొనజూచిన ఆనాటి ప్రష్యన్ విధానాన్ని అదే వార్త పత్రికలో మార్క్స్ ఖండించాడు. జర్మనీ సానుభూతి కోసం పని చేస్తున్న కార్ల్ ఫోగ్ట్ కూడా ఈ సందర్భంగానే విమర్శించవలసి వచ్చింది. అప్పట్లో ప్రిన్సు నెపోలియన్ (ప్లోన్ – ప్లోన్) పనుపున, లూయీ నెపోలియన్ జీతంపైన, తాటస్థ్యం కోసం, ఫోగ్ట్ పనిచేస్తూ ఉండేవాడు. ఫోగ్ట్ తనపైన బుద్ధిపూర్వకంగా కల్పించిన హేయాతిహేయమైన అభాండాలను ఖండించి, 'మిస్టర్ ఫోగ్ట్' (లండన్ 1860) అనే రచన ద్వారా వాటికి జవాబిచ్చాడు. అందులో ఫోగ్టూ, సామ్రాజ్యవాద కుహనా ప్రజాస్వామ్యవాద ముఠాకు చెందిన తదితర పెద్దమనుషులనూ తూర్పారబట్టాడు. చివరకు ఫోగ్ట్, డిసెంబరు సామ్రాజ్యం నుండి

లంచాలు తీసుకున్న నేరారోపణపై శిక్షింపబడ్డాడు. దీనికి సంబంధించిన ధృవీకరణ పదేళ్ల తర్వాత వచ్చింది. 1870లో తుయిలెరీ రాజభవనంలో దొరికిన బోనపార్ట్ కిరాయి మనుషుల జాబితాను, సెప్టెంబరు ప్రభుత్వం చేత ప్రచురించింది. అందులో, 'ఎఫ్' అన్న అక్షరం కింద ఈ కింది అంశం నమోదు అయింది : 'ఫోర్ట్ – 1859 ఆగస్టులో ఈయనకు అందజేసిన సొమ్ము – 40,000 ఫ్రాంకులు.'

## 'పెట్టుబడి'

చివరకు, 1867లో హాంబుర్గ్ మార్క్స్ ప్రధాన రచన అయిన 'పెట్టుబడి: పెట్టుబడిదారీ ఉత్పత్తి విమర్శనాత్మక విశ్లేషణ' మొదటి సంపుటం వెలువడింది. ఈ గ్రంథం మార్క్స్ ఆర్థిక – సోషలిస్టు దృక్పథాలనూ– ప్రస్తుత సమాజంపైన, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంపైన, దాని పర్యవసానాలపైన ఆయన విమర్శ నూ వివరిస్తుంది. నూతన యుగాన్ని సృష్టించిన ఈ రచన ద్వితీయ ముద్రణ 1872లో వెలువడింది. ప్రస్తుతం మార్క్స్ 'పెట్టుబడి' రెండవ సంపుటి పరిష్కరణలో నిమగ్నుడై వున్నాడు.

## చిరకాల వాంఛితం, ఇంటర్నేషనల్!

ఈలోగా వివిధ యూరపియన్ దేశాలలో కార్మికోద్యమం తిరిగి విశేషంగా బలాన్ని పుంజుకున్న కారణంగా మార్క్స్ తన చిరకాల వాంఛితమైన కార్మిక సంఘ సంస్థాపన గురించి ఆలోచించగలిగాడు. ఈ సంఘం యూరప్, అమెరికాల్లోని మిక్కిలి అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యాపించాలని మార్క్స్ ఆశించాడు. అది ఇటు కార్మికులకే కాకుండా అటు బూర్జువా వర్గానికీ, ప్రభుత్వాలకూ సోషలిస్టు ఉద్యమ అంతర్జాతీయ స్వభావాన్ని ఆచరణలో ప్రదర్శించాలనీ మార్క్స్ ఆశించాడు. ఇది శ్రామిక వర్గానికి ప్రోత్సాహం కలిగించి, దానికి బలం చేకూర్చగా, దాని శత్రువుల హృదయాలను భయకంపితం చెయ్యగలుగుతుందనీ మార్క్స్ ఆశించాడు. సరిగా అప్పుడే రష్యా చేత మరోమారు అణచి వెయ్యబడిన పోలండును బలపరుస్తూ లండన్‌లోని సెంట్ మార్టిన్ హాలులో 1864 సెప్టెంబరు 28న జరిగిన బహిరంగ సమావేశం ఈ అంశాన్ని ముందుకు తెచ్చే అవకాశాన్ని కల్పించింది. ఈ ప్రతిపాదన హర్షామోదాలు పొందింది. ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ స్థాపింపబడింది. ఆ సమావేశంలో, లండన్ కేంద్ర స్థానంగా, ఒక తాత్కాలిక జనరల్ కౌన్సిలు ఎన్నుకోబడింది. ఈ జనరల్ కౌన్సిల్‌కే కాకుండా, హేగ్ మహాసభ వరకు దరిమిలా ఎన్నుకోబడిన జనరల్ కౌన్సిళ్లన్నింటికీ మార్క్స్ ఉత్తేజకుడుగా వ్యవహరించాడు. 1864 నాటి 'ప్రారంభోత్సవ విజ్ఞప్తి' మొదలుకొని, 1871 నాటి ఫ్రాన్సులో అంతర్యుద్ధంపై విజ్ఞప్తి దాకా ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు విడుదల చేసిన పత్రాలలో దాదాపు ప్రతి ఒకదాన్నీ ఆయనే రచించాడు. ఇంటర్నేషనల్ మార్క్స్ కృషిని వర్ణించడమంటే ఆ సంఘ చరిత్రను రాయడమే అవుతుంది. ఏమైనా అది యూరపియన్ కార్మికుల స్మృతిలో యింకా సజీవంగానే వుంది.

పారిస్ కమ్యూన్ పతనం ఇంటర్నేషనల్‌ను పనిచేసేందుకు అసాధ్యమైన పరిస్థితిలోకి నెట్టింది. విజయవంతమైన ప్రత్యక్ష కార్యాచరణకు దిగగల అవకాశాన్ని అన్నిచోట్లా కోల్పోయిన దశలో అది యూరపియన్ చరిత్ర ముమ్మొనకు నెట్టబడింది. ఏ ఘటనలైతే దాన్ని సప్తమ అగ్రరాజ్య స్థానానికి లేవనెత్తాయో అవే ఘటనలు అది తన పోరాటశక్తులను సమీకరించుకొని, ప్రత్యక్ష కార్యాచరణలో వినియోగించడానికి ఆటంకంగా తయారయ్యాయి. కార్యాచరణకే పూనుకొంటే, తప్పనిసరిగా అపజయంపాలై, కార్మికోద్యమాన్ని కొన్ని దశాబ్దాలపాటు వెనక్కినెట్టే ప్రమాదంలో పడింది ఈ సంస్థ. దీనికితోడు, ఆకస్మికంగా వృద్ధి చెందిన ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ కీర్తిని స్వాతిశయ లేక కీర్తి కాంక్షా పరితృప్తి కోసం వినియోగించుకోవాలని, అనేక వైపుల నుంచి కొందరు ముందు కొస్తున్నారు. వీరు ఇంటర్నేషనల్ నిజస్థానాన్ని గుర్తించినవారు గాని, దాని పట్ల గౌరవం ఉన్నవారు గాని కారు. అటువంటి పరిస్థితిలో వీరోచితమైన ఒక నిర్ణయాన్ని తీసుకోవలసి వచ్చింది. ఈ మారు కూడా మార్క్స్ ఆ నిర్ణయాన్ని తీసుకొని హేగ్ మహాసభలో అది ఆమోదం పొందేలా చేశాడు. అహేతుకమైన, అసహ్యకరమైన శక్తులకు కేంద్రకంగా వ్యవహరిస్తున్న బకూనిస్టుల చర్యల బాధ్యతను లాంఛనప్రాయమైన ఒక తీర్మానం ద్వారా ఇంటర్నేషనల్ తిరస్కరించింది. అటు పిమ్మట, అంతకంతకూ మోయరాని భారంగా మారిన డిమాండ్లను తీర్చడం, అన్ని వైపులా అలుముకున్న అభివృద్ధి నిరోధకత్వం మూలంగా, జీవశక్తిని ఓడ్చి వేసే త్యాగాలను చెయ్యడం ద్వారా తప్ప తన పూర్తి సార్థక్యాన్ని నిలబెట్టుకోవడం సాధ్యం కాదని ఇంటర్నేషనల్ గ్రహించింది. ఈ పరిస్థితుల దృష్ట్యా, జనరల్ కౌన్సిలును అమెరికాకు మార్చడం ద్వారా, ఇంటర్నేషనల్ తాత్కాలికంగా రంగం నుంచి నిష్క్రమించింది. ఆ కాలంలోనూ, దరిమిలా తరచుగాను ఖండింపబడిన ఆ నిర్ణయం ఎంత సరైనదో తదుపరి ఘటనలు రుజువుచేశాయి. ఈ నిర్ణయం ఒకవంక, ఇంటర్నేషనల్ పేర జరిగిన ప్రయోజనరహితమైన దుందుడుకు విప్లవ ప్రయత్నాలన్నింటికీ స్వస్తి చెప్పింది. మరోవంక, వివిధ దేశాల సోషలిస్టు కార్మిక పార్టీల మధ్య కొనసాగుతున్న సన్నిహిత సాంగత్యమూ, ప్రయోజనాల సామ్యానికీ, సకల దేశాల శ్రామికవర్గ సంఘీభావానికీ సం బంధించి ఇంటర్నేషనల్ కలిగించిన చైతన్యమూ, ఆ తరుణంలో ఓ సంకెలగా తయారైన అంతర్జాతీయ సంఘంతో

లాంఛనప్రాయమైన అనుబంధమూ లేకపోయినప్పటికీ తమను తాము సుస్థాపితం చేసుకోగలుగుతున్నాయి. హేగ్ మహా సభానంతరం, తన సైద్ధాంతిక కృషిని తిరిగి ప్రారంభించేందుకు మార్క్సు చివరకు తీరిక లభించింది. త్వరలోనే ఆయన 'పెట్టుబడి' రెండవ సంపుటాన్ని పూర్తి చెయ్యగలుగుతారని ఆశించవచ్చు.

## ముఖ్యమైన ఆవిష్కరణలు రెండు!

విజ్ఞానశాస్త్ర చరిత్రలో ముఖ్యమైన పలు ఆవిష్కరణలద్వారా మార్క్స్ తన నామధేయాన్ని లిఖించుకున్నాడు. వాటిలో రెండింటిని మాత్రమే మేమిక్కడ ప్రస్తావించగలం. ప్రపంచ చరిత్రకు సంబంధించిన మొత్తం అవగాహనలో ఆయన తెచ్చిన విప్లవం మొదటిది. అన్ని చారిత్రక పరిణామాలకూ మూల కారణాలు మానవుల మారుతున్న భావాలలో వుంటాయి. చారిత్రక పరిణామాలన్నింటిలోకి అతి ముఖ్యమైనవి రాజకీయ మార్పులు. యావత్తు చరిత్రపైనా అవే ప్రాబల్యం వహిస్తాయి అన్నదే చరిత్రకు సంబంధించిన పూర్వ దృక్పథమంతటికీ ప్రాతిపదికగా వుంటూ వచ్చింది. అయితే, ఆ భావాలు మనుషుల మనసుల్లోకి ఎక్కడి నుంచి వచ్చాయి? ఆ రాజకీయ మార్పుల కారణాలేమిటి అన్న ప్రశ్న తలెత్తేది కాదు. ఇటీవల ఫ్రెంచి చరిత్రకారుల పరంపరలోనూ, పాక్షికంగా ఆంగ్ల చరిత్రకారులలోనూ కనీసం మధ్యయుగాలనాటి నుంచి అయినా, యూరపియన్ చరిత్రలో చోదకశక్తి, పెంపొందుతున్న బూర్జువావర్గానికీ, ఫ్యూడల్ ప్రభు వర్గానికీ మధ్య సామాజిక, రాజకీయ పెత్తనం కోసం జరిగిన పోరాటమేనన్న విశ్వాసం చోటు చేసుకుంది. అయితే అప్పుడు మార్క్స్ సమస్త పూర్వ చరిత్రా, వర్గ పోరాటాల చరిత్ర అనీ, బహుముఖ, సంక్లిష్ట రాజకీయ పోరాటాల్లోనూ సామాజిక వర్గాల సామాజిక, రాజకీయ పాలనే కీలకాంశమనీ, పాత వర్గాలు తమ ప్రాబల్యాన్ని నిలుపుకోడానికీ, కొత్తగా తలెత్తుతున్న వర్గాలు తమ ప్రాబల్యాన్ని నెలకొల్పుకోడానికీ మధ్య జరిగే ఘర్షణే ప్రధానాంశమనీ నిరూపించాడు. మరైతే, యీ వర్గాల ప్రాదుర్భావానికీ, వాటి అస్తిత్వాలు కొనసాగడానికీ కారణం ఏమిటి? ఒక దశలో సమాజం తన జీవితావసర వస్తువులను ఏ పరిస్థితుల్లోనైతే మార్పిడి చేసుకుంటుందో, ఆ ప్రత్యేక పాదార్థిక, భౌతిక, దృగ్గోచర పరిస్థితులే వాటి అస్తిత్వానికి కారణం. మధ్య యుగాల నాటి ఫ్యూడల్ పాలన సన్నకారు రైతాంగ సమష్టి సమాజాల స్వయం పోషక ఆర్థిక వ్యవస్థపై ఆధారపడింది. ఈ రైతాంగ సమష్టి సమాజాలు తమ అవసరాలను తీర్చగల వస్తువులన్నింటినీ తామే తయారుజేసుకునేవి. ఆ సమాజాల్లో దాదాపు మారకమంటూ వుండేదే కాదు. ఆ సమాజాలు బయట నుండి సాయుధ ప్రభువర్గపు రక్షణనూ, జాతీయ కనీసం రాజకీయ సంయోగాన్నీ పొందాయి. పట్టణాలు, వాటితోపాటు చేతి పరిశ్రమలూ తలెత్తి, మొదట ఆంతరంగిక, తర్వాత అంతర్జాతీయ వర్తక సంబంధాలు పెంపొందినప్పుడు పట్టణవాస బూర్జువావర్గం అభివృద్ధి చెందింది. మధ్యయుగం నాటికే ఈ వర్గం ప్రభువర్గంతో పోరాటం జరిపి, ఫ్యూడల్ వ్యవస్థలో భాగస్వామ్యాన్నీ, అలాగే సమాజంలో ప్రత్యేక సౌకర్యాలు కలిగిన అంతరువునూ సంపాదించుకుంది. కానీ యూరపియనేతర ప్రపంచాన్ని కనుగొన్న తర్వాత, పదిహేనవ శతాబ్ది మధ్య నుండి, ఈ బూర్జువా వర్గం మరింత విస్తృతమైన వాణిజ్య రంగాన్నీ, దానితోపాటు తన పరిశ్రమకు కొత్త ఊపునూ సంపాదించుకుంది.

అతి ముఖ్యమైన శాఖల్లో చేతివృత్తుల స్థానాన్ని ఇప్పుడు ఫ్యాక్టరీ స్థాయిలో కార్ఖానా పరిశ్రమలు ఆక్రమించాయి. గత శతాబ్దపు శాస్త్రీయావిష్కరణలు, ప్రత్యేకించి ఆవిరి ఇంజను కనుగొనడంతో అవి సాధ్యమయ్యాయి. భారీ పరిశ్రమలు తిరిగి తమ వంతులో, వెనుకబడిన దేశాలలో చేతి శ్రమను తొలగించ డం ద్వారా వర్తకంపైన పనిజేసి, మరింత అభివృద్ధి చెందిన దేశాల్లో ఆవిరి ఇంజన్లు, రైల్వేలు, విద్యుత్ టెలిగ్రఫీ మొదలైన ఆధునిక నూతన రవాణా, వార్తాప్రసార సౌకర్యాలను సృష్టించా యి. బూర్జువావర్గం ఈ విధంగా అంతకంతకూ అధికంగా సామాజిక సంపదనూ, సామాజిక అధికారాన్నీ కూడదీసుకోనా రంభించింది. అయితే అది ఇంకా చాలాకాలం దాకా రాజకీయా ధికారం నుండి దూరంగా అట్టే పెట్టబడింది. రాజకీయాధికారం యింకా ప్రభువర్గం చేతుల్లోనూ, ఫ్యూడల్ ప్రభువర్గపు తోడ్పాటు కలిగిన రాజరికం చేతుల్లోనే వుంటూ వచ్చింది.

కాని ఒక దశలో ఫ్రాన్సులో మహావిప్లవం నాటి నుండి – బూర్జువావర్గం రాజకీయ అధికారాన్ని సైతం ఆక్రమించుకుంది, అప్పుడది శ్రామికవర్గంపైనా, సన్నకారు రైతులపైనా పాలకవర్గం అయింది. ఈ దృక్కోణం నుంచి చూసినప్పుడు సమస్త చారిత్రక ఘటనలనూ సమాజం యొక్క ప్రత్యేక ఆర్థిక పరిస్థితికి సంబంధించి తగినంత పరిజ్ఞానం వున్నట్లయితే–అత్యంత సరళమైన పద్ధతిలో వివరించడం సంభవం. అయితే, మన వృత్తి చరిత్రకారులలో ఈ పరిజ్ఞానం పూర్తిగా లోపించడం వాస్తవం! అదేవిధంగా, ప్రతి ఒక చారిత్రక దశ భావాలనూ జీవితపు ఆర్థిక పరిస్థితులను బట్టీ ఆ దశ యొక్క సామాజిక, రాజకీయ సంబంధాలను బట్టీ వివరించవచ్చు. ఇవి తిరిగి ఈ ఆర్థిక పరిస్థితులను బట్టే నిర్ధారితమవుతాయి. చరిత్ర మొట్టమొదటి సారిగా వాని వాస్తవ ప్రాతిపదికపైన నిలబడింది. అందరికీ స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, మనుషులు పెత్తనం కోసం పోరాడాలన్నా, రాజకీయాలు, మతం, తత్వశాస్త్రం మొదలైన

వాటిలో పాల్గొనాలన్నా, మొదట వారికి తినడానికి తిండీ, తల దాచుకోడానికి ఇల్లూ, కట్టుకునేందుకు దుస్తులూ వుండాలన్న, అందుకు గాను పని చేసి తీరాలన్న సంగతిని ఇంతకు ముందు పూర్తిగా విస్మరించారు. విస్పష్టమైన ఆ వాస్తవం చివరకు యిప్పుడు తన చారిత్రక ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. – చరిత్రకు సంబంధించిన ఈ కొత్త భావనకు సోషలిస్టు దృక్పథంలో అత్యధిక ప్రాముఖ్యం ఉంది.

**గత చరిత్ర యావత్తూ వర్గ వైరుధ్యాలలోనూ, వర్గ పోరాటాలలోనే గడిచిందనీ, పాలక వర్గాలూ, పాలిత వర్గాలూ, దోపిడీ చేసే వర్గాలూ, దోపిడికి గురయ్యే వర్గాలూ ఎల్లప్పుడూ ఉంటూ వచ్చాయనీ, మానవ జాతిలో అత్యధిక సంఖ్యాకులు ఎల్లప్పుడూ నడుం విరిగే శ్రమకూ, అల్ప సంతోషానికే గురి అవుతూ వచ్చారనీ ఈ చారిత్రక దృక్పథం నిరూపించింది.**

ఇది ఎందుకిలా జరిగింది? మానవజాతి అభివృద్ధి దశలన్నింటిలోనూ ఉత్పత్తి అతి తక్కువగా అభివృద్ధి చెందడమే ఇందుకు కారణం. ఆ కారణంగా చారిత్రకాభివృద్ధి ఈ శత్రు వైరుధ్య రూపంలో మాత్రమే ముందు సాగగలిగింది. మొత్తంగా చారిత్రకాభివృద్ధిని ప్రత్యేకహక్కులు కలిగిన అత్యల్ప సంఖ్యాకుల కు కేటాయించగా, అత్యధిక సంఖ్యాకులు తమ శ్రమ ద్వారా తమ కోసం నామమాత్రపు జీవితావసరపదార్థాలకు పరిమితుల య్యారు. దానికితోడు, ప్రత్యేక హక్కులు కలిగిన వారి కోసం అంతకంతకు అధికతర జీవితావసర పదార్థాలనూ తయారుచెయ్యవలసిన దుస్థితిలో కూడా పడ్డారు. కాని, గత వర్గ పాలనకు యీ విధంగా ఇంత సహజమూ, హేతుబద్ధమూ అయిన వివరణను సమకూర్చే యీ చరిత్ర పరిశీలన పద్ధతే మరో విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఈ చారిత్రిక పరిశీలనే లేకపోతే, మనిషి దుష్టత్వం మాత్రమే ఇందుకు కారణమని చెప్పాల్సి వుంటుంది! ఆధునిక కాలంలో ఉత్పాదక శక్తులు ఇంత విశేషంగా అభివృద్ధి చెందిన కారణంగా మానవ జాతిని పాలకులు గానూ, పాలితులు గానూ, : దోపిడీ చేసేవారు – దోపిడీ చెయ్యబడేవారు గానూ – కనీసం మిక్కిలి అభివృద్ధి చెందిన దేశాల్లోనైనా – విభజించేందుకు గల చిట్టచివరి సాకు సైతం అంతరించిపోయిందన్నదే ఆ విషయం. పాలక బడా బూర్జువా వర్గం తన చారిత్రక కర్తవ్యాన్ని పరిపూర్తి చేసింది, సమాజానికి నాయకత్వం వహించగల సామర్థ్యం దానికి ఇప్పుడిక ఎంత మాత్రం లేదు. ఉత్పత్తి అభివృద్ధికి అది ఒక సంకెలగా తయారైంది. వ్యాపార సంక్షోభాలూ, ప్రత్యేకించి ఇటీవలి అంతర్జాతీయ ఆర్థిక మహా సంక్షోభమూ, అన్ని దేశాల్లోని పరిశ్రమల హీనస్థితీ దీన్నే నిరూపించాయన్నదే ఆ విషయం. చారిత్రక నాయకత్వం శ్రామిక వర్గం చేతుల్లోకి మారింది. సమాజంలో మొత్తంగా తనకు గల స్థానం ఫలితంగా సమస్త వర్గ పాలననూ, సమస్త దాస్యాన్నీ, సమస్త దోపిడీని రద్దు చెయ్యడం ద్వారా మాత్రమే యీ వర్గం తనను తాను విముక్తం చేసుకోగలదన్నదే ఆ విషయం. బూర్జువా వర్గపు అదుపును మీరి పెరిగిన సామాజిక ఉత్పాదక శక్తులు జతగూడిన శ్రామికవర్గం తమ చేతుల్లోకి తమను తీసుకొనేందుకూ అటువంటి పరిస్థితుల ను కల్పించేందుకు నిరీక్షిస్తున్నాయి–అన్నదే ఆ విషయం. తద్వారా, ఏ పరిస్థితుల్లోనైతే సమాజంలోని ప్రతి ఒక్క సభ్యుడూ ఒక్క ఉత్పత్తిలోనే కాకుండా సామాజిక సంపద పంపిణీ నిర్వహ ణలలో పాల్గొనగలుగుతాడో, ఏ పరిస్థితుల్లోనైతే యావత్తు ఉత్ప త్తి ప్రణాళికాబద్ధంగా జరిగి సామాజిక ఉత్పాదక శక్తులనూ, వాటి ఫలసాయాన్నీ పెంచి, తద్వారా సమాజంలోని ప్రతి ఒక్క సభ్యుని సహేతుకమైన సకలావసరాల పరిదృప్తికీ నానాటికీ అధికతర హామీని కల్పిస్తుందో అటువంటి పరిస్థితులను కల్పించేందుకు నిరీక్షిస్తున్నాయి – అన్నదే ఆ విషయం!

## అదనపు విలువ సిద్ధాంతం

మార్క్స్ ముఖ్య ఆవిష్కరణల్లో రెండోది ఏమిటంటే, పెట్టుబడికీ శ్రమకీ మధ్య వున్న సంబంధం. వేరేమాటల్లో చెప్పాలంటే, ఆధునిక సమాజంలో, ప్రస్తుత పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో కార్మికుడు పెట్టుబడిదారు చేత ఏ విధంగా దోచుకో బడుతున్నాడో స్పష్టంగా వివరించడమే ఆ ఆవిష్కరణ. సమస్త సంపదకూ, సమస్త విలువకూ శ్రమే మూలం అన్న సూత్రాన్ని అర్థశాస్త్రం ప్రతిపాదించిన నాటి నుండీ ఈ కింది ప్రశ్న ముందుకు రాక తప్పలేదు: వేతన కార్మికుడు తన శ్రమ ద్వారా సృష్టింపబడిన విలువ మొత్తమంతటినీ పొందడం లేదు. దానిలో కొంత భాగాన్ని అతను పెట్టుబడిదారుకు అప్పగించవలసి వస్తోందన్న వాస్తవంతో దీనికి ఎలా పొత్తు కుదురుతుంది? బూర్జువా ఆర్థిక శాస్త్రవేత్తలూ, సోషలిస్టులూ ఈ ప్రశ్నకు శాస్త్రీయంగా ఆధారసహితమైన జవాబునిచ్చేందుకు బుర్రలు బద్దలుకొట్టుకున్నారు. చిట్టచివరకు మార్క్స్ దీనికి పరిష్కార మార్గాన్ని చూపాడు.

## ఆ పరిష్కారం ఇదీ :

ఆధునిక పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో రెండు సామాజిక వర్గాలు ఉండి తీరుతాయి. ఒక వంక ఉత్పత్తి సాధనాలనూ, జీవితావసర వస్తువులనూ కలిగి వున్న పెట్టుబడిదారీ వర్గం వుంటుంది. మరోవంక శ్రామికుల వర్గం వుంటుంది. ఉత్పత్తి సాధనాలకూ, జీవితావసర వస్తువులకూ దూరం చెయ్యబడిన శ్రామికులు అమ్ముకొనేందుకు తమ శ్రమశక్తి అనే ఒకే ఒక్క సరుకును మాత్రమే కలిగివుంటారు. అందుచేత జీవితావసర సాధనాలను సంపాదించుకోవాలంటే వీరు తమ శ్రమశక్తిని అమ్ముకొని తీరాల్సి వుంటుంది. కాని, ఒక సరుకు విలువను

ఎలా నిర్ణయిస్తారు? ఆ సరుకు ఉత్పత్తిలోనూ, కాగా దాని పునరుత్పత్తిలో మూర్తీభవించిన, సామాజికంగా అవసరమైన, శ్రమ పరిమాణం చేతనే దాని విలువను నిర్ణయించాలి. అందు చేత ఒక రోజులో, ఒక నెలలో లేక ఒక సంవత్సరంలో సగటు మానవుని శ్రమ శక్తి విలువ, ఒక రోజులో, ఒక నెలలో లేక ఒక సంవత్సరంలో ఈ శ్రమశక్తి పోషణకు అవసరమైన జీవితావసర వస్తువుల పరిమాణంలో మూర్తీభవించిన శ్రమ పరిమాణం చేత నిర్ణయింపబడుతుంది. ఒక రోజుకు ఒక కార్మికునికి అవసరమైన జీవితావసర వస్తువుల ఉత్పత్తికి ఆరుగంటల శ్రమ అవసరమవుతుందని అనుకుందాం. లేకుంటే వేరే మాటల్లో, ఆ జీవితావసర వస్తువులలో ఇమిడివున్న శ్రమ ఆరు గంటల శ్రమ పరిమాణానికి ప్రాతినిధ్యం వహిస్తుందని అనుకుందాం. అప్పుడు ఒక రోజు శ్రమశక్తి విలువ ఆరు గంటల శ్రమలో మూర్తీభవించిన డబ్బు మొత్తంలో వ్యక్తం చెయ్యబడుతుంది. మనం ఇంకొంచెం ముందుకు వెళ్లి చూద్దాం. మన ఈ కార్మికుడిని పనిలో పెట్టుకున్న పెట్టుబడిదారు అతని శ్రమకు ఈ మొత్తాన్ని ప్రతిఫలంగా యిచ్చినప్పుడు, అతని శ్రమశక్తి పూర్తి విలువను చెల్లించాడని అనుకుందాం. మరి ఇప్పుడు కార్మికుడు రోజులో ఆరుగంటలు పెట్టుబడిదారు కోసం పనిచేస్తే, పెట్టుబడిదారు పెట్టిన ఖర్చుకు పూర్తి విలువను కార్మికుడు పూర్తిగా తీర్చివేసినట్లే, అంటే ఆరుగంటల శ్రమకు ఆరుగంటల శ్రమ తీర్చాడన్నమాట. అప్పుడు దానిలో పెట్టుబడి దారుకు మిగిలేది ఏమీవుండదు. కాగా పెట్టుబడీదారు వ్యవహారం వంక పూర్తి భిన్నమైన పద్ధతిలో చూస్తాడు.

**అతనిలా అంటాడు :**

**నేనీ కార్మికుని శ్రమశక్తిని ఆరు గంటలకు కాక మొత్తం రోజంతకీ కొన్నాను. తదనుగుణంగా అతను, పరిస్థితులనుబట్టి, కార్మికుని చేత 8, 10, 12, 14 లేక అంతకన్న ఎక్కువ గంటలు పని చేయిస్తాను. ఈ కారణంగా ఏడవ, ఎనిమిదవ, గంటల యొక్క తదుపరి గంటల యొక్క ఉత్పాదితం చెల్లింపబడని శ్రమ అవుతుంది. అది పెట్టుబడిదారు జేబులోకి పోతుంది. ఈ విధంగా పెట్టుబడిదారు కొలువులో వున్న కార్మికుడు, ఏ శ్రమశక్తి విలువకైతే తనకు మూల్యం చెల్లింపబడుతుందో ఆ శ్రమశక్తి విలువను పునరుత్పత్తి చెయ్యడమే కాకుండా, అంతకుమించి అదనపు విలువను కూడా అతను ఉత్పత్తి చేస్తాడు.**

మొదట పెట్టుబడిదారు చేత స్వాయత్తం చేసుకోబడే యీ అదనపు విలువ, దాని తర్వాతి క్రమంలో కచ్చితమైన ఆర్థిక నియమాల ప్రకారం మొత్తం పెట్టుబడిదారీ వర్గం మధ్య పంపిణీ చెయ్యబడి, ఏ మూలనిధి నుంచి అయితే భూమికౌలు, లాభం, పెట్టుబడి సంచయనంగా రూపొందుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, శ్రమ చేయని వర్గాల చేత వినియోగింపబడే, పోగు చెయ్యబడే సంపద యావత్తూ ఉత్పన్నమవుతుందో ఆ మూలనిధిగా రూపొందుతుంది. కాని దీని వల్ల బానిస యజమాని లేక ఫ్యూడల్ ప్రభువుల ధనసంపద ఏ విధంగానైతే భూదాసుల యొక్క మూల్యం చెల్లింపబడని శ్రమహరణ ఫలితమో, అదేవిధంగా యీనాటి పెట్టుబడిదారుల ధనసంపద కూడా యితరుల మూల్యం చెల్లింపబడని శ్రమ ఫలితమే అన్న విషయం నిరూపితమవుతోంది. ఈ దోపిడి రూపాలన్నింటి మధ్యా గల భేదమల్లా మూల్యం చెల్లింపబడని శ్రమ ఏవిధంగా ఏ పద్ధతిలో స్వాయత్తం చేసుకోబడుతోందన్నది మాత్రమే. అయితే యిది ఆస్తిపరవర్గాల వంచనాత్మక పదజాలపు చిట్టచివరి ఔచిత్యాన్ని సైతం తొలగించివేసింది. ప్రస్తుత సామాజిక వ్యవస్థలో హక్కులు, న్యాయం, హక్కులూ విధుల సమానత్వం, ప్రయోజనాల సార్వత్రిక సామరస్యం వున్నాయనే మాట అర్థరహిత మయిపోయింది. ప్రస్తుత బూర్జువాసమాజం, తనకంటే ముందరి సమాజాల మాదిరిగానే, అంతకంటే ఏ మాత్రమూ తక్కువ కాకుండా అల్ప సంఖ్యాకుల చేత – అత్యధిక సంఖ్యాకుల దోపిడిని సాధ్యం చేసే ఆడంబరపూర్వకమైన ఒక వ్యవస్థ మాత్రమే అన్న విషయాన్ని బహిర్గతం చేసింది. పైగా, ఈ అల్ప సంఖ్యాకుల సంఖ్య నానాటికీ యింకా తగ్గుతోంది.

ఆధునిక శాస్త్రీయ సోషలిజం ఈ రెండు ముఖ్యమైన వాస్తవాలపై ఆధారపడి వుంది. 'పెట్టుబడి' రెండవ సంపుటంలో పెట్టుబడిదారీ వ్యవస్థకి సంబంధించిన ఈ అంశాలూ, యింత కంటె బహుశా ఏ కొంచమో మాత్రమే తక్కువ ముఖ్యమైన ఇతర శాస్త్రీయ పరిశోధితాంశాలూ మరింత సవిస్తరంగా వివరింప బడుతాయి. ఈ విధంగా అర్థశాస్త్రం యొక్క ఏ పార్శ్వాలైతే మొదటి సంపుటంలో చర్చకు రాలేదో అవి రెండవ సంపుటంలో విప్లవాత్మకమైన మార్పులు పొందుతాయి. మార్క్స్ ఈ రెండవ సంపుటాన్ని త్వరలో ముద్రణకు సంసిద్ధం చెయ్యగలగాలన్నదే మన హృదయపూర్వకమైన ఆకాంక్ష.

**(1877 జూన్ మధ్యలో, మార్క్స్ మరణానికి ఆరేళ్ళ ముందు, ఎంగెల్స్ ఈవ్యాసం రాశారు.)**

(1). 1842 జనవరి నెలలో మొదలైన రెయినిష్ జెయిటుంగ్ 1843 మార్చిలో మూతపడింది. ప్రష్యన్ పాలకుల సెన్సారు వేధింపుల కారణంగానే ఈ పత్రిక మూతపడింది.

(2). ఆ రోజుల్లో పోలీస్ కౌన్సిలర్ డాలేషాల్ ముందుగా సెన్సార్ కత్తెర పట్టేవారు. ఈ మహానుభావుడు మహామేధావి కూడా. 13 –14 శతాబ్దాలకు **(మిగతా 13వ పేజీలో)**

# మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ ప్రసంగం



- ఫ్రెడరిక్ ఎంగెల్స్

**మార్చి 14వ తేదీన, మధ్యాహ్నం పావు తక్కువ మూడు గంటలకు, ప్రపంచంలోకెల్ల మహత్తర ఆలోచనాపరుని ఆలోచనా క్రియ ఆగిపోయింది. ఆయన్ని మహా అయితే రెండే రెండు నిమిషాలు విడిచి బయటకు వెళ్లి వుంటామేమో, కాని మేము తిరిగి వచ్చేసరికి ఆయన పడక కుర్చీలో శాంతంగా నిద్రపోతున్నాడు - అయితే అది శాశ్వత నిద్ర. ఈ మనిషి మృతి మూలంగా యూరప్, అమెరికాలలోని సమరశీల శ్రామిక వర్గానికీ, చారిత్రక విజ్ఞాన శాస్త్రానికీ అపారమైన నష్టం వాటిల్లింది. ఈ మహాత్ముని మహాప్రస్థాన కారణంగా ఏర్పడిన లోటు జనానికి త్వరలోనే అనుభూతమవుతుంది.**



డార్విన్ ఏ విధంగానైతే జీవప్రకృతి యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడో, సరిగా అదే విధంగా మార్క్స్ మానవ చరిత్ర అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడు. భావజాలం అమితవృద్ధి కారణంగా ఇంతదాకా మరుగున పడిపోయిన ఒక సరళ సత్యాన్ని, రాజకీయాలు, విజ్ఞానశాస్త్రం, కళలు, మతం మొదలైన వాటిలో నిమగ్నులు అవగలిగేందుకు ముందు మానవ జాతికి అన్నపానాలూ, వాస వస్త్రాలూ అవసరమన్న విషయాన్ని ఆయన కనుగొన్నాడు. కాగా, అత్యవసర జీవనాధార వస్తువుల ఉత్పత్తి, తత్పర్యవసానంగా ఒక యుగంలో లేక ఒక జాతి ప్రజల చేత సాధించబడిన ఆర్థికాభివృద్ధి స్థాయే ఆ ప్రజల యొక్క రాజ్య సంస్థలకు, న్యాయశాస్త్రానికి సంబంధించిన భావనలు, కళలు, చివరకు మతానికి సంబంధించిన భావాలు సైతం క్రమాభివృద్ధి చెందడానికి పునాది. అందుకని వీటన్నింటినీ ఈ పునాది దృష్ట్యానే - ఇంత వరకు జరుగుతున్నట్లు, ఇందుకు తలకిందులుగా కాకుండా - వివరించాల్సి వుంటుంది. అయితే అంతమాత్రమే కాదు. సమకాలీన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, ఈ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్నీ శాసించే ప్రత్యేక గతి నియమాన్ని కూడా మార్క్స్ కనుగొన్నాడు. అదనపు విలువ ఆవిష్కారంతో, ఏ సమస్యను పరిష్కరించే ప్రయత్నంలోనైతే అంతకు పూర్వపు అటు బూర్జువా అర్థశాస్త్రజ్ఞుల యొక్క ఇటు సోషలిస్టు విమర్శకుల యొక్క - అన్వేషణలన్నీ అంధాన్వేషణలుగానే మిగిలిపోయాయో, ఆ సమస్యపైన కాంతి ప్రసరింపబడింది.

ఒక జీవితానికి అటువంటి ఆవిష్కరణలు రెండు చాలు. అటువంటి ఒక్క ఆవిష్కరణను చేసే అదృష్టం లభించిన వ్యక్తి సైతం భాగ్యశాలి అనే చెప్పాలి. కాని మార్క్స్ తను పరిశోధన జరిపిన ప్రతి రంగంలోనూ మరి ఆయన చాలా రంగాల్లోనే - పరిశోధన జరిపాడు, అలా పరిశోధన జరిపిన ఏ ఒక్క రంగంలోనూ ఆషామాషీగా పైపైన తడిమి విడిచిపెట్టలేదు. గణితశాస్త్రం తో బాటు ప్రతి ఒక్క రంగంలోనూ కూడా ఆయన స్వతంత్రమైన ఆవిష్కరణలు చేశాడు.

అటువంటి విజ్ఞాన శాస్త్రవేత్త ఆయన. అయితే విజ్ఞాన శాస్త్రవేత్తగా ఆయన ఆ రూపం ఆయన సమగ్ర వ్యక్తిత్వంలో అర్థాంశం కూడా కాదు. మార్క్స్‌కు సంబంధించినంత వరకు విజ్ఞాన శాస్త్రం చారిత్రకంగా క్రియాత్మకమైన, విప్లవాత్మకమైన ఒక శక్తి. ఏ విజ్ఞానశాస్త్ర సిద్ధాంతంలోనైనా ఒక కొత్త ఆవిష్కరణ జరిగితే - ఆచరణలో దాని అన్వయాన్ని గురించి ఆలోచించడం సైతం ఇంకా అసంభవమే అయినా కూడా - దానికి ఆయన మహా సంతోషంగా స్వాగతం పలికేవాడు. కాని అదే ఆవిష్కరణ పరిశ్రమల్లోనూ, మొత్తంగా చారిత్రకాభివృద్ధిలోనూ రక్షణ

విప్లవాత్మక మార్పులకు దారి తీసినట్లయితే ఆయన మరో రకమైన ఆనందానుభూతి పొందుతూండేవాడు. ఉదాహరణకు, విద్యుచ్ఛక్తి రంగంలో జరిగిన ఆవిష్కరణల అభివృద్ధి క్రమాన్ని, మర్సేల్ దెప్రే ఇటీవలి ఆవిష్కరణలతోపాటు మార్క్స్ అత్యంత శ్రద్ధాసక్తులతో గమనించేవాడు.

మార్క్స్ అన్నిటికంటే ముఖ్యంగా విప్లవవాది కావడమే ఇందుకు కారణం. ఏదో ఒక రకంగా పెట్టుబడిదారీ సమాజాన్నీ, అది సృష్టించిన రాజ్యసంస్థలను కూల్చివెయ్యడానికి తోడ్పడడం, ఆధునిక శ్రామికవర్గ విముక్తికి తోడ్పడడమే ఆయన జీవిత పరమోద్దేశ్యం. దానికి తన స్థితినీ, అవసరాలనూ గురించిన చైతన్యాన్ని కలిగించి, ఏ పరిస్థితుల్లో దాని విముక్తి సంభవమో తెలియజెప్పిన మొట్టమొదటివాడు ఆయనే. పోరాటం జరపడమే ఆయన సహజగుణం. మరి ఆయన అతి కొద్దిమందికి మాత్రమే సాధ్యమైన ఆవేశంతో, పట్టుదలతో, సాఫల్యంతో ఆ పోరాటాన్ని సాగించాడు. మొదటి Rheinische Zeitung(1842)లో, పారిస్ Vorwarts(1844)లో, Deutsche-Brusseler Zeltung(1847)లో, Neue Rheinische Zeitung (1848-49)లో, New York Tribune (1852-61)లో ఆయన చేసిన పని, దీనికితోడు సమరశీలమైన అనేక చిన్న పుస్తకాల రచన, పారిస్, బ్రస్సెల్స్, లండన్లలోని సంఘాల్లో చేసిన పని, చిట్టచివర ఆయన సేవల్లోకెల్ల శిఖరప్రాయమైనదైన ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ సంస్థాపన - ఇదెంతటి గొప్ప పని అంటే, ఈ సంఘ సంస్థాపకుడు, తను మరేదీ చెయ్యకపోయినా కూడా, ఈ ఒక్క పనికే సముచితంగా గర్వించవచ్చు. మరి వీటన్నింటి పర్యవసానంగానే, మార్క్స్ తన కాలంలో అందరికన్నా ఎక్కువగా ద్వేషింపబడ్డాడు. అభాండాలకు గురయ్యాడు. రాజరిక, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ ఆయనను తమ తమ దేశాల నుంచి బహిష్కరించాయి. బూర్జువాలు, వారు మితవాదులైనా, లేక పరమ ప్రజాస్వామ్య వాదులైనా కూడా, మార్క్స్‌పై అభాండాలు కురిపించడంలో ఒకరితో మరొకరు పోటీ పడ్డారు. ఇవన్నీ ఏదో ఒక సాలెగూడన్నట్లు ఆయన వీటన్నింటినీ తోసిపారేశాడు. వీటిని మనస్సుకు పట్టించుకోలేదు. మరీ తప్పనిసరి అవసరం ఏర్పడినప్పుడు మాత్రమే వీటికి సమాధానమిచ్చాడు. మరి ఇప్పుడాయన మన మధ్య లేడు.

**సైబీరియా గనులు మొదలు కొని కాలిఫోర్నియా దాకా, అమెరికాలలో అన్ని ప్రాంతాల్లోనూ గల లక్షలాది మంది ఆయన విప్లవవాద కార్మిక సహచరులు ఆయనను ప్రేమిస్తున్నారు, ఆయనను గౌరవిస్తున్నారు. ఈనాడు ఆయన మృతి పట్ల అశ్రుధారలు కురిపిస్తున్నారు. నేనొక విష యం ధైర్యంగా చెప్పగలను. ఆయనకు పలువురు వ్యతిరేకులు ఉండి వుండవచ్చునేమో గాని ఆయనకు వ్యక్తిగత శత్రువు మాత్రం ఒక్కడూ లేడు. ఆయన పేరు యుగయుగాలదాకా అమరంగా వుంటుంది, అలాగే ఆయన కృషి కూడా చిరస్థాయి గా వుంటుంది.**

(లండన్‌లోని హైగేట్ శ్మశాన వాటికలో 1883, మార్చి 17న ఎంగెల్స్ ఇంగ్లీషు భాషలో చేసిన ప్రసంగం) జర్మన్ భాషలో, 1883, మార్చి 22న, Der Sozialdemokrat 13వ సంచికలో ప్రచురింపబడింది. ❑

---

# కార్ల్ మార్క్స్ - జీవితమూ, కృషి

**(11వ పేజీ తరువాయి)**

చెందిన ఇటాలియన్ కవి దాంతే రాసిన "డివైన్ కామెడీ" అనువాదం గురించి కలోనిష్ జెయి టుంగ్‌లో వచ్చిన ఓ ప్రకటనను కొట్టిపారేశాడు. దేవుడికి సంబంధించిన విషయాలను కామెడీ చెయ్యకూడదని వ్యాఖ్యానం కూడా చేశాడట!

(3). 1820లో హెగెల్ రాసిన హక్కుల తాత్వికత - మూల ధాతువులు అనే సిద్ధాంత పత్రంపై మార్క్స్ విమర్శ డాయిష్ ఫ్రాంజోసిషె యార్బూషెర్ పత్రికలో 1844లో అచ్చయింది.

(4). అలెగ్జాండర్ ఫాన్ హుంబోల్ద్ బహుముఖ ప్రజ్ఞావంతుడిగా ప్రసిద్ధుడు. భూగోళ శాస్త్రం, ప్రకృతి శాస్త్రం, తత్వశాస్త్రం తదితర రంగాల్లో పేరు తెచ్చుకున్న హుంబోల్ద్ ప్రష్యన్ సామ్రాజ్య సేవలో తరించాడు!

(5). 1847 ఆగస్టు నెలలో మార్క్స్ -ఎంగెల్స్ బ్రస్సెల్స్ నగరంలో జర్మన్ వర్కర్స్ సొసైటీని స్థాపించారు.

(6). 1847 ఏప్రిల్ - 1848 ఫిబ్రవరి మధ్యకాలంలో నడిచిన పత్రిక "డాయిష్ బ్రుసెలర్ జెయిటుంగ్ ". ఈ పత్రికలో మార్క్స్-ఎంగెల్స్ పాతిక ముప్పై వ్యాసాలు రాశారు.

(7). 1848 జూన్ ఒకటో తేదీన మొదలై, 1849 మే 19న మూతపడిన "నేవే రెయినిష్ జెయిటుంగ్" చారిత్రిక ప్రాధాన్యం కలిగి వున్న పత్రిక. 1848 నాటి జర్మన్ విప్లవ పోరాటాల స్ఫూర్తిని ఈ పత్రిక ప్రతిఫలించింది. ❑

# మార్క్స్‌తో, మార్క్స్‌లో వ్యక్తిగత ప్రయాణం



- ఎన్.వేణుగోపాల్

**నా ఈ అక్షరాలు, ఆలోచనలు, అడుగులు, నుడుగులు, ఎంత స్వల్పమైనవైనా పనులు మార్క్స్ చూపిన మార్గంలోనే. ఆయన ఆలోచనాచరణల ఛత్రచ్ఛాయలోనే, వెలుగుబాటలోనే ఈ జీవితం గడిచింది. ఇదివరకు అనేకసార్లు చెప్పినట్టు, "రూపమూ సారమూ  ఒకటే అయితే శాస్త్రం అవసరం లేదు" అని ప్రపంచాన్నంతా ఇముడ్చుకున్న, ప్రపంచాన్నంతా వివరించగల మహోజ్జ్వలమైన మార్గదర్శక విశ్లేషణా సూత్రం ఇచ్చినందుకు ఆయనకు తీర్చుకోలేని రుణంలో ఉన్నాను.**

నేను చాలా గౌరవించే డీవీవీఎస్ వర్మ గారు మార్క్స్ ప్రత్యేక సంచిక తెస్తున్నామని, ఏదైనా వ్యాసం రాయమని, కనీసం పాత వ్యాసమైనా పంపమని ఏడాది కింద అడిగారు. పనుల ఒత్తిడి వల్ల పాత వ్యాసం ఏదైనా పంపుదామనే మొదట అనుకున్నాను. కాని ప్రయత్నించి అయినా సమయం చేసుకుని కొత్త వ్యాసం రాయాలనీ, అది కూడా మార్క్స్‌తో, మార్క్స్‌లో నా ప్రయాణం గురించి రాయాలనీ అనుకుని ఈ వ్యాసం మొదలుపెట్టాను. వర్మ గారు అడిగిన గడువు లోపల అది పూర్తి చేయడం కుదర లేదు. సగం రాసిన వ్యాసం అలాగే ఉండిపోయింది. ఈ సారి మార్క్స్ పుట్టినరోజు కానుకగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాను. మార్క్స్‌తో, మార్క్స్‌లో వ్యక్తిగత ప్రయాణం అంటే ఇదేదో నా గురించి చెప్పుకోవడానికి కాదు. నావంటి వాళ్లెందరో ఉన్నారు. ఉంటారు గనుక నా ఈ మాటలు వాళ్ల గుండెలను రవరవలాడిస్తాయే మోనని, వాళ్ల జ్ఞాపకాలను తట్టి లేపుతాయని నా ఆశ.

మార్క్స్ గురించి విని, ఏదో ఒక రచన చదివి, అబ్బురపడి, మరిన్ని రచనలు చదివి, ఆయన ఆలోచనల మార్గంలోకి వచ్చిన వాళ్లు, ఆయనను అర్థం చేసుకుని ఇతరులకు అర్థం చేయించడానికి ప్రయత్నించిన వాళ్లు, ఆయన చూపిన మార్గంలో తమకు చేతనైన ఆచరణలోకి దిగినవాళ్లు, ఆయన చూపిన మార్గంలో పయనిస్తున్నదని తమకు అనిపించిన ఏదో ఒక బృందంతో కలిసి నడుస్తూ ఆచరణలోకి వచ్చిన వాళ్లు తెలుగు సమాజంలో గత 80 - 90 సంవత్సరాలలో కొన్ని వేల మందో లక్షల మందో ఉంటారు. ఆ మహాజన సమూహంలో ఒకానొక పిపీలికం కథ ఇది. ఉడికిన అన్నంలో ఒక మెతుకు కథ. సాహిత్య విద్యార్థిగా, స్థూలంగా ప్రజా ఉద్యమాల అభిమానిగా ఉంటూ, నక్సల్బరీ శ్రీకాకుళ ప్రజ్వలనతో 1968-69 నాటికి మార్క్సిస్టుగా మారిన మా మేనమామ వరవరరావు గారి వల్ల



మార్క్స్ ద్వి శత జయంతి సందర్భంగా ఆయన పుట్టిన ట్రియర్ నగరంలోని స్మారక చిహ్నం

నాకు ఊహ తెలిసే నాటికే ఇంట్లో మార్క్స్ ప్రభావం ఉంది. సృజన దగ్గరా, తన దగ్గరా ఎక్కువైపోయిన పుస్తకాలను జడ్చర్ల నుంచీ, వరంగల్ నుంచీ వివి మా రాజారం ఇంటికి చేర్చేవారు గనుక నా ఏడెనిమిదేళ్లకే మా ఇంట్లో పుస్తకాలు నిండిపోయాయి. బడిపలుకులు కాక, పలుకుబడులు చదవడం మొదలుపెట్టే నాటికే మా ఇంట్లో మార్క్సిస్టు పుస్తకాలున్నాయి. అందువల్ల నేను ఆ గుబురు గడ్డం మనిషి బొమ్మ ఎన్నో పుస్తకాల మీద పదేళ్లు నిండకుండానే చూశాను. ఆ కళ్లలోంచి ప్రవహించే జ్ఞానంలో, దయలో తడిసిపోయాను. కారల్ మార్క్స్ అనే పేరు విన్నాను. అలా ఏడో తరగతికి ముందే, మా రాజారంలోనే, అట్టల మీద బొమ్మలు చూడడం నుంచి ఆ అట్టలు దాటి లోపలి అక్షరాల్లోకి ప్రయాణించడం మొదలుపెట్టా. నాకు గుర్తున్నంత వరకు, అర్థం అయినా కాకపోయినా, చాలా వరకు అర్థం కాకుండానే కమ్యూనిస్టు ప్రణాళిక అప్పుడే చదివినట్టున్నాను. మార్క్స్ ఎంగెల్స్‌ల గురించి మిత్రుల స్మృతులు వంటి పేరున్న మరో పుస్తకం కూడా తొలి రోజుల్లో చదివిన గుర్తు. ఎనిమిదో తరగతికి 1973లో హనుమకొండ వచ్చాక మార్క్స్‌ను శ్రద్ధగా చదవడం, కొంతైనా అర్థం చేసుకోవడం మొదలయ్యాయనాలి. ఆ చదువు నదిని విశాలమూ పుష్కలమూ చేసినవి మూడు నాలుగు ప్రవాహాలు - సృజన సాహితీ మిత్రులు, పుస్తకాల దుకాణాలు, ఎమర్జెన్సీలో దొరికిన పత్రికలు, విప్లవోద్యమ మిత్రులు.

మొట్ట మొదట చెప్పవలసినది సృజనలో అచ్చవుతున్న రచనల ద్వారా అందిన మార్క్సిస్టు దృక్పథం. సాహితీ మిత్రుల సమావేశాల్లో సృజనకు వచ్చిన రచనలను ఒకరు ఎలుగెత్తి చదువుతుంటే అవసరమైన చోటల్లా ఆపి, పదాల మీద, వాక్యాల మీద, భావనల మీద చర్చలు సాగుతుంటే మార్క్సిస్టు సిద్ధాంతాల అన్వయం అపురూపంగా అనుభవంలోకి వస్తుండేది. మార్క్సిజం సిద్ధాంతంగా చదవక ముందే అన్వయంగా అలా మనసులోకి దిగడం మొదలయింది. సాహితీమిత్రుల సమావేశంలో వచ్చిన రచనల్లోని కవిత్వం, కథలు చదవడం నా బాధ్యత. ప్రతి పంక్తికీ, వాక్యానికీ, వ్యక్తీకరణకూ ఆగి, దాని మీద వ్యాఖ్యలకూ, వివరణలకూ, చర్చలకూ అవకాశం ఇవ్వవలసి ఉండేది. ఆ వ్యాఖ్యలూ, వివరణలూ, చర్చలూ మార్క్సిస్టు భావధారతో వెలుగులీనుతుండేవి. అటువంటి సామూహిక పఠనమూ, లోతైన చర్చలు జరిగిన సందర్భాలు 1974 -75, ఆ తర్వాత 1977-82. ఇంకా అక్కడికి పోకముందే నన్ను మార్క్స్‌కు దగ్గర చేసిన ఇతర ప్రవాహాల గురించి చెప్పాలి. 1973 అక్టోబర్‌లో వరంగల్‌లో జరిగిన విప్లవ రచయితల సంఘం సాహిత్య పాఠశాల నాటికి ఏడెనిమిది ప్రచురణలతో శ్రామికవర్గ ప్రచురణలు అనే ప్రచురణ సంస్థ ప్రారంభమయింది. దీని వెనుక ఉన్నది వివి, డా.రామనాథం గారు, ఇటీవల మరణించిన లక్ష్మణ్, సేటు అనే పి.లక్ష్మినారాయణ గారు. ఆ ప్రచురణలు మొదలయ్యాక ఆరేడు నెలలకు, ఎమర్జెన్సీకి ఏడాది ముందు శ్రామిక వర్గ ప్రచురణలు వరంగల్ గిర్మాజిపేటలో ఒక పుస్తకాల దుకాణాన్ని తెరిచింది. ఆ దుకాణం ప్రధాన బాధ్యత మా అన్నయ్య రాంగోపాల్‌దైనా, దుకాణంలో అప్పుడప్పుడు నేను కూచోవలసి వచ్చేది. అక్కడ సోవియట్ పుస్తకాలు, విశాలాంధ్ర, ప్రజాశక్తి ప్రచురణలు అమ్మకానికి ఉండేవి. దుకాణంలో రద్దీ కన్న ఎక్కువ ఖాళీనే ఉండేది. పది పైసలకూ, ఇరవై పైసలకూ ఉండే మార్క్స్ పుస్తకాలు, మార్క్స్ సిద్ధాంతాల అన్వయాల పుస్తకాలు ఆ ఖాళీలో అక్కడే చదివాను. (ఆ దుకాణంలో కూచుని చదివిన మకరెంకో 'విజయధ్వజం' తలచుకుంటే నలభై ఎనిమిదేళ్ల తర్వాత ఇవాళ్టికీ నాకు ఉత్తేజం కలుగుతుంది). ఎమర్జెన్సీలో సృజన ఆగిపోయింది. పుస్తకాల దుకాణమూ మూతబడింది. సభలూ సమావేశాలూ ఆగిపోయాయి. అప్పుడు చదవడానికి దొరుకుతుండిన ఒకటి రెండు పత్రికలలో ప్రజాశక్తి వారపత్రిక ఒకటి. బహుశా సెన్సార్ నిబంధనల నుంచి తప్పించుకోవడానికి కావచ్చు. ప్రజాశక్తిలో సమకాలీన అంశాలకన్నా ఎక్కువగా మార్క్సిస్టు సిద్ధాంత పరిచయాలు, పుస్తక పరిచయాలు ఎక్కువగా ప్రచురిస్తుండేవారు. అలా మార్క్స్‌ను చదవడానికి మరొక మార్గం తెరుచుకుంది. ఎమర్జెన్సీ నడుస్తుండగానో, అయిపోయిన కొత్తలోనో విశాలాంధ్ర బుక్ హౌజ్ వరంగల్ బ్రాంచ్ మండీ బజార్‌లో తెరిచారు.


అప్పటికి ఇంటర్మీడియట్ తప్పి ఖాళీగా ఉన్న సంవత్సరం సృజన ప్రూఫులు దిద్దడానికి దాదాపు ప్రతి రోజూ వరంగల్ ప్రెస్‌కు వెళ్తుండేవాణ్ని. ప్రెస్ పని అయిపోయాక మండీ బజార్ దాకా నడుచుకుంటూ వచ్చి విశాలాంధ్ర బుక్ హౌజ్‌లో కొన్ని గంటలు గడపడం, ఒకటో రెండో పుస్తకాలు కొనుక్కోవడం మొదలైంది. అప్పటికి కమ్యూనిస్టు ప్రణాళిక చదివి ఉన్నాను. మార్క్స్ రచన గోథా కార్యక్రమ పరిశీలన ఎమర్జెన్సీలో జైలులో ఉండగా కేవీఆర్ చేసిన అనువాదం ఎమర్జెన్సీ అయిపోగానే క్రాంతి ప్రచురణలుగా వెలువడింది. మండీ బజార్ విశాలాంధ్రలో కొనుక్కున్న పుస్తకాల్లో 'లూయీ బోనపార్టీ, బ్రుమేర్ 18వ తేదీ' చదివి, ఆ చరిత్ర అప్పుడప్పుడే తెలుసుకోవలసి వచ్చినా, అది క్లిష్టంగా ఉన్నా, సమకాలీన ఘటనలను అంత లోతుగా చూసే, విశ్లేషించే శక్తికి అబ్బురపడ్డాను. అప్పటికే నా మీద సివి సుబ్బారావు ప్రభావంవల్ల అర్థశాస్త్రం మీద ఆసక్తి పెరుగుతున్నది గనుక, ఇంటర్మీడియట్ పాసై, బీఏలో చేరి, అర్థశాస్త్రం పాఠ్యాంశంగా చదవడం మొదలుపెట్టాను. సహజంగానే మార్క్స్ అర్థ శాస్త్ర రచనల్లోకి ప్రవేశించాను. ఆ రోజుల్లోనే విశాలాంధ్ర మండీబజార్ నుంచి హనుమకొండకు మారింది. ఇంటికి కూత వేటు దూరంలోకి వచ్చింది. అప్పుడే కంభంపాటి సత్యనారాయణ గారు ఎంపిక చేసి, అనువదించిన మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, ఝుర్జెన్స్కీ, కాలినిన్‌ల రచనల అద్భుతమైన సంకలనం 'కమ్యూనిస్టు నీతి' విశాలాంధ్ర ప్రచురణగా వెలువడింది. అది

చిన్న 200 పేజీల పుస్తకమే గాని జీవితాదర్శాలు ఏర్పడడానికి, బలపడడానికి మహత్తరమైన పునాది కల్పించే పుస్తకం అది. ఆ పుస్తకం కంఠోపాఠమైన రోజులున్నాయి. అందులో జోసెఫ్ వెడిమియర్‌కు తమ కుటుంబ కష్టాల గురించి జెన్నీ రాసిన ఉత్తరం వందలసార్లో వేల సార్లో చదివి ఉంటాను. ఏ ఒక్కసారీ చెంపల మీద కన్నీళ్లు జాలు వారకుండా చదివి ఉండను. అలా డిగ్రీ మొదటి రెండు సంవత్సరాల్లోనే మార్క్స్ ఎంగెల్సూ జెన్నీ లారా ఇలియనారూ అందరూ నాకు అత్యంత సన్నిహిత కుటుంబ మిత్రులైపోయారు. అప్పుడే సుబ్బారావు కాపిటల్ చదవమని ప్రోత్సహించాడు గాని అప్పటికి లోపలికి పోలేకపోయినా, ఫ్రెంచ్ అనువాదానికి ముందుమాటలో మార్క్స్ రాసిన మాటలు మనసుకు ఎంత హత్తుకు న్నాయంటే, డిగ్రీ మూడేళ్లూ నా నోట్ బుక్స్ మీద మొదటి పేజీల్లో..

There is no royal road to science, and only those who do not dread the fatiguing climb of its steep paths have a chance of gaining its luminous summits. **(శాస్త్రం నేర్చుకోవడానికి రాజమార్గమేమీ లేదు. కొండ ఎక్కేటప్పుడు దాని నిటారైన కష్టతరమైన బాటల మీద అలసిపోగొట్టే నడక సాగించడానికి భయపడని వారికే కొండకొమ్ము మీద ఉజ్వల కాంతిని చేరుకునే అవకాశం వస్తుంది)** అని రాసి పెట్టుకునేవాణ్ని. అప్పుడే, డిగ్రీ మొదటి సంవత్సరంలో పరిచయమైన ఫ్రాన్సిస్ బేకన్ I have taken all knowledge to be my province **(సమస్త జ్ఞానాన్నీ నా పరిధిలోకి తీసుకున్నాను)** సరేసరి.

అక్కడి నుంచి ఉస్మానియాకు వచ్చి ఎంఏ ఎకనమిక్స్‌లో చేరడమూ, మూడు, నాలుగు నెలల్లోనే మార్క్స్ శత వర్ధంతి సంవత్సరం ప్రారంభం కావడమూ మార్క్స్‌లో మరింత మునగడానికి కారణమయ్యాయి. అప్పుడే హైదరాబాద్ బుక్ ట్రస్ట్ 'కార్టూన్లలో మార్క్స్' పుస్తకానికి బాలగోపాల్ అనువాదం ప్రచురిస్తే, దాని మీద ఆంధ్రభూమి దినపత్రికలో సమీక్ష రాశాను. మార్క్స్ శత వర్ధంతి సందర్భంగా ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో ఒక వ్యాసం రాశాను. ఆ వేడిలోనే కాపిటల్ చదివాను గాని ఆ మొదటి పఠనంలో అర్థం కావలసినంత అర్థం అయిందని చెప్పలేను. అప్పుడే మార్క్స్ శతవర్ధంతి ముగింపు సందర్భంగా విరసం చిత్తూరులో 1984 మేలో మార్క్స్ పాఠశాల జరిపింది. ఆ పాఠశాలలో 'మార్క్స్ రాజకీయార్థ శాస్త్రం' మీద ఆర్ఎస్ రావు గారు పాఠం చెప్పగా, అధ్యక్షత వహించవలసి ఉండిన సివి సుబ్బారావు రాకపోవడంతో అప్పటికప్పుడు నన్ను అధ్యక్షత వహించమని కోరారు. బహుశా అది మార్క్స్ మీద నా మొదటి ఉపన్యాసం కావచ్చు. అప్పుడే ఢిల్లీ మత కల్లోలాల, సిక్కుల ఊచకోత సందర్భంగా మతం మీద మార్క్స్ రచన తెలుగు చేశాను. తర్వాత రెండు మూడు సంవత్సరాలలో ఎకనమిక్ అండ్ ఫిలసాఫికల్ మాన్యుస్క్రిప్ట్స్, జర్మన్ ఐడియాలజీ నన్ను చాలా ప్రభావితం చేసిన పుస్తకాలు. ఈపీఎం, జర్మన్ ఐడియాలజీలను ఎన్నోచోట్ల ఉటంకించాను. నా రచనలకూ ఉపన్యాసాలకూ వాడుకున్నాను. ఈపీఎం ప్రోగ్రెస్ పబ్లిషర్స్ ప్రచురణను ముందు నుంచి వెనక్కీ, వెనక నుంచీ ముందుకూ చదువుతూ దానిలో మునిగి ఉన్నప్పుడే, హైదరాబాద్‌లో మాక్స్ ముల్లర్ భవన్ మూసేస్తూ, వాళ్ల పుస్తకాలన్నీ అమ్మేస్తుంటే, ఆ పుస్తకాల్లో డర్క్ జె స్ట్రుయిక్ చేసిన మరొక అనువాదం దొరికి, ఈపీఎంను మరింత ఎక్కువ అర్థం చేయించింది. ఆ రోజుల్లోనే మార్క్స్ పరాయీకరణ భావన మీద ఇస్త్వాన్ మెస్జరోస్ రాసిన పుస్తకపు ఫొటోస్టాట్ కాపీ ఒక మిత్రుడు కానుకగా ఇచ్చాడు. 'అల్లం రాజయ్య కథలో పరాయీకరణ' అనే వ్యాసం రాయడానికి, పరాయీకరణ భావన మీద చాలాచోట్ల మాట్లాడడానికీ, రాయడానికీ పునాది వేసినది ఎకనమిక్ అండ్ ఫిలసాఫికల్ మాన్యుస్క్రిప్ట్సు, దాని ఆధారంగా వచ్చిన దాదాపు డజను పుస్తకాలూ. ఈ క్రమంలోనే మార్క్స్, ఎంగెల్స్‌ల ఇతర రచనలు చదవడం, ఆన్ లిటరేచర్‌లో, ఇతర రచనల్లో, ఉత్తరాల్లో ఆయన చూపిన మార్గాన్ని నా రచనల్లో, ఉపన్యాసాల్లో అనుసరించడానికి ప్రయత్నించడం సాగించాను. ఆంధ్రప్రదేశ్ లో ఒక విప్లవ పార్టీనీ, ఆరు ప్రజా సంఘాలనూ నిషేధించినప్పుడు, సృజన నడపలేని పరిస్థితి వచ్చినప్పుడు చివరి సంచికలో ప్రష్యన్ రాజ్యపు సెన్సార్ షిప్ మీద మార్క్స్ రాసిన అద్భుతమైన వ్యాసాన్ని తెలుగు చేశాను. నూతన ఆర్థిక విధానాల ప్రవేశంతో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలను విమర్శిస్తూ రాసిన ఎన్నో రచనలకు, చేసిన ఎన్నో ఉపన్యాసాలకు మార్క్స్ చూపిన తోవే పునాది. ఆ క్రమంలో మార్క్సిస్టు రాజకీయార్థ శాస్త్ర భావనల మీద, ప్రపంచీకరణ విధానాల మీద, డంకెల్ డ్రాఫ్ట్ మీద, విజన్ 2020 మీద, అమ్మకానికి ఆంధ్రప్రదేశ్ మీద, 2008 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం మీద రాసిన వ్యాసాలూ, చేసిన ఉపన్యాసాలూ మార్క్స్ అధ్యయనం లేకుండా జరిగి ఉండేవే కావు. అంటే ఒక రచయితగా, వక్తగా నేనివాళ ఇలా ఉన్నానంటే అందుకు మార్క్స్ చూపిన మార్గమే కారణం. మార్క్స్‌ను ఇంకా ఇంకా అధ్యయనం చేయడానికి, మార్క్స్‌ను అన్వయించిన ఇతర రాజకీయార్థిక శాస్త్రవేత్తలను, తత్వవేత్తలను, సాహిత్యకారులను చదవడానికి నన్ను ఎక్కువగా పురికొల్పినవి అనేకచోట్ల నుంచి, అనేకసంఘాల నుంచి వేరు వేరు అంశాల మీద ఉపన్యాసాల కోసం వచ్చిన పిలుపులు. ఆ ఉపన్యాసాల కోసం పిలిచిన వాళ్లు, ఆ సభల్లో శ్రోతలు, అక్కడ కలిసిన మిత్రులు వేలాది మంది నా మార్క్స్ ప్రయాణాన్ని అవసరమూ, అనివార్యమూ, సఫలమూ చేశారు. ఒక గంట నుంచి రెండు రోజుల దాకా రాజకీయార్థ శాస్త్రం మీద, మార్క్స్ కాపిటల్ మీద చెప్పిన పాఠాలకు మార్క్స్ నాతో **(మిగతా 21వ పేజీలో)**

# రెండూ సామాజిక విప్లవ సిద్ధాంతాలే!




- మల్లెపల్లి లక్ష్మయ్య

**భారతదేశ సామాజిక నేపథ్యం నుంచి కారల్ మార్క్స్ సిద్ధాంతాన్ని అంబేడ్కర్ తులనాత్మకంగా పరిశీలించారు. బుద్ధుడినీ, మార్క్సునూ ఒకేస్థాయిలో పోల్చారు. ప్రపంచ ఆవిర్భావంలో దేవుడి ప్రమేయాన్ని బౌద్ధం, మార్క్సిజం... రెండూ నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. ఈ ప్రపంచంలో ఏవీ శాశ్వతం కాదనీ, ఇవి నిత్యం మారుతుంటాయనీ బుద్ధుడు, మార్క్స్ ఇరువురూ చెప్పారు. దాన్ని మార్క్స్ గతి తర్కం అంటే, బుద్ధుడు అనిత్త (అనిత్య) అని పేర్కొన్నారు. ఇక సమాజంలో ఉన్న దుఃఖానికి నివారణా మార్గం బౌద్ధం అన్వేషిస్తే, పేదరికం... దానికి కారణమైన దోపిడీ, దాన్ని నిర్మూలించే మార్గాన్ని మార్క్సిజం చూపెట్టింది. మార్క్స్‌తో అన్ని విషయాల్లో ఏకీభవిస్తూనే, కార్మిక వర్గ నియంతృత్వాన్ని మాత్రం తీవ్రంగా ఆక్షేపించారు అంబేడ్కర్.**

‘ఆధునిక సోషలిజం, కమ్యూనిజంలకు కారల్ మార్క్స్ తండ్రి లాంటివాడు. ఊహాజనిత సోషలిజాన్ని ఎండగట్టి ఆయన శాస్త్రీయ సోషలిజానికి పునాదులు వేశారు. పెట్టుబడిదారులతో పాటు, ఊహాజనిత సోషలిస్టులకు వ్యతిరేకంగా సిద్ధాంత పోరాటాలు చేశారు. ఈ రెండూ సమాజ ప్రమాదకారులేనని కారల్ మార్క్స్ తేల్చి చెప్పారు. అందుకే కారల్ మార్క్స్ సోషలిస్టు వ్యవస్థ ను శాస్త్రీయంగా నిర్వచించడంలో ఆద్యుడిగా నిలిచారు” అని బాబాసాహెబ్ అంబేడ్కర్ తన ‘బుద్ధ లేదా కారల్ మార్క్స్’ రచనలో పేర్కొన్నారు. 1956 నవంబర్ 20న నేపాల్‌లోని ఖాట్మండులో జరిగిన అంతర్జాతీయ బౌద్ధ సమ్మేళనంలో పాల్గొని ఇదే విషయమై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. అంటే అంబేడ్కర్ మహాపరినిర్వాణం పొందడానికి సరిగ్గా పదిహేను రోజుల ముందు ఈ సమావేశం జరిగింది. భారత దేశ చారిత్రక పరిస్థితులు, సామాజిక నేపథ్యం నుంచి ప్రపంచ శ్రామిక వర్గ మహానేత, కమ్యూనిస్టు వ్యవస్థ నిర్మాత కారల్‌మార్క్స్ సిద్ధాంతాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేసిన రచనగానీ, ప్రసంగం గానీ మరొకటి లేదని భావిస్తున్నాను.

‘కారల్ మార్క్స్, గౌతమబుద్ధుని పోల్చి చూపడం చాలా మందికి హాస్యాస్పదంగానే అనిపించవచ్చు. దీనికి ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. మార్క్స్‌కీ బుద్ధునికీ మధ్య 2,381 సంవత్సరాల వ్యత్యాసం ఉంది. బుద్ధుడు జన్మించింది




క్రీ.పూ.563 కాగా, మార్క్స్ పుట్టింది క్రీ.శ.1818 సంవత్సరం. బుద్ధుడినీ, మార్క్సునూ ఒకేస్థాయిలో పోలుస్తుంటే, మార్క్సిస్టులకు అపహాస్యంగా అనిపిస్తుంటుంది. ఈ పోలిక చాలా తొందర పాటుగా భావిస్తుండవచ్చు. అయితే మార్క్సిస్టులు తమ అపోహలను పక్కన పెట్టి, కారల్‌మార్క్స్‌తోపాటు బుద్ధుని బోధనలనూ, బౌద్ధం ప్రాధాన్యతనూ అధ్యయనం చేస్తే వాళ్ళ ఆలోచనల్లో తప్పనిసరిగా మార్పు వస్తుంది’ అంటూ బాబా సాహెబ్ తన రచనను మొదలుపెట్టారు. బౌద్ధాన్నీ, మార్క్సిజాన్నీ విడివిడిగా వివరించి, మళ్ళీ పోలికలను, వ్యత్యాసాలను విడదీసి చూపెట్టారు. వీటిని మూడు భాగాలుగా చూడవచ్చు. మొదటిది తాత్విక విషయాలు, రెండవది ఆర్థిక-సామాజిక అంశాలు. మూడవది రాజకీయ వ్యవస్థల నిర్మాణం.

## బౌద్ధం.. మార్క్సిజం

మొదటి అంశమైన తాత్వికతను చూస్తే, కొన్ని విషయాలు మనకు అర్థమవుతాయి. అందులో ఈ ప్రపంచ ఆవిర్భావం

గురించి చెబుతూ, అందులో దేవుడి ప్రమేయాన్ని ఈ రెండు సిద్ధాంతాలూ నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. మార్క్స్ మానవ పరిణామ క్రమాన్ని డార్విన్, ఇతర శాస్త్రీయ పరిశోధనల ద్వారా ఉదహరిస్తే, అంతకన్నా 2,300 ఏళ్ళ క్రితమే, ఈ విశ్వం తనం తట తానే ఉద్భవించిందనీ, ఇందులో ఎటువంటి అతీంద్రియ శక్తుల ప్రమేయం లేదనీ తన 'అగ్గన్న సుత్త' ప్రసంగంలో గౌతమ బుద్ధుడు పేర్కొన్నారు. ఈ ప్రపంచం ఆవిర్భవించడం గురించి తెలిపిన విషయం డార్విన్ సిద్ధాంతానికి పునాదిగా కనిపిస్తుంది.

ఇక రెండో సామ్యం, ఈ ప్రపంచంలోని వస్తువులు ఏవీ శాశ్వతం కాదు అనేది. ఇవి నిత్యం మారుతుంటాయి. దీనిని మార్క్స్ గతి తర్కం అంటే, గౌతమ బుద్ధుడు అనిత్త(అనిత్య) అని పేర్కొన్నారు. అంటే అశాశ్వతం అని అర్థం. వస్తువుకు పుట్టుక, నాశనం ఉండదనీ, అది పాత రూపం మార్చుకొని, కొత్త దానిలోకి మారుతుందనీ మార్క్స్ భావం అభావం చెందడంగా భావిస్తే.. బుద్ధుడు దానిని పునబ్బవ అని పేర్కొన్నారు. అదే విధంగా ఇద్దరూ ప్రతి సంఘటనకు కార్యకారణ సంబంధం ఉంటుందని తేల్చారు. బౌద్ధంలో దానిని 'ప్రతీత్య సముత్పాద' అంటారు. ఒక సంఘటన జరగడం ఏదో యాదృచ్ఛికం కాదనీ, దానికి కారణాలు ఉంటాయనీ భావం. అంటే సమాజాన్ని గతి తార్కికదృష్టితో చూడటం అనేది రెండు సిద్ధాంతాలలోనూ ఉంది.

సమాజంలోని కష్టాలకూ, సమస్యలకూ రెండు తాత్విక మార్గాలూ పరిష్కారాన్ని కనిపెట్టాయి. సమాజంలో ఉన్న దుఃఖానికి నివారణా మార్గం బౌద్ధం అన్వేషిస్తే, పేదరికం.. దానికి కారణమైన దోపిడీ, దాన్ని నిర్మూలించే మార్గాన్ని మార్క్సిజం చూపెట్టింది. ఈ రెండింటిలోనూ సొంత ఆస్తి అనేది ప్రధాన కారణంగా పనిచేసింది. అందుకే బౌద్ధ భిక్కులు ఎవరూ ఆస్తులనే కాదు, అనవసర వస్తువులను కలిగి ఉండకూడదనే నిబంధనలు పెట్టారు. సొంత ఆస్తి వ్యవస్థ దోపిడీకీ, పేదరికానికీ కారణమనీ.. అందువల్ల సొంత ఆస్తిని నిర్మూలించే కమ్యూన్‌ల ను ఏర్పాటు చేయాలనీ మార్క్స్ భావించారు. దానినే గౌతమ బుద్ధుడు బౌద్ధ సంఘాల ద్వారా ఒక నూతన వ్యవస్థను నిర్మించాలని ప్రతిపాదించారు. కమ్యూనిస్టు దేశాల్లో కమ్యూన్‌లు, సహకార వ్యవస్థలు ప్రజల సామాజిక అభివృద్ధికి నేతృత్వం వహించాయి. ఆర్థిక, సామాజిక, నైతిక మద్దతును రైతులకూ, కార్మికులకూ అందించాయి. బౌద్ధ సంఘాలు, బౌద్ధారా మాలు కూడా ఆర్థిక సహకార సంస్థలను నడిపాయి. దానికి సంబంధించిన ఆధారాలు మనకు బౌద్ధ సాహిత్యంలో దర్శనమిస్తాయి.

అయితే సమాజ మార్పునకు వర్గ పోరాటాలే మార్గమని మార్క్సిజం భావిస్తే, బౌద్ధం మాత్రం అనివార్యమైతే తప్ప యుద్ధాలు వద్దని తేల్చిచెప్పింది. చాలా మంది బౌద్ధం అనగానే అహింసను ప్రబోధించే మానవ సిద్ధాంతంగా భావిస్తారు. కానీ బౌద్ధం న్యాయం కోసం, ప్రజల రక్షణ కోసం యుద్ధం చేయాల్సి వస్తే వెనుకాడకూడదని తేల్చి చెప్పింది. ఒకదేశ సేనాధిపతి సింహసేనాపతితో బుద్ధుడు జరిపిన సంభాషణలో ఈ విషయం తేల్చి చెప్పారు. ఇది అంగుత్తర నికాయలోని 'సింహసేనాపతి సుత్తలో ఉంది.

**మార్క్సిజం లాగానే బౌద్ధం ఆనాటి వైరుధ్యాన్ని కనిపెట్టి మహా విప్లవాన్ని నడిపింది. యజ్ఞయాగాలలో సమాజాన్ని నిట్టనిలువునా దోపిడీ చేస్తూ, ఆనాటి సామాజిక ప్రగతికి అడ్డుగోడలుగా నిలిచిన పురోహిత, వైదిక వ్యవస్థను ఎదుర్కొని సామాజిక విప్లవాన్ని సాధించింది. అందుకే బౌద్ధం భారతదేశ తొలి సామాజిక విప్లవం. అదే విధంగా మార్క్సిజం ఆధునిక ప్రపంచ విప్లవ సిద్ధాంతం.**

అయితే అంబేడ్కర్ మార్క్సిజంతో తీవ్రంగా విభేదించిన అంశం 'కార్మిక వర్గ నియంతృత్వ' వ్యవస్థ. దీన్ని ప్రాథమికంగా మార్క్స్ నిర్వచిస్తే, దానిని రష్యా విప్లవనేత లెనిన్ ఆచరణలో చూపెట్టారు. మార్క్సుని అన్ని విషయాల్లో ఏకీభవిస్తూనే, కార్మిక వర్గ నియంతృత్వాన్ని చాలా తీవ్రంగా ఆక్షేపించారు అంబేద్కర్. బౌద్ధంలోనే తన అభిప్రాయానికి పునాది ఉందని అంబేద్కర్ పేర్కొన్నారు. గౌతమబుద్ధుడు ఆనాటి మహాజనపదాల ప్రజాస్వామ్య విలువలను విశ్వసించాడనీ, వాటిని తన విధానంగా ప్రతిపాదించాడనీ అంబేద్కర్ స్పష్టం చేశారు. ఆనాటి కన్నా ఈనాడు సమాజం ఎంతో ముందుకు పోయిందనీ, ఇటువంటి పరిస్థితుల్లో ఎటువంటి నియంతృత్వమైనా సరియైనది కాదనీ, అది ప్రజలను స్వేచ్ఛకు దూరం చేస్తుందనీ అంబేద్కర్ భావించారు. మార్క్స్ సిద్ధాంతం ద్వారా ఆర్థిక సమానత్వం వస్తుందనీ, కానీ భారతదేశంలో అంతరాలకి ముఖ్యమైన కులవ్యవస్థ సృష్టించిన కుల వ్యత్యాసాలు సోదరత్వాన్ని అడ్డుకుంటున్నాయనీ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

ఆ విధంగా ఆ ఒక్క విషయం మినహా భారతదేశ విప్లవ సిద్ధాంతమైన బౌద్ధానికీ, మార్క్సిజానికీ చాలా సామ్యాలున్నాయని అంబేద్కర్ స్పష్టం చేశారు. భారతదేశ ప్రజలు సామాజిక, రాజకీయ ఆర్థిక సమానతల కోసం జరుపుతున్న పోరా టంలో బౌద్ధం, మార్క్సిజం సిద్ధాంతాల అవసరముందనే విషయాన్ని మనం గమనించాలి. మార్క్సిజం ప్రకారమే, ప్రతి దేశంలో ఉన్న చారిత్రక, సామాజిక పరిస్థితుల దృష్ట్యా వాటికి అనుగుణంగానే చారి త్రక భౌతిక వాదాన్ని రూపొందించుకోవాలని ప్రముఖ మార్క్సిస్టు తత్వవేత్త మార్తా హర్నేకర్ అన్న మాటలు ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. ❑

# తెగిపడ్డ ఆ శిరస్సు చెప్పిన రహస్యం.. మేడే



- ఆకుల అమరయ్య

**2021 మార్చి 9.. మంగళవారం సాయంత్రం 6.40 గంటలు.. వణికిస్తున్న చలి. హోరెత్తుతున్న గాలి.. చికాగోలోని మేడే స్మారక స్థూపాన్ని చూడాలన్న కోర్కె నెరవేరిన రోజు. డౌన్ టౌన్‌లోని 175 ఎన్. డెస్ ప్లెయిన్స్ స్ట్రీట్. కార్మికుల రక్తంతో తడిసిన HAYMARKET ప్రాంతమదే. తలెత్తి చూస్తే తప్ప ఏ బిల్డింగ్ ఎంతుందో చెప్పలేం. పెద్దగా రద్దీ లేదు. అడపాదడపా వచ్చి పోయే వాహనాలు తప్ప.. ఆ స్థూపాన్ని చూడడంతోనే - మేడే నేడే పాట చెవుల్లో మార్మోగింది. మైళ్ల పొడవునా ఆంధ్రాలో జరిగిన మేడే ర్యాలీలు మదిలో మెదిలాయి. తెలియకుండానే పిడికిళ్లు బిగుసుకుపోయాయి. చెయ్యెత్తి జైకొట్టా..**



'మే' డే.. ఎంతో ఉత్తేజ పూరితమైన రోజు.. ఎనిమిది గంటల పనిదినం కోసం లక్షలాది కార్మికులు రక్తం చిందించిన రోజు. నెత్తుటి జెండాలు ఎగిసిన రోజు.. అటువంటి ముఖ్యమైన రోజు ఇప్పుడు మసకబారుతోంది. 'పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప' అని మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ నాడు ప్రవచిస్తే నేడు ఎక్కడికక్కడ రాజీపడే, సర్దుకు పోయే నయా ఉదారవాద వర్గం తయారైంది. అమరవీరుల త్యాగాల్ని అపహాస్యం చేసే దుస్థితికి తీసుకువచ్చింది. అసలింతకీ ఈ మేడే ఏంటీ? ఉరితీయబడ్డ ఆ శిరస్సులు చెప్పిన రహస్యమేంటీ...

## 19వ శతాబ్దం.. పారిశ్రామిక విప్లవాల కాలం..

పని గంటల్లేవు.. హక్కుల్లేవ్.. ఉదయాల్లేవ్.. ఉషస్సుల్లేవ్. అమ్మెవరో, అబ్బెవరో పిల్లలకు తెలిసే స్థితి లేదు. 24 గంటల్లో 14, 15 గంటల పని. దుర్భరం.. పొద్దున పనికెళ్లిన వాళ్లు ఎప్పుడు తిరిగొస్తారో, అసలు వస్తారో రారో తెలియదు.. వందలు, వేల మంది చచ్చి శవాలవుతారు. దీనికి ముగింపెట్లా? ఎవరు, ఎలా, ఏమి చేయాలి? ఆ ఆలోచనే 1884 అక్టోబర్ 7న చికాగో సదస్సు. సంఘటిత వాణిజ్య వ్యాపార సంస్థల కార్మిక సంఘాల సమాఖ్య (ఆ తర్వాత ఇదే అమెరికా కార్మిక సమాఖ్య–ఏఎఫ్ఎల్) ఇందుకు నడుం కట్టింది. 8 గంటల పని దినమని నినదించింది. అమెరికా, కెనడా ప్రభుత్వాలకు రెండేండ్ల గడువిచ్చింది. 1886 మే 1వ తేదీ నుంచి అమలు చేయాలని అల్టిమేటం ఇచ్చింది. లేకుంటే సమ్మెనని హెచ్చరించింది. ప్రపంచదేశాల్లోని సోదర కార్మిక సంఘాలకూ ఈ సందేశం పంపింది. అప్పటికే ఆస్ట్రేలియా కార్మికవర్గం–8 గంటల పని, 8 గంటల వినోదం, 8 గంటల విశ్రాంతి–నినాదాన్ని అందుకుంది. లండన్, ప్యారిస్ వంటి యూరోపియన్ నగరాలు 8 గంటల పని దినం కోసం గొంతెత్తాయి.

## 1886 మే 1... చికాగో..

ఉదయం 10 గంటలు.. అమెరికా అంతటా సమ్మె. 13 వేల సంస్థల మూత.. వీధుల్లో మూడు లక్షల మంది కార్మికులు... అంతకంతకూ పెరిగిన సమ్మె హోరు.. 24 గంటల్లో సమ్మె చేస్తున్న కార్మికుల సంఖ్య నాలుగు లక్షలకు చేరింది. కార్మికోద్యమానికి పురిటిగడ్డ చికాగో.. ఆ ఒక్క నగరంలోనే 40 వేల మంది కార్మికులు, భార్యాబిడ్డలతో ర్యాలీ.. బ్యానర్లు, ఎర్ర జెండాల రెపరెపలు.. మిన్నంటిన నినాదాలు.. హోరెత్తిన ప్రసంగాలు.. వీధులు మార్మోగాయి. దిక్కులు పిక్కటిల్లాయి. ప్రభుత్వాలు బెంబేలెత్తాయి. పరిశ్రమల యజమానుల గుండెల్లో దడ.. తొలి రోజు ముగిసింది. మర్నాటికి ఉధృతి మరింత పెరిగింది.. రాత్రికి రాత్రే పాలకుల కుట్రలు, కుయుక్తులు.. ప్రశాంత ర్యాలీలపై ఉక్కుపాదం మోపేలా వ్యూహాలు..

## మే 3.. 1886.. మధ్యాహ్నం..

కార్మికవర్గం అంతిమ విజయం సాధించే వరకు ప్రతిఘాత శక్తుల్నీ ఎదుర్కోవాల్సిందే కదా.. ఈ వేళ జరిగిందదే. హే మార్కెట్ నుంచి ప్రదర్శన మెక్ కార్మిక్ రీపర్ వర్క్స్ వద్దకు

చేరింది. పెట్టుబడిదారులు కన్నుగీటారు. పోలీసులు బంధూకులు దూశారు. రెచ్చిపోయి కాల్పులు జరిపారు. ఆరుగురు కార్మికులు నేలకొరిగారు. వందలాది మంది నెత్తుటి మడుగుల్లో గిలగిలా లాడారు. ఈ ఘాతుకాన్ని సంఘం నిరసించింది. మర్నాడు ర్యాలీ జరపాలని నిర్ణయించింది.

## మే 4.. 1886.. సాయంత్రం.. రక్తం ఏరులైన రోజు

హేమార్కెట్, రాన్డాల్ఫ్ స్ట్రీట్ (175 ఎన్. డెస్ ప్లెయిన్స్ స్ట్రీట్) కిక్కిరిసింది. కబడ్దార్.. మమ్మల్నే కాల్చి చంపుతారా? కార్మికుల ఆగ్రహావేశాలు, నాయకుల సముదాయింపు. మీటింగ్ మొదలైంది. ఓ వ్యాగన్నే వేదిక చేసుకున్న నాయకులు ప్రసంగాలు చేశారు. చివరి వక్త ఆగస్ట్ స్పైస్ సభను ముగించబోతున్నారు. ఇంతలో కలకలం. లాభాలు తప్ప ఇంకేమీ పట్టని పెట్టుబడి దారులు, పరిశ్రమాధిపతుల కోర్కె నెరవేరింది. ఖాకీలు కయ్యానికి కాలు దువ్వారు. కార్మికులపై విరుచుకుపడ్డారు. లాఠీలతో కుళ్లబొడిచారు. తుపాకులతో నెత్తురు కళ్ల జూశారు. సరిగ్గా ఆ సమయంలో జనంపై బాంబు.. ఎక్కడి నుంచి వచ్చిందో ఎవరు విసిరారో తెలియదు. ఒక సార్జెంట్ మృతి.. కార్మికులు, పోలీసుల హాహాకారాలు. ఎందరికి తలలు పగిలాయో, మరెందరి కాళ్ళూ చేతులు తెగిపడ్డాయో లెక్కలేదు. సభాస్థలి రక్తసిక్తం.. యుద్ధ రంగాన్ని మించిన బీభత్సం. ఏడుగురు పోలీసులు, ఎనిమిది మంది కార్మికులు చచ్చిపోయారు. హేమార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిసి ముద్దయింది. చికాగో నగరం స్తంభించింది. యజమానుల లక్ష్యం నెరవేరింది. 15 మంది కార్మిక నేతలపై కేసు నమోదైంది. 8 గంటల పనని అరవడమే నేరమైంది. వీళ్లలో 8 మందిని అరాచకవాదులుగా ముద్ర వేశారు.

## అమ్ముడుపోయిన జ్యూరీ..

1886 ఆగస్టులో విచారణ మొదలైంది. జ్యూరీ డబ్బున్న వాళ్లకు చుట్టమైంది. అమెరికా సహా ప్రపంచదేశాల కార్మికవర్గం ముక్తకంఠంతో ఈ విచారణను నిరసించింది. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా? ఆ 15 మందిలో ఏడుగురికి ఉరి శిక్ష, మిగతా 8 మందికి 15 ఏండ్ల కఠిన కారాగార శిక్ష. 1886 చివర్లో నలుగురు నాయకులు – పార్సన్స్, స్పైస్, ఫిషర్, ఏంజిల్స్ – ఉరితీశారు. ఒక నాయకుడు జైల్లోనే నోట్లో పేలుడు పదార్థం ఉంచుకుని పేల్చేసుకున్నాడు. జ్యూరీ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో మిగతా ముగ్గురికి క్షమాభిక్ష పెట్టారు. ఆరేండ్ల తర్వాత విడుదల చేశారు. ఈ ఉరితీతలు ప్రపంచాన్ని కుదిపేశాయి.

## మే డేను ప్రకటించిన రెండో ఇంటర్నేషనల్...

కమ్యూనిస్టులు, సోషలిస్టులు లేబర్ పార్టీలు, ఇతర ప్రగతిశీల శక్తులతో ఫస్ట్ ఇంటర్నేషనల్ ఏర్పాటైంది. అది 1876లో రద్దయింది. తిరిగి రెండో ఇంటర్నేషనల్ 1889లో మొదలైంది. ఈ సంస్థే మే-1ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా, మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది హేమార్కెట్ అమరవీరుల త్యాగానికి తర్పణాలు పట్టింది. వారి త్యాగాన్ని కీర్తిస్తూ 1890 మే1న ర్యాలీలు జరపాలని పిలుపిస్తే ఒక్క లండన్లోనే మూడు లక్షల మందితో ప్రదర్శన జరిగింది. ప్రపంచం నివ్వెరపోయింది. ఆ తర్వాతే కార్మిక వర్గ చరిత్రలో మే డే భాగమైంది. 66 దేశాలు అధికారికంగా, మరికొన్ని అనధికారిక సెలవు ఇస్తున్నాయి. కానీ, ఎక్కడైతే పోరు ప్రారంభమైందో ఆ దేశమైన అమెరికా మాత్రం ఇప్పటికీ మేడేని గుర్తించలేదు. (సెప్టెంబర్లో వచ్చే తొలి శుక్రవారాన్ని అమెరికా లేబర్డేగా ప్రకటించింది. మే 1ని న్యాయ దినోత్సవంగా ప్రకటించింది.)

## హై మార్కెట్ ఇప్పుడెలా ఉందంటే..

2021 మార్చి 9.. మంగళవారం సాయంత్రం 6.40 గంటలు.. వణికిస్తున్న చలి. హోరెత్తుతున్న గాలి.. చికాగోలోని మేడే స్మారక స్థూపాన్ని చూడాలన్న కోర్కె నెరవేరిన రోజు. డౌన్ టౌన్లోని 175 ఎన్. డెస్ ప్లెయిన్స్ స్ట్రీట్. కార్మికుల రక్తంతో తడిసిన హైమార్కెట్ ప్రాంతమదే. తలెత్తి చూస్తే తప్ప ఏ బిల్డింగ్ ఎంతుందో చెప్పలేం. పెద్దగా రద్దీ లేదు. అడపాదడపా వచ్చి పోయే వాహనాలు తప్ప.. ఆ స్థూపాన్ని చూడడంతోనే – మేడే నేడే పాట చెవుల్లో మార్మోగింది. తెలియకుండానే పిడికిళ్లు బిగుసుకుపోయాయి. చెయ్యెత్తి జైకొట్టా.. జోహార్లు అర్పించా.

## పోరు జరిగిన ప్రాంతంలో స్థూపం ఇలా....

నాడు కార్మిక నాయకులు ఓ వ్యాగన్ ఎక్కి ప్రసంగించారు. దాన్ని స్ఫూర్తితో మేరీ బ్రొగ్గర్ అనే శిల్పి ఈ స్థూపాన్ని తయారు చేశారు. హేమార్కెట్ దాడిని స్ఫురించేలా ఉంటుంది. భావ ప్రకటన స్వేచ్ఛ, సభలు జరుపుకునే హక్కు, కార్మికులు సంఘటితమయ్యే స్వేచ్ఛ, 8 గంటల పని దిన పోరు, చట్టం, న్యా యం.. ఇలా మానవ హక్కుల్లోని ప్రతి కోణాన్నీ ఈ స్థూపం ఆవిష్కరిస్తుంది. ఒక వీరుడు నేటలకొరుగు తుంటే మరో వీరుడు ఆదుకునేలా, కార్మిక శక్తే పునాదిగా నిర్మించిన వేదికపై ముగ్గురు నాయకులు నినదిస్తున్నట్టుగా ఈ చిత్రం ఉంటుంది.

## ఫారెస్ట్ పార్క్లో తొలి స్థూపం

హేమార్కెట్ విషాద ఘట్టం ప్రపంచ వ్యాప్తంగా ఎందరెందర్నో కదిలించింది. ఎవరికెలా తోస్తే అలా నివాళులర్పించారు. కొందరు స్మారక చిహ్నాలు, మరికొందరు పోస్టర్లు వేశారు. ఇం కొందరు శిల్పాలు చెక్కారు. తనివితీరని వారు గోడల మీద చిత్రాలు వేశారు. 1893లో హేమార్కెట్ అమరవీరుల మాన్యు

మెంట్ చికాగో శివార్లలోని ఫారెస్ట్ పార్క్ స్మశానంలో ఏర్పాటైంది. ఇదే తొలి స్థూపం. 'మీరు ఈవేళ మా గొంతునులిమారు సరే. కానీ మా మౌనం విస్ఫోటనంలా వినిపించే రోజొకటి వస్తుంది' అని ఆ స్థూపం శిలాఫలకంపై ఉంటుంది.

### కార్మికుల పోరాట శక్తి ఏమైందీ?

చరిత్ర పునరావృతమవుతుందట.. ప్రపంచీకరణ, సోషలిస్టు దేశాల పతనం, విభజించు పాలించు తీరు, ధన ప్రవాహం, అవతలి వాళ్లను తొక్కయిన సరే పైకి ఎదగాలనుకునే కెరియరిజం.. ఇలా వీటన్నిటి మధ్య పని గంటల ఊసే ఆవిరైంది. చివరకు కార్మిక సంఘం ఏర్పాటుచేసుకునే హక్కుకూ కష్టకాలం వచ్చింది. ఇండియాలో 44 కార్మిక చట్టాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ప్రతిష్ఠాత్మక ప్రభుత్వరంగ పరిశ్రమలు కార్పొరేట్ సంస్థల పరమవుతున్నాయి. అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, ఆశ్రిత పెట్టుబడిదారీతనం రాజ్యమేలుతోంది. బి.ఎస్.ఎన్.ఎల్, ఎల్ఐసీ, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, రైల్వే వంటి లాభసాటి సంస్థల్ని ఇప్పటికే అమ్మకానికి పెట్టారు.

వ్యాపారాల పేరిట వందల వేల కోట్లు రుణాలు తీసుకుని బ్యాంకులకు నామం పెట్టి విదేశాలకు చెక్కేస్తున్నా, బ్యాంకుల్ని దివాలా తీయిస్తుంటే ప్రతిఘటించాల్సిన కార్మిక వర్గం ప్రేక్షకపాత్రకు పరిమితం కారాదు. అదంతా ఈదేశ శ్రామిక వర్గం సాధించిన ఉత్పత్తి సంపదల ప్రతిఫలం కదా? కానీ కార్మికవర్గ పోరాట స్వభావాన్ని, చైతన్యాన్నీ దెబ్బతీయడానికి పాలకపక్ష సహకారం పొందడంలో నయా పెట్టుబడిదారీ వర్గం విజయం సాధించింది. పాలకుల పలుకుబడి ముందు కొండకచో న్యాయవ్యవస్థ సైతం కళ్లకు గంతలు కట్టుకుంది. దీనికి ముగింపు ఎప్పుడు? కార్మిక వర్గ కల్యాణం ఎప్పుడు? అందుకోసం తలపెట్టే సమస్త ఉద్యమాల్లో కార్మిక, కర్షక, అణగారిన బడుగు, బలహీన వర్గాలు చేయి చేయి కలిసినడిచేది ఎన్నడో.. నయా బానిసత్వానికి ముగింపు పలకాలి. అందుకు స్ఫూర్తిగా చికాగో అమరవీరులకు జోహార్లు. ❑

---


# మార్క్సుతో, మార్క్సులో వ్యక్తిగత ప్రయాణం

(16వ పేజీ తరువాయి)

కొనసాగుతుండడమే కారణం. నేనంటూ ఒకణ్ని ఉండడానికి మార్క్సుకు ఎంతగా కృతజ్ఞుడినో, అంతగా ఆ వేలాది మంది మిత్రులకు కృతజ్ఞుడినే. అలా పిలిచిన సంస్థలు ఎన్నో ఉన్నాయి గాని, ప్రత్యేకించి గుంటూరు లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, మిత్రుడు డి.రాధాకృష్ణ గురించి చెప్పాలి. ప్రతి సంవత్సరం వాళ్లు జరిపే అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ సభకో, ఇతర సందర్భాల సభలకో నన్ను దాదాపు పది సార్లు పిలిచి, మార్క్సు సంవిధానం, ఆధునిక వలసలు, సామాజిక పెట్టుబడి, ప్రపంచీకరణ నూతన దశ, నేటి చైనా మార్గం, మాడో మార్గం వంటి అనేక మార్క్సు సంబంధిత అంశాల మీద మాట్లాడమన్నారు. మారిస్ డాబ్ రాసిన 'అర్థ శాస్త్రవేత్తగా మార్క్సు' నాతో అనువాదం చేయించి ప్రచురించారు. 'కార్టూన్లలో మార్క్సు' తర్వాత అదే సిరీస్‌లో వచ్చిన 'కాపిటల్ ఫర్ బిగినర్స్'ను హైదరాబాద్ బుక్ ట్రస్ట్ రాచమల్లు రామచంద్రారెడ్డి గారితో అనువాదం చేయించి ప్రచురించింది. ఆ పుస్తకాన్ని ఇరవై ఏళ్ల తర్వాత పునర్ముద్రించదలచుకున్నప్పుడు, మూల రచన కొత్త కూర్పుల్లో చేరిన అధ్యాయాలను హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ నాచేత అనువదింపజేసి, ప్రచురించింది. జర్మనీలో ఉద్యోగం చేస్తుండిన రంజిత్ కేవలం నా రచనలు చదివి, యూట్యూబ్‌లో ఉపన్యాసాలు విని నన్ను పరిచయం చేసుకుని స్నేహితుడయ్యాడు. దాదాపు 2015 నుంచీ నన్ను జర్మనీ రమ్మని పిలుస్తున్నాడు. 2018లో వెళ్లడానికి నిర్ణయించుకున్నాను. ఆ సంవత్సరం మే 5న మార్క్సు ద్విశత జయంతి సందర్భంగా ఆయన పుట్టిన ఊరు ట్రియర్‌లో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగుతున్నాయి గనుక ఆనాటికి అక్కడ ఉండేలా ప్రయాణం పెట్టుకున్నాను. నాకు తెలిసి ఆనాడు అక్కడ ఉండగలిగిన నలుగురైదుగురు తెలుగువాళ్లలో ఒకడినయ్యాను (ఆ వివరాలన్నీ ఇదివరకే రాశాను).

మార్క్సు ద్విశత జయంతి సందర్భంగా ఇక్కడ ఉండలేకపోవడం వల్ల తెలంగాణలో గాని, ఆంధ్రప్రదేశ్‌లో గాని జరిగిన ఉత్సవాల్లో పాల్గొనలేకపోయాను. అప్పటికి నేను నేరుగా మార్క్సు మీద రాసిన రచనలు దాదాపు ఇరవై ఉన్నాయి. అవన్నీ ఒక పుస్తకంగా ఆ రోజుకు తెద్దామని ఒక ప్రయత్నం జరిగింది గాని సాకారం కాలేదు. ఎప్పటికైనా మార్క్సు సంవిధానం మీద ఒక పుస్తకం రాయాలనీ, కాపిటల్ పరిచయం రాయాలనీ కోరిక. అందుకు అవసరమైన సమయం దొరుకుతుందో లేదో... నా ఈ అక్షరాలు, ఆలోచనలు, అడుగులు, నుడుగులు, ఎంత స్వల్పమైనవైనా పనులు మార్క్సు చూపిన మార్గంలోనే. ఆయన ఆలోచనాచరణల ఛత్రఛాయలోనే, వెలుగుబాటలోనే ఈ జీవితం గడిచింది. ఇదివరకు అనేకసార్లు చెప్పినట్టు, "రూపమూ సారమూ ఒకటే అయితే శాస్త్రం అవసరం లేదు" అని ప్రపంచాన్నంతా ఇముడ్చుకున్న, ప్రపంచాన్నంతా వివరించగల మహోజ్జ్వలమైన మార్గదర్శక విశ్లేషణా సూత్రం ఇచ్చినందుకు ఆయనకు తీర్చుకోలేని రుణంలో ఉన్నాను. ఆదర్శ వాక్యం ఏమిటి అంటే 'మానవీయమైనదేదీ నాకు పరాయిది కాదు' అనీ, జీవిత సూత్రం ఏమిటి అంటే 'ప్రతి దాన్నీ ప్రశ్నించు' అనీ బుద్ధిజీవిగానో, సామాజికుడిగానో మాత్రమే కాదు, అసలు మనిషిగా ఉండడానికే మార్గం చూపిన మహనీయుడు కార్ల్ మార్క్సు చిరకాలం సజీవంగా ఉంటాడు. ❑

# మే నెల - కొత్త తరహా ఉద్యమాలకు ప్రేరణ కావాలి



- డీవీవీఎస్ వర్మ

**మే నెలకు ఒక ప్రత్యేకత వుంది. మే 1 - అంతర్జాతీయ కార్మిక దినోత్సవం. మే 5- కార్ల్ మార్క్స్ జయంతి. మే 9 - ఫాసిజంపై విజయం సాధించిన రోజు. వర్తమాన దేశ రాజకీయాల విశ్లేషణకు కొత్త తరహా ప్రజా ఉద్యమాలకు, నినాదాలకు ఇవి ప్రేరణ ఇస్తాయి. మే డే నాడు 8 గంటల పనిదినం కోసం సాగిన చికాగో పోరాటం, కార్మికుల రక్తతర్పణ గుర్తు చేసుకుంటారు.**

ప్రపంచ కార్మికులారా ఏకంకండి అన్న నినాదం ఇస్తారు. వాస్తవానికి ఈ రెండు మే డే ఉద్యమంలో పుట్టిన నినాదాలు కావు. దానికి ప్రేరణ ఇచ్చిన నినాదాలు. 1866లో మార్క్స్ సారథ్యంలో ఏర్పడిన మొదటి ఇంటర్నేషనల్ 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేసింది. 1848లో మార్క్స్ – ఏంగెల్స్‌లు రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక ముగింపు నినాదం 'ప్రపంచ కార్మికులారా! ఏకంకండి!' దానికి ముందు 'వారు గెలుచు కోడానికి ఓ ప్రపంచం వుంది' అన్న వాక్యం ఎంతో ప్రాముఖ్యత కలిగింది. ఇది దోపిడీ లేని ప్రపంచాన్ని సాధించే కార్యాచరణకు ఇచ్చిన పిలుపు. ఎందుకో ఇది మేడే ప్రసంగాలలో, నినాదాలలో ప్రాధాన్యత లేనిదైంది. మే డే ఉద్యమం హక్కుల ఉద్యమంగా ప్రారంభమైనా ఆ నినాదాల వెనక దోపిడీ వ్యవస్థను కూల్చే రాజకీయం వుంది. దానికి కార్మికవర్గాన్ని సంసిద్ధుల్ని చెయ్యాలి. ప్రస్తుతం మన ముందు కొన్ని సవాళ్లున్నాయి. వాటిని పరిశీలించుకుందాం.

**మొదటి అంశం :**

మనదేశంలో శ్రామిక వర్గం ఒకే రూపంలో లేదు. పారిశ్రామిక కార్మిక వర్గంకంటే వివిధ రంగాలకు విస్తరించిన అసంఘటిత కార్మికవర్గం అత్యధికంగా వుంది. బహురూపాలలో విస్తరిస్తున్న సేవా రంగం పలు రకాల ఉద్యోగ బృందాలను సృష్టిస్తున్నది. మరోపక్క గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు, పలు దొంతర్ల రైతులు వున్నారు. దీనికితోడు సమాజంలో వివక్ష వుంది. అణిచివేత వుంది. దళితులు, బహుజనులు, వివిధ మతాల మైనారిటీలు మహిళలు వున్నారు. వీరంతా ఒక పక్క దోపిడీకి, మరోపక్క వివక్షకీ గురౌతున్నారు. ఆంటోనియో గ్రాంసీ మాటల్లో ఇవన్నీ ఉపశ్రేణి తరగతులు ఈ ఉపశ్రేణులను ఐక్యం చెయ్యడం ఎలా అన్నది మన మొదటి సమస్య.

**రెండవ అంశం :**

ఈ ఉపశ్రేణులు గెలుచుకోవలసిన మరో ప్రపంచం, అంతరాలు లేని సమ సమాజం. అయితే ప్రస్తుతం దేశం నడక దీని విరుద్ధంగా వుంది. సంపద కొద్ది మంది దగ్గర మేటలు వేస్తున్నది. పేదరికం మరోచోట తిష్ట వేస్తున్నది. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సంపద కేంద్రీకరణ శరవేగంతో సాగుతు న్నది. 2013 నాటికి 60 మంది వున్న బిలియనీర్ల సంఖ్య ఇప్పుడు 119కి పెరిగింది. 10 శాతం సంపన్నుల చేతిలో 77 శాతం దేశ సంపద పోగు పడింది. ప్రతి ఏటా పెరిగే సంపదలో 73 శాతం కేవలం 1 శాతానికి చేరిపోతున్నది. 67 కోట్ల మంది కేవలం 1 శాతం సంపదను పంచుకుంటున్నారు. దేశంలో విమానాశ్రయాలు, పోర్టులు, ఆయిల్ నిక్షేపాలు, ఖనిజ సంపదను కార్పొరేట్లు వశం చేసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలన్నీ వారి పరం అవుతున్నాయి. వివిధ పార్టీలు వీటిపై విమర్శలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నాయి. వాటిలో ప్రజలు భాగస్వాములు కావడం లేదు. ఇంతగా కార్పొరేట్లు దేశాన్ని దోచుకుంటున్నా ఈ శక్తులను సవాలు చేసే ప్రజా ఉద్యమం రావడం లేదు. ఇది మరో పరిశీలనాంశం.

**మూడో అంశం :**

మోదీ పాలన ప్రజానుకూలం కాకపోగా ప్రజావ్యతిరేకమైంది. దేశానికి అచ్ఛేదిన్ రాలేదు. విదేశాలలో మూలుగుతున్న నల్లధనం తేలేదు. ప్రజలకు పంచలేదు. పెద్దనోట్లు రద్దు చేసి దేశంలో నల్లధనం వెలికి తీస్తానన్నది జరగలేదు. బ్యాంకుల దగ్గర క్యూలతో సామాన్యులు బారులు తీరారు. అక్కడే 200 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. జీఎస్టీతో ధరలు తగ్గుతాయన్న హామీ తిరగబడింది. నిత్యావసరాల ధరలు పెరిగాయి. పెట్రోలు, గ్యాస్ ధరలు ప్రతి ఇంటా మంటపెడుతున్నాయి. నిరుద్యోగం పెరిగింది. రైతుల ఆదాయం రెట్టింపు అన్నమాట అటకెక్కింది.

**ఒకనాడు తాత్కాలికంగా ఉల్లిపాయల ధరలు పెరిగితే ప్రజలు ప్రభుత్వాలను మార్చేశారు. ఇప్పుడు అన్నీ పెరిగి జీవితం భారమైనా ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదు. పైగా దేశంలో జరుగుతున్న సర్వేల ప్రకారం మోదీయే**

ప్రధాని కావాలనుకునే వారు ఇప్పటికీ 52 నుండి 62 శాతం వున్నారు. ఇదీ మనం పరిశీలించుకుని తీరాల్సిందే.

**మోదీ బలం ఆయన ఆర్థిక విధానాలలో లేదు. పరిపాలనా దక్షతలో లేదు. మోదీ నడుపుతున్న రాజకీయంలో వుంది. తనకు తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. భారత జాతీయవాదం దేశ పౌరులందరినీ సమానంగా చూస్తుంది. హిందూ జాతీయవాదం ఈ దేశం హిందువులది మాత్రమేనని ఇతరులంతా పరాయివారుగా విభజిస్తుంది. విద్వేష రాజకీయాన్ని సాగిస్తుంది. ఈ భావజాలమే దేశానికి ఒక ఉక్కు మనిషిని అవసరం చేస్తుంది.**

ఒక హీరోని ముందుకు తెస్తుంది. భక్తులనీ, ఉన్మాదులను తయారుచేస్తుంది. ఈ అగ్గి చల్లారకుండా రోజుకొక మత వివాదాన్ని ముందుకు తెస్తారు. ఒక మందిరం తర్వాత మరొక మందిరం, ఒక కట్టడం తర్వాత మరో కట్టడం, ఒక పేరు మార్పిడి తర్వాత మరొకటి, చరిత్రను తిరగరాయడం, పురాణాలే చరిత్రలుగా ప్రకటించడం మనువాదమే మన రాజ్యాంగం అనే వివాదాలే నిత్య ఎజెండా అవుతుంది. పార్టీల స్పందనలు దీనిచుట్టూ సాగుతాయి. నిత్య చర్చల పేరుతో మీడియా ఈ విద్వేషాన్ని రోజువారీ టానిక్‌గా ప్రజలకు అందిస్తాయి. ఇలాంటి ఉన్మాదం, విద్వేషం ప్రజల తలకెక్కితే నిత్యజీవిత సమస్యలు తెరమరుగౌతాయి. ఇదే మోదీకి బలంగా మారుతున్నది. ప్రశ్నించేవాడు దేశద్రోహి అవుతాడు. కాదన్నవాడు జైలు పాలవుతాడు. అన్ని రకాల ఫాసిస్టు పద్ధతులకు ద్వారాలు తెరుచుకుంటాయి. దీనిని ఎదుర్కోనడం ఎలా అన్నది మరో కీలక అంశం. మనం మూడు అంశాలను ప్రస్తావించుకున్నాం. వాటికి ఆచరణయోగ్యమైన సమాధానా లను అందరూ ఆలోచించాలి.

### 1. ఉపశ్రేణుల ఐక్యత

ఈ ఉపశ్రేణుల ఐక్యతను సాధించకుండా రాజకీయ రంగంలో ఆశించిన మార్పులు రావు. ఇవి వృత్తిపరంగా భిన్నమైనవి. పట్టణ-గ్రామీణ ప్రాంతాల నివాసపరంగా భిన్నమైనవి. వివక్షకు గురి కావడంలోనూ భిన్నమైనవి. వీటి మధ్య ఎంతో వైవిధ్యం ఎన్నో వైరుధ్యాలు కనిపిస్తాయి. పట్టణాలలో గ్రామాలలో కింది స్థాయి నుండీ ఈ శ్రేణుల మధ్య ఐక్యతకు ప్రయత్నాలు జరగాలి. ఒకరి సమస్యలపై మరొకరి సహకారం ఈ ఐక్యతకు పునాది అవుతుంది. ఇది మాత్రమే సరిపోదు. ఈ ఉపశ్రేణులన్నింటి ఆకాంక్షలను వక్తీకరించేదీ, వారి జీవితాలకు కొత్తరూపును ఇచ్చే ఒక కొత్త నినాదాన్ని రూపొందించగలగాలి.

అలాంటి ఆచరణయోగ్యమైన నినాదం మాత్రమే వారి మధ్యగల వైరుధ్యాలను వెనక్కినెట్టి ఐక్యతకు దారితీస్తుంది. దీనిని రూపొందించగలిగితే అది వ్యవస్థ మీద పోరాడే గొప్ప ప్రజా ఉద్యమానికి ప్రేరణ అవుతుంది.

### 2.పోగుపడ్డ సంపద పునఃపంపిణీ :

ఒక నినాదం ప్రజా ఉద్యమంగా విజయం సాధించాలంటే ఆ నినాదం సమంజసమైనదేనని ప్రజలు భావించాలి. దానిని అమలులోకి తెచ్చే మార్గాలు ఆచరణ సాధ్యమేనన్న నమ్మకం కలగాలి. దానివల్ల తమ జీవితాలు ఎలా మారతాయో వారికి స్పష్టంగా కనిపించాలి. కార్పొరేట్ల సంపద అంతా దోచుకున్న శ్రమే. అదే వారి దగ్గర పోగుపడ్డ సంపద. దానిని జాతిపరం చెయ్యడం సమంజసమే. ప్రస్తుతం దానిలో కొంత భాగమైనా తక్షణం పంపిణీ జరగాలి. ఇది మనకి కొత్త కాదు. ఒక పరిశ్రమ యజమాని దగ్గర లాభంగా పోగుపడ్డ శ్రమలో ఒక భాగాన్ని బోనస్‌గా పంపిణీ చెయ్యడంలాంటిదే. ఇతర దేశాలలో లాగే మన దేశంలో కూడా తగిన స్థాయిలో కార్పొరేట్‌ల సంపద మీద, వారసత్వ ఆస్తి బదలాయింపు మీద పన్ను పన్ను విధించాలి. తగ్గించుకుంటూ వస్తున్న కార్పొరేట్ పన్నును పెంచాలి. ఇలాంటి పన్నులు విధిస్తే ఆక్స్ ఫామ్ సంస్థ అంచనాల ప్రకారం పునః పంణీకి వచ్చే సొమ్ము లక్షల కోట్లలో వుంటుంది. దీనిని ఉపశ్రేణులకు వారి జీవితాలను మార్చే విధంగా పంపిణీ చెయ్యాలి. రాజ్యాంగం ప్రకారం అందరికీ జీవించే హక్కు వుంది. ప్రతి కుటుంబానికి హక్కుగా నివాసం, హక్కుగా ఉచిత ఆరోగ్య వైద్య సదుపాయం, హక్కుగా పిల్లల చదువు, వృద్ధులకు పెన్షన్లు, గౌరవంగా జీవించడానికి ప్రతి కుటుంబానికి నగదు బదిలీని ప్రకటించాలి. యువతకు ఉపాధి హక్కు లేదా నిరుద్యోగ భృతి, రైతుల పంటనంతా మద్దతు ధరకి కొనుగోలు చేసే రైతు మార్కెట్ వ్యవస్థ ఏర్పాటు వగైరాలు సాధ్యమౌతాయి. సంపద పునః పంపిణీ నినాదం ఉపశ్రేణుల ఉమ్మడి నినాదం అవుతుంది. ఐక్య ఉద్య మానికి ప్రేరణ అవుతుంది.

### 3. ఫాసిజంపై సాంస్కృతిక ఉద్యమం :

మోదీ అనుసరిస్తున్న విద్వేష రాజకీయం, ఉన్మాద రాజకీయం, ఫాసిస్టు భావజాలం పౌరసమాజంలోని లోక జ్ఞానంలో భాగమైంది. దీనిని విచక్షణా జ్ఞానంగా మార్చడం కేవలం నినాదాలతో సాధ్యపడేది కాదు. మన పౌర సమాజంలో ఒక గొప్ప భావజాల సంఘర్షణ జరగాలి. వ్యక్తుల బుర్రల నుండి, సమూహాల చైతన్యంలో చొరబడ్డ మనువాద ఆధిపత్య భావజాలాన్ని, తొలగించడానికి తగిన సాంస్కృతిక సంఘర్షణ జరగాలి. లేకపోతే ప్రజాస్వామ్య భావజాలం మనుగడ సాగించ లేదు. మే నెలలో నిర్వహించే కార్యక్రమాలు – ఉపశ్రేణుల ఐక్యతకి, సంపద పునఃపంపిణీ ఉద్యమానికి, ఫాసిస్టు విద్వేష భావజాలంపై సాగించే ప్రగతిశీల సాంస్కృతిక ఉద్యమానికి ప్రేరణ ఇచ్చేవిగా వుంటాయని ఆశిద్దాం. ❑

# కరిగిపోతున్న కార్మిక శక్తి



- కొండూరి వీరయ్య

**గడచిన దశాబ్ది కాలాన్ని భారత ఆర్థిక వ్యవస్థలో శ్రమ శక్తి -పెట్టుబడి మధ్య సంబంధాల్లో గుణాత్మకమైన మార్పులు వచ్చిన కాలంగా చెప్పుకోవచ్చు. ప్రపంచ పెట్టుబడికి, దేశీయ కార్మిక వర్గానికి మధ్య జరుగుతున్న పోరాటం 2011 నాటికి కీలకమైన మలుపు తీసుకుంది. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వాన్ని ఓడించటంలో పాలు పంచుకున్న రాజకీయ శక్తుల మధ్య ఉన్న ఏకీభావం గత దశాబ్ది కాలంగా కార్మిక వర్గాన్ని చీల్చి చెండాడుతోంది అని నిర్ధారించటం సందర్భోచితమే. మరిన్ని వివరాల్లోకి వెళ్లి చూద్దాం.**



సాధారణంగా కుటుంబపోషణ నిమిత్తం అవసరమైన వేతనాలు లేదా లాభాలు అందించే పనిలో ఉన్న వ్యక్తిని శ్రమ శక్తిలో భాగంగా గుర్తిస్తాము. అటువంటి శ్రమ శక్తి 2022 ఫిబ్రవరి నాటికి భారతదేశంలో 42 కోట్ల 80 లక్షల మంది ఉన్నారు. 2022 మార్చి నాటికి ఇందులో 38 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. గత రెండేళ్లల్లో ఇదేస్థాయిలో నిరుద్యోగం ప్రబలినా ఆ నేరం నాది కాదు, కోవిడ్‌దే అని చెప్పి పాలకులు తప్పించుకున్నారు. కానీ వాస్తవం ఏమిటి? గత దశాబ్ది కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ పొందికలో మారుతున్న పొందిక పర్యవసానమే ఈ ఉద్యోగాల కోత అన్నది వాస్తవం. మార్క్సిస్టు పరిభాషలో చెప్పుకుంటే భారత ఆర్థిక వ్యవస్థలో మృత పెట్టుబడి (యంత్రాలు, మౌలిక వనరులు, సాంకేతిక పరిజ్ఞానం) పెరుగుతోంది. సజీవ పెట్టుబడి (కార్మికులకు వేతనాల రూపంలో ఖర్చయ్యే పెట్టుబడి) తగ్గుతోంది. ఈ తగ్గుదల సాపేక్ష స్థాయి నుండి సంపూర్ణ పతనం స్థాయికి వచ్చిందన్నది మార్చి నెలకు సంబంధించి కేంద్రం కార్మిక శాఖ జారీ చేసిన గణాంకాల నివేదికలు పరిశీలిస్తే స్పష్టమవుతోంది. కార్మికరంగంలో జరుగుతున్న పరిణామాలను మూడు కోణాల నుండి పరిశీలించాల్సిన అవసరం ఉంది. మొదటిది మార్కెట్ కోణం. రెండు పాలకుల కోణం. ఈ రెండు కోణాల్లో జరుగుతున్న పరిణామాలకు కార్మికవర్గ స్పందన మూడో కోణం. మార్కెట్‌కోణాన్ని ముందు పరిశీలిద్దాం. ప్రముఖ ఆర్థికవేత్త, గ్రీస్ మాజీ ఆర్థిక మంత్రి యూనస్ వారుఫాకిస్ తాజాగా ఓ ట్వీట్‌లో 'నిరుద్యోగం పెరుగుతుంది. అదే మరోవైపున పెట్టుబడికి లాభాలు పెరుగుతున్నాయని అర్థం చేసుకోవాలి' అన్నారు. ఈ సూత్రం భారత దేశంలో పెరిగే నిరుద్యోగం సందర్భంలో కూడా వర్తిస్తుంది. గత సంవత్సరం ఏప్రిల్ నాటికి 40 శాతంగా ఉన్న ఉత్పాదక శ్రమ శక్తి పాత్ర 2022 మార్చి నాటికి 39.5 శాతానికి కుదించుకుపోయింది. ఈ శాతాన్ని అంకెల్లోకి మార్చి చెప్పాలంటే పైన ప్రస్తావించుకున్నట్లు 38 లక్షల మంది గత రెండు నెలల కాలంలో శ్రమశక్తి నిర్వచనం నుండి బయటకు వచ్చారు. అంటే ఇకపై వీరిని ప్రభుత్వం నిరుద్యోగుల జాబితాలో పరిగణించదు. ఫలితంగా ఉద్యోగాలు కోల్పోయారు. గత రెండేళ్ల కాలంలో ఉద్యోగుల కోతకు కోవిడ్ కారణమని చెప్పారు. కానీ ఈ సంవత్సరం కోవిడ్ సాకు లేకుండానే లక్షల మంది ఉద్యోగులు వీధిన పడ్డారు. ఏ దేశంలోనైనా జనాభాలో శ్రమ శక్తి మోతాదు ఎలా తగ్గుతుంది ? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పబోయే ముందు శ్రమశక్తి అంటే ఏమిటో తెలుసుకోవాలి.

**శ్రమ శక్తి అంటే ఏ దేశ జనాభాలోనైనా శ్రమ చేయటానికి ఓపిక ఉన్న జనాభా శాతం. సాధారణంగా 21 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వరకూ ఉన్న జనాభా పని చేసే సామర్థ్యం, అవసరం కలిగి ఉంటుంది. మొత్తం జనాభాలో ఈ వయో బృందంలో ఉన్న వారి మోతాదునే శ్రమశక్తి అంటున్నారు**

**ఆర్థిక వేత్తలు. పైన చెప్పిన వివరం ప్రకారం ప్రభుత్వం లేదా మార్కెట్ ఉపాధి కల్పించలేకపోవటం వలన 38 లక్షల మందికి ఏజ్ బార్ అయ్యింది. ఇకపై వీళ్లు ఏ ఉద్యోగానికీ దరఖాస్తు చేసుకోలేరు. ఇదో విచిత్ర పరిస్థితి.**

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తోంది. ఉత్పత్తి నాణ్యత, పరిమాణం పెరుగుతోంది. కానీ దానికి అవసరమైన కార్మిక శక్తి కరిగిపోతోంది. మార్చి నెలలో కేంద్రం జారీ చేసిన శ్రమ శక్తి నివేదికలో మరో ముఖ్యమైన అంశం కూడా ఉంది. అది నికరంగా ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్యకు సంబంధించిన అంశం. జూన్ 2021 నాటికి 39 కోట్ల 60 లక్షల మందిగా ఉన్న కార్మికులు, ఉద్యోగుల్లో 2022 మార్చి నాటికి 14 లక్షలమంది ఉద్యోగాలు కోల్పోయారు. శ్రమ చేసే వయసు మించిన పోయిన వారి సంఖ్య, నేరుగా ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్య కలుపుకుని చూస్తే ఈ రెండేళ్ల కాలంలోనే సుమారు 50 లక్షల మంది జీవనోపాధి, జీవనోపాధి అవకాశాలను కోల్పోయిన వాస్తవం కళ్లముందుంది. మొత్తం జనాభాలో శ్రమ శక్తి, ప్రత్యేకించి ఉత్పాదక శక్తి నష్టం మోడీ పాలనలో ఉన్నంతగా ఎన్నడూ లేదు. ఇక్కడ కోల్పోయింది ఉద్యోగావకాశాలే అని చూస్తున్నాము. కానీ దేశం కోల్పోయింది ఉద్యోగాలు మాత్రమే కాదు. ఈ శ్రామిక శక్తి ఉత్పత్తి చేయాల్సిన జాతి సంపదను కోల్పోయామన్న కోణాన్ని తరచూ విశ్లేషకులు, విమర్శకులూ విస్మరిస్తూ ఉంటారు. ఇదీ మార్కెట్ నియమం కారణంగా శ్రమశక్తికి జరిగిన నష్టం.

మరింత లోతుగా పరిశీలిస్తే భారత ఆర్థిక వ్యవస్థకు ముంచుకొస్తున్న ముప్పు కూడా అర్థం చేసుకోవటానికి ఈ గణాంకాలు ఉపయోగపడతాయి. 2022 మార్చిలో కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన లెక్కలు మారుతున్న ఉపాధి అవకాశాల పొందిక గురించి కొన్ని ముఖ్యమైన వాస్తవాలను వెల్లడిస్తోంది. ఈ నివేదిక ప్రకారమే ఈ కాలంలో వ్యవసాయేతర రంగంలో కోటి 67 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. మొత్తం కోటిన్నరకు పైగా వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు కోల్పోతే అందులో పారిశ్రామిక రంగంలో కోల్పోయిన ఉద్యోగాలు షుమారు డెబ్బై అయిదు లక్షల వరకూ ఉన్నాయని కేంద్ర కార్మిక శాఖ నివేదిక వెల్లడిస్తోంది. అంటే అంతమందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు, వ్యవసాయేతర రంగం మూతపడిరది. వ్యవసాయేతర రంగం మూతపడటం అంటే దాంతోపాటు అనుబంధ ఉపాధి అవకాశాలు కోల్పోవటమే. అయితే ఇదే సమయంలో వ్యవసాయ రంగంలో పనిచేసే శ్రామికుల సంఖ్య కోటిన్నర అదనంగా పెరిగింది. అంటే పట్టణ ప్రాంతాల్లో పరిశ్రమలు మూతపడటంతో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులు గ్రామీణ ప్రాంతాలకు వలస వెళ్లి వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలు వెతుక్కున్నారు. అటువంటి వ్యవసాయ రంగాన్ని నేడు మోడీ ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి అప్పగించేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తోంది. ఏ అభివృద్ధి చెందిన దేశంలోనైనా వ్యవసాయంపై ఆధారపడిన కార్మికుల సంఖ్య పెరగటం ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కోబోతున్న సంస్థాగత సంక్షోభానికి పునాదులు వేయటమే.

కోవిడ్ దాడికి ముందు ప్రపంచ దేశాల్లో సగటు ఉపాధి రేటు ఆయా దేశ జనాభాలో 55 శాతం వరకూ ఉంటుంది. కోవిడ్ అనంతరం కూడా చైనా జనాభాలో 63 శాతం ఉద్యోగం / వేతన శ్రమ చేస్తూ ఉంటే బంగ్లాదేశ్‌లో 53 శాతం మంది, పాకిస్తాన్‌లో 48 శాతం మంది ఉద్యోగమో లేదా వేతన శ్రమో చేస్తున్నారు. కానీ భారతదేశంలో ఈ మొతాదు 40 శాతానికి మించటం లేదు. తాజాగా ప్రపంచబ్యాంకు, సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ జారీ చేసిన లెక్కల ప్రకారం కేవలం 38 శాతం మంది మాత్రమే వేతన ఉపాధి పొందుతున్నారు. అంటే 62 శాతం జనాభా వేతన ఉపాధికి దూరంగా బతుకెళ్లదీస్తున్నారు. జాతీయ నమూనా సర్వే సంస్థ లెక్కల ప్రకారం దేశ జనాభాలో సుమారు 14 శాతం వృద్ధులు ఉన్నారు. మొత్తం శ్రమ చేయగల నిరుద్యోగ జనాభాలో వీరి మోతాదును మినహాయించినా ఇంకా 48 శాతం పని చేయగలిగిన వయస్సులో ఉన్న వారికి పని దొరకటం లేదు.

ఏ దేశ ఆర్థిక వ్యవస్థలోనైనా శ్రమ శక్తి కుదించుకుపోవటం అంటే ఉపాధి అవకాశాలు కుదించుకుపోవటమే. పై వివరాలు పరిశీలిస్తే ఈ సంవత్సరమే దాదాపు 50 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు ఆవిరయ్యాయని అర్థమవుతుంది. మరి లక్షల కోట్ల పెట్టుబడులు, ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు బకాయిల ఎగవేత ద్వారా పోగేసుకున్న పెట్టుబడుల ద్వారా వస్తాయని, వచ్చాయని చెప్పుకుంటున్న లక్షల ఉద్యోగాలు ఎటుపోయాయి అన్న ప్రశ్న మాత్రం మనముందు నిలబడుతుంది. లక్షల సంఖ్యలోనో వేల సంఖ్యలోనో ఉద్యోగాలు వస్తాయన్న సాకుతో వేల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వ విధానాల బండారాన్ని పై వివరాలు బట్టబయలు చేస్తున్నాయి. మార్కెట్ శక్తులు కార్మిక వర్గంపై చేస్తున్న దాడికి తోడు ప్రభుత్వం రూపొందిస్తున్న విధానాలు భారత కార్మిక వర్గాన్ని మరింతగా కుంగదీస్తున్నాయి. ప్రత్యేకించి 2019లో రెండో దఫా అధికారాన్ని చేపట్టిన మోడీ ప్రభుత్వం ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్స్ మార్కెట్ శక్తులు కార్మికవర్గంపై సాగిస్తున్న దాడికి కావల్సిన రక్షణ కవచాలుగా ఉపయోగపడనున్నాయి. ఉదాహరణకు కేంద్రం విడుదల చేసిన వేతన చట్టాన్ని పరిశీలిద్దాం. ఈ చట్టంలో వేతనాలు

నిర్ణయించటానికి ముగ్గురు సభ్యులున్న కుటుంబాన్ని ప్రాతిపది కగా తీసుకుంది. దేశంలో సగటు కుటుంబం పరిమాణం నలుగురు సభ్యులు. కానీ ప్రభుత్వం ముగ్గురు సభ్యులున్న కుటుంబానికి అవసరమైన ఖర్చులు మాత్రమే దృష్టిలో పెట్టుకుని వేతనాలు నిర్ణయించాలని ఆదేశిస్తోంది. మరి కుటుంబంలో ఉన్న మిగిలిన సభ్యులు కడుపు నింపుకునే మార్గం ఏమిటి?

అంతేకాదు. కొత్త చట్టం ప్రకారం నిర్దిష్ట స్థాయిలో వేతనం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దీన్నే ఫ్లోర్ వేజ్ అంటున్నారు. కానీ ఈ ఫ్లోర్ వేజ్‌ని ఎలా నిర్ణయించాలి అన్న విషయంలో చట్టం ఏకమైన స్పష్టతా ఇవ్వలేదు. ఇక ఉద్యోగులను తొలగించే హక్కును కంపెనీలకు దఖలు పర్చింది. నూతన పారిశ్రామిక వివాదాల చట్టాన్ని కాస్తంత విపులంగా పరిశీలిస్తే మోడీ పాలన కార్పొరేట్ వర్గానికి ఏ స్థాయిలో కొమ్ము కాస్తుందో అర్థమవుతుంది. ఇప్పటి వరకూ ఏ పరిశ్రమలోనైనా సమ్మె చేయటానికి రెండు వారాల ముందు నోటీసు ఇస్తే సరిపోతుంది. ఇంతవరకు సమస్య లేదు. కానీ నోటీసు ఎవరు ఇవ్వాలన్నదే సమస్య. కేవలం కార్మిక సంఘాల్లో సభ్యులుగా ఉన్న వాళ్లే సమ్మె నోటీసు ఇవ్వాలన్నది మొదటి షరతు. నోటీసు గడువు తీరిన తర్వాత కొత్త చట్టం ప్రకారం తప్పనిసరి చర్చలు జరపాలి. ఈ చర్చలు ఎంత కాలంలో ముగియాలన్నది తాజా చట్టంలో స్పష్టంగా పేర్కొనలేదు. అంటే కేవలం సమ్మెను నివారించటానికి, అడ్డుకోవటానికి కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో యాజమాన్యాలకు అవధుల్లేని అధికారాన్ని అప్పగించింది. పోనీలెమ్మని నోటీసు ఇచ్చాక రెండు నెలల వరకూ చర్చలు, సంప్రదింపుల పేరుతో కాలం వెళ్లదీసిన తర్వాత కూడా కార్మికులు సమ్మెకు వెళ్లవచ్చా అంటే అదీ లేదు. మొత్తం నోటీసు నుండి మొదలుపెట్టి చర్చలు, సంప్రదింపుల వరకూ మళ్లీ కసరత్తు మొదలుపెట్టాలి. కార్పొరేట్ల ఊడిగం అంతటితో ఆగలేదు. రెండో దఫా చర్చలు కూడా ఫలించకపోతే అప్పుడు అనివార్యంగా కొత్త చట్టం కింద ఏర్పాటయ్యే లేబర్ కోర్టుకు వెళ్లాలి. లేబర్ కోర్టులో వాదోపవాదాలు విని, తీర్పు వచ్చిన తర్వాత తీర్పు కార్మికులకు వ్యతిరేకంగా వచ్చినా మరో రెండు నెలల వరకూ సమ్మెలోకి వెళ్లటానికి వీల్లేదు. గతంలో ఇంత సంక్లిష్టమైన సమ్మె సన్నాహాలు ప్రజోపయోగ పరిశ్రమలు, సేవలకు మాత్రమే పరిమితమయ్యేవి. కానీ తాజా చట్టంలో అన్ని పరిశ్రమల్లోనూ కార్మికులు సమ్మెకు వెళ్లాలంటే వ్యయ ప్రయాసలకు గురై ఈ మొత్తం కసరత్తు పూర్తిచేయాలి. ఇలా చెప్పుకుంటూపోతే కొత్త పారిశ్రామిక వివాదాల చట్టం రూపంలో పెట్టుబడి ముందు సాగిలబడటానికి 56 అంగుళాల ఛాతీ కూడా సరిపోదేమో అనిపించేంత దారుణంగా ఉంది.

భారత కార్మికవర్గంపై ముంచుకొస్తున్న ఈ జంట ప్రమాదాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతున్నారు. ఇది మూడో కోణం. మనందరికీ తెలిసిన విధంగానే పైరెండు కోణాల్లో కార్మికవర్గంపై జరుపు తున్న దాడిలో కార్పొరేట్ – కాషాయ పాలకుల మధ్య ఉన్న ఐక్యత కార్మిక వర్గంలో కొరవడిందన్నది నిస్సందేహం. దీనికి చక్కని ఉదాహరణ తాజాగా ముగిసిన విశాఖ ఉక్కు కర్మాగారం గుర్తింపు సంఘం ఎన్నికలు. ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటు పరం కాకుండా ఉండాలని అఖిల పక్షాన్ని సమీకరించి నెలల తరబడి ప్రత్యక్ష ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల పక్షాన కార్మికులు నిలవలేదు. చట్టసభలకు జరిగే ఎన్నికల్లాగానే విశాఖ ఉక్కు ఎన్నికల్లో సైతం అన్ని కార్మికేతర లక్షణాలు చొరబడ్డాయి. వీటికి తోడు పోరాటంలో ఉన్న కార్మిక సంఘాలు మిత్రులను సమకూ ర్చుకోవటంలో విఫలమయ్యాయి. ఈ విధంగా మిత్రులు సమ కూర్చుకోలేకపోవటం వలన కార్మిక ప్రయోజనాలు నష్టపోతున్న సందర్భాలు గత మూడు దశాబ్దాల్లో అనేకసార్లు తారసపడ్డాయి. అయినా కార్మికవర్గం పాలక వర్గపు కుట్రలకు బలవుతూనే ఉంది.

దేశాన్నేలే కాషాయదళాలకు కార్మికవర్గం, ఉద్యోగ వర్గం లోనూ భజనపరులు గణనీయంగానే ఉన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు కొత్త కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా సమ్మె చేస్తుంటే ఆరెస్సెస్ అనుబంధ కార్మిక సంఘాలు మాత్రం సమ్మెలో చేతులు కలపలేదు. అంతేకాదు. దాదాపుగా ఈ దేశంలో మధ్యతరగతిగా ఎదిగి ఆర్థిక సుస్థిరత సాధించుకున్న కార్మికవర్గపు తరగతి అసలు సమ్మె ఆలోచన చేయటానికి కూడా సిద్ధం కాని పరిస్థితులున్నాయి. సంస్కరణలు మొదలైన సమయంలో ముప్పై నలభై ఏళ్ల వయసులో ఉన్న కార్మికులు ఇప్పుడు దాదాపుగా రిటైర్మెంట్ దశకు చేరుకున్నారు. ఈ మూడు దశాబ్దాల్లో కార్మికవర్గంలో చేరిన వారికి రాజకీయ చైతన్యం సంగతి పక్కన పెట్టి తమ హక్కులు, చట్టపరమైన రక్షణల గురించిన అవగాహనే నామమాత్రంగా ఉంటోంది. దీనికితోడు మతం, కులం, కార్మికవర్గాన్ని నిట్టనిలువునా చీల్చే స్తున్నాయి. తాజాగా కేంద్రం అమలు చేస్తున్న అనేక విధానాలు కార్మిక వర్గంలో సింహభాగంగా ఉన్న హిందువులకే నష్టమన్న కనీస జ్ఞానంతోనైనా మధ్యతరగతి ఉద్యోగులు స్పందించటం లేదు. ఏతావాతా భారత కార్మిక వర్గం ఈ ముప్పేట దాడికి గురవుతూ ఉంటే ఈ దాడి తీవ్రతను గుర్తించకుండా చేయటానికి కార్పొరేట్ అజెండాను భుజాన మోస్తున్న కాషాయ దళాలు కార్మికులను మతతత్వ సమీకరణ సాధనాలుగా వాడుకుం టు న్నాయి. ఈ మూడు పరిణామాలను కలిపి చూస్తే రానున్న కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ, కార్మికవర్గం, సామాజిక ప్రయోజనాలు పెద్దఎత్తున ప్రమాదాన్ని ఎదుర్కోనున్నాయని స్పష్టమవుతుంది. ❑

# ఫాసిజం రూపురేఖలు.. ఎలా వుంటాయి?



- లారెన్స్ బ్రిట్

**దాదాపు ఇరవయ్యేళ్ళ కిందట 2003లో ఫాసిజం రూపురేఖల్ని కళ్ళకు కట్టిస్తూ సుప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త లారెన్స్ బ్రిట్ రాసిన వ్యాసమిది. జెర్మనీకి చెందిన హిట్లర్, ఇటలీకి చెందిన ముసోలినీ, స్పెయిన్‌కు చెందిన ఫ్రాంకో, ఇండొనేసియాకు చెందిన సుహార్తో, చిలీకి చెందిన పినోషె (పినోచెట్) తదితరుల పాలనలను అధ్యయనం చేసి, డాక్టర్ బ్రిట్ ఈ వ్యాసం రాశారు. ఫాసిజం అంటే ఏమిటో గుర్తించడానికి పనికొచ్చే 14 గుర్తులివి అన్నారు బ్రిట్.**

### 1. ప్రబలమైన, ఎడతెగని జాతీయవాద ప్రచారం

ఫాసిస్టు ప్రభుత్వాలు 'దేశభక్తి''ని ప్రకోపించే లక్ష్యాలనూ, నినాదాలనూ, చిహ్నాలనూ, తదితరాలను పదే పదే ప్రయోగిస్తూ వుంటాయి. ఈ గుర్తులూ చిహ్నాలూ నినాదాలను ప్రదర్శించే జెండాలూతోరణాలూ ఎక్కడపడితే అక్కడ ప్రదర్శిస్తారు. బట్టలమీదా, బహిరంగంగా ప్రదర్శించే వస్తువులమీదా వాటిని గొప్పగా చాటుకుంటారు.

### 2. మానవ హక్కుల పట్ల చిన్నచూపు, తృణీకారం

ఫాసిస్టు ప్రభుత్వాల్లో ప్రముఖ పాత్ర వహించేవారు ప్రజల్లో శత్రువులపట్ల భయాన్నీ, వారి భద్రత విషయంలో బెదురునూ కలిగిస్తారు. అందుకే, "అవసరమైనప్పుడు" మానవ హక్కులను నిర్లక్ష్యం చేయవలసి రావచ్చునని ప్రజలకు నచ్చ చెప్పి ఒప్పిస్తుంటారు. హింసాకాండ, వేధింపులూ, మరణశిక్షలూ, హత్యలూ, ఖైదీలకు దీర్ఘకాలంపాటు విధించే జైలుశిక్షల పట్ల ప్రజల్లో ప్రతికూల స్పందన తగ్గి, అలాంటి చర్యల్ని పరోక్షంగానో, ప్రత్యక్షంగానో సమర్థించడం మొదలుపెడతారు.

### 3. ఉమ్మడి శత్రువుల్నీ, బలి పశువులనూ 'గుర్తించడం'

ఉమ్మడి శత్రువుల్నీ, బలి పశువులనూ 'గుర్తించడం' ద్వారా, దాని మద్దతుదారుల్ని ఏకతాటిమీద జమ చేసి దేశభక్తి పేరిట జనాన్ని ముందుగా సమీకరించడం, ఆ తర్వాత 'ఉమ్మడి శత్రువు' లేదా 'ఉమ్మడి ప్రమాదం'గా ప్రచారంలో పెట్టిన జాతులను, తెగలను, అల్పసంఖ్యాక వర్గాలను, ఉదారవాదులను, కమ్యూనిస్టులను, సోషలిస్టులను, 'ఉగ్రవాదులు'గా ముద్రకొట్టినవారిని ఏరిపారేయాల్సిన ఆవశ్యకతను నూరిపోసి దాడులు చేసే మూకల గుంపులను పోగేయడం సాగిస్తారు.

### 4. సైన్యం ఆధిక్యం

దేశం ఎన్నో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటన్నిటికీ మించిన ప్రాముఖ్యాన్ని సైన్యానికి ఇస్తారు. ప్రభుత్వ నిధుల్లోంచి సింహభాగం సైన్యంపై పెట్టే ఖర్చులకే కేటాయిస్తారు. అంతర్గత సమస్యలపై కార్యక్రమ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరాన్ని నిర్లక్ష్యం చేస్తారు. సైనికులనూ, సైనికసేవలనూ ధీరోదాత్తమైన ఆదర్శాలుగా మితిమీరిన ప్రచారం చేస్తారు.

### 5. చెలరేగే పురుషాహంకారం

ఫాసిస్టు ప్రభుత్వాలు ప్రధానంగా "పురుషులకు మాత్రమే ప్రభుత్వాలు అయివుండడం కద్దు! సాంప్రదాయికంగా స్త్రీలకు పురుషులకు నిర్దేశించిన పాత్రలను ఫాసిస్టులు మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తారు. అబార్షన్లకు వ్యతిరేకత తీవ్రతరమవుతుంది. లైంగిక సంబంధాల విషయంలో ప్రజాస్వామిక మనోభావాలకు తావులేకుండా పోతుంది.

### 6. మీడియాపై కర్రపెత్తనం

సమాచార, ప్రసార సాధనాలను ఫాసిస్టు ప్రభుత్వాలు స్వయంగా నిర్వహించాలని యత్నించడంకద్దు. ఒక్కోసారి, తమను సమర్థించే మీడియా ప్రతినిధులూ-అధికారులను అడ్డుపెట్టుకుని సమాచార, ప్రసార సాధనాలపై ఫాసిస్టు ప్రభుత్వాలు పరోక్షంగా పెత్తనం సాగిస్తాయి. ప్రభుత్వాల అధికారులు మతపరమైన ప్రవచనాలనూ, పదజాలాన్నీ కలిపి పేని ప్రయోగిస్తారు. ప్రభుత్వ విధానాలకూ చర్యలకు మతబోధనలు పూర్తి విరుద్ధంగా వున్నప్పటికీ కూడా ఫాసిస్టు ప్రభుత్వాధికారులు ఇందుకు తెగిస్తారు.

### 9. కార్పొరేట్ శక్తుల పటిష్ఠీకరణ

ఫాసిస్టు ప్రభుత్వాలను గద్దెనెక్కించే వారు సాధారణంగా పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లోని కులీనవర్గాలే అయివుంటాయి. అలా చెయ్యడం ద్వారా, వాళ్ళూ వీళ్ళూ పరస్పరం లాభదాయకంగా వుండే సంబంధాలను ఏర్పాటు చేసుకుంటారు.

### 10. శ్రామిక బలగంపై అణచివేత

ఫాసిస్టు ప్రభుత్వాలకు ఎప్పుడైనా నిజమైన సవాలుగా నిలబడగలిగేది శ్రామిక బలగాలు మాత్రమే! అందుకే, ఫాసిస్టులు కార్మిక సంఘాలను పూర్తిగా నిర్మూలించడానికి, కనీసం అణచి పారేయడానికి, ప్రయత్నిస్తారు. **(మిగతా 35వ పేజీలో)**

# మహా మానవతావాది సర్ చార్లీ చాప్లిన్



డాక్టర్ దేవరాజు మహారాజు
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, జీవ శాస్త్రవేత్త

**'ది గ్రేట్ డిక్టేటర్' సినిమాలో చాప్లిన్ ద్విపాత్రాభినయం చేశాడు. ఒకటి, హిట్లర్ పాత్ర(డిక్టేటర్), రెండు, హిట్లర్ పోలికతో ఉన్న మంగలి పాత్ర. మిలట్రీ అధికారులు హిట్లర్ రాక కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఆ సభలో హిట్లర్ సైనికుల్ని ఉద్దేశించి మాట్లాడవలసి ఉంది. కానీ ఆ సమయానికి హిట్లర్ బదులు అతడి పోలికలతో ఉన్న మంగలి చేరుకుంటాడు. అతడే హిట్లర్ అనుకొని అధికారులు గౌరవ వందనం సమర్పిస్తారు. అతణ్ణి వేదిక మీదకు తీసుకువెళతారు. అతి సామాన్యుడైన మంగలి ఏం మాట్లాడగలడు ? ఒక నిమిషం తడబడి ఆ తర్వాత సామాన్యుడిగా తను కోరుకుంటున్నదేమిటో అదే మాట్లాడతాడు. మానవత్వాన్ని తట్టిలేపుతూ కవితాత్మకంగా సాగిందీ ఆ ఉపన్యాసం.**

హిట్లర్‌ను ఎద్దేవా చేసే చార్లీ చాప్లిన్ తన అంతరంగాన్ని అతి సామాన్యుడైన మంగలి పాత్ర ద్వారా ఈ విధంగా వ్యక్తం చేశాడు. ఇది ఒక రకంగా చార్లీ చాప్లిన్ అంతరాత్మ మానవాళికి చేసిన ఉద్బోధ. మహా విదూషకుడి మహోపన్యాసం. ఇది వెలువడి డెబ్బయ్ ఏళ్లు(1940) అయినా ఇంకా నిత్య నూతనంగా ఉంది. ఈ కాలానికి సరిపడే విధంగా కూడా ఉంది. చాప్లిన్ మహా నటుడు, మహాదర్శకుడు అనడానికి ఇదొక మంచి ఉదాహరణ. 'ది గ్రేట్ డిక్టేటర్' సినిమాలోని చాప్లిన్ ఉపన్యాసం పూర్తి పాఠం తెలుగులో ఇక్కడ మీకందిస్తున్నాను. మనుషులైన వారందరూ ఈ విషయాల్ని గుండెల్లో భద్రపరచుకోవాల్సిన అవసరం ఉంది.

**క్షమించాలి...** నాకు చక్రవర్తిని కావాలని లేదు. అలాంటి ఉద్దేశమే లేదు. ఎవరినో జయించాలని కానీ, ఎవరి మీదనో పెత్తనం చలాయించాలని కానీ నాకు లేదు.

తెలుపు - నలుపు అన్న తేడా లేదు.



ప్రతి వారికీ చేయగలిగినంత సహాయం చేయాలనే ఉంది.

మనం ఒకరికొకరం సహాయపడుకుంటూ ఉండాలి.

ఎదుటి వారి సంతోషమే మనకు స్ఫూర్తిని, సంతృప్తిని ఇస్తుంది. వారి దు:ఖం కాదు. ఒకరిని అసహ్యించుకోవడం, అవహేళన చేయడం మనం కోరుకోం.

ఈ విశాల ప్రపంచం అందరిదీ. తల్లి భూదేవి బిడ్డలం మనమంతా. ఆమె దగ్గర దేనికీ కొదవలేదు.

మన జీవితం స్వేచ్ఛకూ, ఆనందానికీ ప్రతిరూపమవ్వాలి.

కానీ, మనం దారి తప్పుతున్నాం.

స్వార్థం మనుషుల అంతరాత్మలను విషపూరితం చేస్తోంది.

కుత్సితాలతో ప్రపంచాన్ని కుంచింపజేస్తోంది.

కుటిలత్వానికీ, రక్త పాతానికీ మానవుల్ని చేరుస్తోంది.

వేగాన్ని అభివృద్ధి పరిచాం. నిజమే.

కానీ మనలో మనమే ముడుచుకుంటున్నాం.

కావాల్సినవన్నీ యంత్రాలు తయారు చేస్తున్నాయి.

కానీ, మన కోర్కెల దాహం తీరడం లేదు.

మన విజ్ఞానం మనలను మానవ ద్వేషులుగా చేస్తూ ఉంది.

మన తెలివితేటలు మనల్ని నిర్దయులుగా, కఠినాత్ములుగా తీర్చి దిద్దుతున్నాయి. మనం చాలా ఎక్కువగా ఆలోచిస్తాం.

అవసరమైనప్పుడు చాలా తక్కువగా స్పందిస్తాం.

యంత్రాల యంత్రాంగంకన్నా మనకు మానవత్వపు మనుగడ ముఖ్యం కావాలి. మితిమీరిన తెలివితేటలకన్నా మర్యాద, మన్నన, దయార్ద్ర హృదయం కావాలి.

ఈ లక్షణాలు లేని జీవితం భయానకమై నశిస్తుంది.

రేడియో, విమానాలు మానవుల్ని దగ్గరి పరిధిలోకి చేరుస్తున్నాయి. మానవునిలోని మంచితనమే వీటిని కనుక్కోగలిగింది. విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ఎలుగెత్తి చాటింది. ఈ నా మాట ప్రపంచంలోని కోటాను కోట్ల ప్రజలకు అందుతోందని నాకు తెలుసు. పురుషులు, స్త్రీలు, పసిపిల్లలు, నిరాశా సదృశులు, పీడించే ఈ వ్యవస్థకు బలైన అమాయకులూ, ఎవరూ నిరాశపడవద్దు. మానవ పురోగతికి అది గొడ్డలిపెట్టు.

ఈర్ష్యా ద్వేషాలు నశిస్తాయి. నియంతలు నశిస్తారు. ప్రజల నుంచి లాక్కున్న అధికారం మళ్ళీ ప్రజలకే దక్కుతుంది. స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు నశించవు. తాత్కాలికంగా అణచబడ్డా అవి సంకెళ్ళు తెంపుకొని ధైర్యంగా బతుకుతాయి.

**సైనికులారా ఆలోచించండి!**

దుష్టుల పక్షాన, దుర్మార్గుల పక్షాన నిలబడవద్దు. మీకు తిండి పెట్టి కసరత్తులు చేయించి, మిమ్మల్ని పూర్తిగా వాడుకునేవాడు ఎలాంటి వాడో ఒకటికి రెండుసార్లు బాగా ఆలోచించండి.

మీ ఆలోచనల్ని, మీ అనుభూతుల్ని శాసించే హక్కు ఎవరికీ లేదు. మీరు పశువులు కారు. గడ్డిపోచలు కాదు. మానవ యంత్రాలకు దాసోహమనేది లేనే లేదు. యాంత్రిక మేధస్సులు, మాంత్రిక హృదయాలూ గల కృత్రిమమైన యంత్రాలు వాళ్ళు.

మీరు యంత్రాలు కాదు – మనుషులు!

మనుషులు !! – మీరు యంత్రాలు కాదు.

మానవత్వం పట్ల మీకు అచంచల విశ్వాసం ఉంది.

ఎదుటి వారిని ప్రేమించగల గొప్ప హృదయం ఉంది.

ఎవరి చేతా ప్రేమించబడని కొద్ది మంది యంత్ర–మానవులు మాత్రమే అసహజంగా, అసహ్యంగా, కృత్రిమంగా ప్రవర్తిస్తారు.

**వీర సైనికులారా!**

స్వేచ్ఛ కోసం పోరాడండి. బానిసత్వం కోసం కాదు.

మీలో ఒక మహత్తర శక్తి ఉంది. జీవితాన్ని అందంగా, ఆనందంగా, సుఖప్రదంగా, ప్రశాంతంగా తీర్చిదిద్దుకోగల శక్తి మీలో ఉంది. యంత్రాల్ని సృష్టించుకోగల నేర్పరులు మీరే యంత్రాలై పోకుండా మనుషులుగా నిలదొక్కుకునే ఆత్మ శక్తి మీలోనే ఉంది. దాన్ని బయటికి లాగండి. ఇంకా ఆలస్యమెందుకూ?

రండి! ప్రజాస్వామ్యం పేరిట ఏకమై

ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుందాం!

ప్రతి వాడికీ పని, యువతకు మంచి భవిష్యత్తు

వృద్ధాప్యానికి భద్రత గల ఒక మంచి సమాజాన్ని సృష్టిద్దాం.

అబద్ధాలూ, మాయమాటలూ చెప్పి అవినీతిపరులంతా, అహంకారులంతా గద్దెలెక్కుతున్నారు. వాగ్దానాలను నిలబెట్టుకున్న వారు ఇంత వరకూ లేరు.

ఇప్పుడు మనకై మనమే వాటిని సాధిద్దాం.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైతం

స్వేచ్ఛకు అడ్డుగోడల్ని తొలిగిద్దాం.

దురాశ, దు:ఖం, అసూయ, కూరత్వాలకు

నిలువ నీడ లేకుండా చేద్దాం. శాస్త్ర సాంకేతికాభివృద్ధి సాధించే ప్రగతివైపు పయనిద్దాం రండి!!

**అందరం ఏకమౌదాం!"**

ఇదీ చాప్లిన్ ఉపన్యాసం. ఇక్కడ మరొక విశేషముంది. హిట్లర్‌ను చార్లీచాప్లిన్ ఆటపట్టించాడు. కానీ, హిట్లర్ చాప్లిన్ అభిమానులలో ఒకడు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా 'వరల్డ్స్ గ్రేటెస్ట్ ఎంటర్ టేయినర్'గా ప్రపంచాన్ని నవ్వుతో శాసించిన 'గ్రేట్ డిక్టేటర్'గా భావించబడ్డ సర్ చార్లీ చాప్లిన్ (16 ఏప్రిల్ 1889 – 25 డిసెంబర్ 1977) తన విజయ రహస్యాన్ని తానే అనేకసార్లు బేరీజు వేసుకున్నాడు. మానవ మనస్తత్వాన్ని అనేక కోణాల్లోంచి విశ్లేషించుకున్నాడు. దాన్ని బట్టే తెర మీద తన వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకున్నాడు. అమోఘంగా రక్తికట్టించాడు కూడా! 'ఈ ప్రజలు దేన్ని చూసి నవ్వుతారు?' అనే శీర్షికతో చాప్లిన్ 1918లో ఒక అమెరికా పత్రికకు వ్యాసం రాశాడు. ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. అయితే అవి ఎంత సామాన్యమైనవో అంత విలువైనవి కూడా.

**హాస్యం టోపీ ఎగిరిపోవడంలో లేదు. దాన్ని పట్టుకోవడానికి ఒక పెద్దమనిషి పడే అవస్థలో ఉంది. ప్యాంటు పగిలిపోవడంలో లేదు. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి పడే తికమకలో ఉంది. అలాగే జారిపోయే ప్యాంటును వదిలేస్తే ఎవ్వరికీ నవ్వు రాదు. కానీ జారిపోకుండా పైకి అనుకుంటూ హడావుడి పడిపోవడంలో హాస్యం ఉంది. అమ్మాయి నగ్నత్వాన్ని ప్రదర్శిస్తున్న పోస్టర్‌ను, ఒక పెద్ద మనిషి నిలబడి తనివితీరా చూస్తుంటే ఎవరికీ నవ్వురాదు. సమాజంలో తాను ఒక పెద్ద మనిషినని గుర్తుంచుకొని అలా చూస్తూ ఉంటే తన వ్యక్తిత్వానికి దెబ్బ తగులుతుందని బాధపడుతూ, ఉండలేకపోతూ, చూడనట్టు నటిస్తూ చూస్తూ ఉండడంలో హాస్యం ఉంది. బలహీనుడై ఉండి, పహిల్వాన్‌తో ఛాలెంజ్ చేయడం, తెలివిగా తన్నులు తప్పించుకుంటూ ఉండడంలో హాస్యం ఉంది. హాస్యం కత్తి మీద సాములాంటిది. ఎక్కడ ఏ కొద్దిగా బెడిసికొట్టినా హాస్యానికి బదులు జుగుప్స, ఏవగింపు కలుగుతాయి.**

ప్రపంచాన్ని తరతరాలుగా కదిలిస్తూ వస్తున్న చార్లీచాప్లిన్ సునిశిత హాస్యం ఎక్కడి నుంచో రాలేదు. మాయలూ, మంత్రాలూ అందులో ఏమీ లేవు. జీవితాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకున్న చాప్లిన్ మేధస్సులోంచి వచ్చింది. నిజానికి జీవితాన్ని జీవితాంతం చదివినా సరిపోదు. అలాంటి జీవితంలో నవ్వించగల అంశాల గూర్చి నిరంతరం ఆలోచిస్తూ గడిపిన చాప్లిన్ మరొక ముఖ్యమైన విషయం కూడా గ్రహించాడు. ప్రేక్షకులు ఊహించిందే తెరమీద కనిపిస్తే నవ్వరనీ, ప్రేక్షకులు ఊహించని విధంగా విభిన్నమైన ధోరణిలో ప్రవర్తిస్తూ ఉండడం వల్ల వారిలో ఉత్కంఠ, ఉత్సాహం పెరుగుతుందని ఆయన గ్రహించాడు. ప్రేక్షకుల, బలహీనతల్ని ఆయన ఎప్పుడూ దెబ్బ తీయలేదు. ఇదొక గొప్ప సుగుణం! తనకు తాను కల్పించుకున్న బలహీనతలతోనే ప్రేక్షకులకు నవ్వు బలాన్నిచ్చాడు. ప్రపంచాన్ని నవ్వులతో శాసించిన మొనగాడు చాప్లిన్ తప్ప మరొకరు లేరు.

"నూటికి పది మంది బాగా ఉన్నవాళ్ళూ, తొంభయి మంది లేనివాళ్ళూ ఉన్న ఈ సమాజంలో తొంభయ్ శాతం ప్రజల్ని నవ్వించడానికి, పది శాతం మందిని గేలిచేయడంలో తప్పేమిటి?," అన్నది ఆయన ప్రశ్న! వర్గ దృక్పథాన్ని ఇంత సులభంగా, సరళంగా చెప్పినవాళ్ళు బహుశా ఎవరూ లేరేమో! హాస్యంతో మానవవాదానికి ఊపునిచ్చిన మహనీయుడు కూడా మరొకరు లేరేమో!! ❑ **(ఏప్రిల్ 16 చార్లీ చాప్లిన్ జయంతి)**


# ప్రజాస్వామ్యంలో ఫాసిస్టులు ఎలా గెలుస్తారు?



- అశోక్ కుంబము

**కేంద్రంలో మళ్లీ మోడీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఎంతో మంది ప్రగతిశీల ఉద్యమకారులను, లౌకిక ప్రజాస్వామిక వాదులను కలవరపెడుతుంది. ఇదే విషయాన్ని సామాజిక మాధ్యమాలలోనూ పంచుకుంటున్నారు. ప్రజలు ఫాసిస్టు పాలకులకు పూర్తి మెజారిటీ ఇచ్చి మళ్లీ అధికారం ఎట్లా కట్టబెట్టారని ఆశ్చర్యపోతున్నారు. ఈ ఆవేదనను అర్థం చేసుకోవచ్చు, కానీ, దానికి సమాధానం కేవలం ఎన్నికలను విశ్లేషిస్తే దొరకదు.**

దాదాపు డెబ్బై ఏండ్లుగా కొనసాగుతున్న తతంగమే అయినా ఈ ఎన్నికలు మరీ స్పష్టంగా తన బూటకత్వాన్ని ప్రకటించుకు న్నాయి. ఎన్నికలు బూటకమని చెప్పడానికి ఇప్పుడు పెద్ద సిద్ధాంత చర్చ కూడా అవసరం లేని స్థితి వచ్చేసింది. కేవలం కులం, మతం, డబ్బు ఆధారంగా ఎన్నికలు జరుగుతున్నాయం టేనే అవి అప్రజాస్వామికమైనవని, ఆధిపత్యం తప్ప మరే విలువలు లేనివని అర్థమవుతుంది. ఈ విషయం ప్రజల స్పృహకు రాలేదని కాదు, కాకపోతే ఎన్నికలంటేనే ఈ విధంగా వుంటాయనే ఒక ఆధిపత్య విలువను అన్ని బూర్జువా పార్టీలు ఒక సాధారణ విషయంగా మార్చేశాయి. దానిని ప్రశ్నించడం కూడా వృథా అన్నంత గట్టిగా మెజారిటీ ప్రజల మెదళ్లలో పాతేశారు. వాస్తవం ఇంత నగ్నంగా ఉంటే, ఉదారవాద విలువలతో 'నీతివంతమైన' ఎన్నికల ద్వార సమాజాన్ని మార్చేద్దామని కలలు కనే సమూహాలు ఇంకా ఉన్నాయి.




మార్చేయవచ్చు అనే ఒక భ్రమను ప్రచారం చేసే బుద్ధిజీవులు, రాజకీయ నాయకులూ ఉన్నారు. ఈ సమూహాలకు దేశ రాజకీ యార్థిక, సామాజిక పరిస్థితి, దోపిడీ వర్గాల, కులాల కునీతి, వాళ్ల బలం, ఎత్తుగడలు ఇంకా అర్థం కాలేదనే అనుకోవాలి. ఒకవేళ అర్థమయితే, పార్లమెంటరీ ప్రజాస్వామ్య భ్రమల్లో కూరుకుపోయి వాస్తవాన్ని విస్మరిస్తున్నారనే అనుకోవాలి.

మొత్తంగా సారాంశంలో పాలకవర్గ ప్రయోజనాలను కాపాడడానికే(కొంత ప్రోగ్రెసివ్ అంశాలు వున్నప్పటికి) అమలులోకి వచ్చిన రాజ్యాంగాన్ని "రక్షించుకుందాం" అని నినదించిన పార్టీలను రాజ్యాంగాన్ని 'భక్షించే' పార్టీ ఓడించింది. ఈ సందర్భంలో ప్రగతిశీల వాదులు కొంత నిరుత్సాహపడటం గమనిస్తుంటే నాకు అమెరికాలో ట్రంప్ ఎన్నిక సందర్భంగా తన అభిప్రాయాన్ని చెప్పమని కోరినప్పుడు ఒక అమెరికన్ ఆదివాసీ చెప్పిన మాల్కం ఎక్స్ మాటలు గుర్తుకొస్తున్నాయి.

**"ఒకడు దైవదూత రూపంలో వచ్చి దయ్యంలా పడుతాడు. మరొకడు ముందే తన దయ్యం రూపాన్ని ప్రకటించుకొని వస్తాడు." రూపాలు వేరైనా, సారంలో ఇద్దరూ ఒక్కటే. ఎందుకంటే ఇద్దరి ప్రయోజనాలు ఒక్కటే. పార్లమెంటరీ రాజకీయ నాటకంలో స్టేజ్ మీదనే వీళ్లలో బేధాలు కనిపిస్తాయి. కానీ, స్టేజ్ వెనుకాల లేదా దిగినాక అంతా ఒక్కటే. అయితే ఇది చలా తేలికైన సూత్రీకరణ. దీనిని దాటి ఇంకా మూలాలలోకి పోవాలి.**

ముందే చెప్పినట్లు, ఎన్నికల ప్రక్రియనే బూటకం అయినపుడు (ఈ మాట ఇప్పుడు చంద్రబాబు లాంటి బూర్జువా నాయకుడు కూడా అంటున్నాడు. అయితే ఆయన ప్రయోజనం వేరే) ఎవరు గెలిచినా, ఓడినా ప్రజలకు ఒరిగేది ఏమీ వుండదు. అయినా కూడా ఫాసిస్టు విధానాలను తమ అజెండాగా ప్రకటిం చుకొని అమలుచేస్తున్న రాజకీయ పార్టీకి మళ్లీ పట్టం కట్టడం కొంత కలవరపెట్టేదే. అయినా ఆశ్చర్యపడేది ఏమి కాదు. ఎందుకంటే చరిత్రలో కూడా ఫాసిస్టులు ప్రజల మద్దతును కూడగట్టుకోగలిగారు. అది ఎలా సాధ్యమయ్యింది, వాళ్ల ఎత్తుగడలు ఏమిటో అర్థం

చేసుకుంటే కాని ఈ ఎన్నికల అసలు విషయం అర్థం కాదు. నిజమే. ఫాసిస్టులు అధికారంలోకి రావడం అంటే ఒక బూర్జువా పార్టీ నుంచి అధికారం మరో బూర్జువా పార్టీ తీసుకోవడం లాంటిది కాదు. అంతకుమించిన రాజకీయ ప్రక్రియ జరుగుతుంది. ఎందుకంటే ఫాసిస్టులు ఎన్నికల్లో లేదా ఎన్నికల కోసమో పుట్టరు. వాళ్లకు ఎన్నికలు ఒక వాహనం మాత్రమే. ఎన్నికల ద్వారా లభించే ప్రజల 'మద్దతు'తో ఉదారవాద స్వభావం ఉండే పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఫాసిస్టు నియంతృత్వం వైపుగా మలుపుతారు. ఆ క్రమంలో చైతన్యవంతమైన పౌరసమాజాన్ని, అది సంపాదించుకున్న రాజకీయ విలువలను ధ్వంసం చేసి వాటి స్థానంలో ఒక భజన 'మేధావి'వర్గాన్ని, అరాచక మూకను ఏర్పాటు చేసుకుంటుంది. రాజ్యం భాషలోనే చెప్పాలంటే 'అర్బన్ ఫాసిస్టులను' తయారు చేస్తుంది. ఈ మొత్తం ప్రక్రియ అంతా ఒక 'నూతన ఫాసిస్టు మానవున్ని' నిర్మించే దిశగా అడుగులు వేస్తుంది. ఈ పనిని కాషాయపు ఫాసిస్టులు ఇప్పటికే మొదలుపెట్టారు.

నూతన ఫాసిస్టు మానవున్ని అహేతుకతమైన భావోద్వేగ దూకుడు (irrational emotional aggression) మీద నిర్మితం చేస్తున్నారు. ఇది ఒక ఉన్మాదస్థాయికి తీసుకు పోయే పనిలో వున్నారు. కనీస ప్రజాస్వామిక, లౌకిక విలువలను సైతం సహించక వాటిని ధ్వంసం చేసి, వాటి స్థానంలో బ్రాహ్మణీయ హిందూ ఆధిపత్యాన్ని నిలబెడుతున్నారు. దేశమంటే ఒకే ఒక మతమని, కేవలం హిందువులదే దేశమని, హిందువులు కాని వాళ్ళు దేశీయులే కారని, వాళ్ళు హిందువుల దయాదాక్షిణ్యాల మీద బతకాలని, భారతీయత అంటేనే హిందుత్వ అనే వాదనను ప్రజల నిత్య జీవితంలో భాగం చేసే కుట్రలు చేస్తున్నారు. ఏక జాతి అనే అతివాద ధోరణిని కాపాడు కోవడం కోసం దేశానికి ఒక 'శక్తివంతమైన నాయకుడు' అవసరమని సంఘ్ పరివార్ శక్తులు నెత్తుటి చరిత్రే అర్హతగా మోడీని మరో 'ఉక్కు మనిషి'గా ప్రచారం చేసి విజయవంతమ య్యాయి. ఆ నాయకుడే బయటి, లోపలి 'శతృవుల' నిలువరించగలుగు తాడనే ప్రచారం ఎడతెరపి లేకుండా ప్రజల్లోకి తీసికెళ్ళి అది నిజమే కాబోలు అనేంతగా ఫాసిస్టులు చేయగలిగారు. ఈ మొత్తం ప్రచారమంతా ద్వేషం, హింస, అణిచివేత, యుద్ధం పునాదుల మీదనే జరిగింది. దేశానికి ఒక ప్రజాస్వామిక నాయకుడు (ఉదారవాద అర్థంలోనైనా) కాదు, ఒక ఫాసిస్టు నియంత కావాలనే భావనను ప్రజల మెదళ్ళలోకి ఎక్కించడంలో హిందుత్వ శక్తులు సఫలమయ్యాయి. దాని కోసం దేశంలో పెరుగుతూ వస్తున్న దిగువ, ఎగువ మధ్య తరగతిని పునాదిగా ఎంచుకొని పనిచేశారు.

నయా ఉదారవాద ప్రపంచీకరణ సందర్భంలో ముఖ్యంగా మధ్యతరగతి తన రాజకీయ స్వభావాన్ని మార్చుకుంది. పౌర సమాజంలో కనీస ప్రేక్షక పాత్రను కూడా వదులుకొని చివరికి ఒక మార్కెట్ వినియోగదారుడిగా మార్చబడింది. మధ్య తరగతి ని మార్కెట్‌కు బందీ చేయడానికి ఆధునిక పరిజ్ఞానం, సమా చార విజ్ఞానం ఒక అత్యవసరం చేశారు. ఈ ఆధునిక మానవుడి నిత్య జీవితమంతా పరిజ్ఞానం మీదనే ఆధారపడి నడుస్తుంది, కాని సమాజానికి సంబంధించిన ఆలోచనలు మాత్రం పురాతన మైనవి. ఆర్థికంగా పెట్టుబడిదారి ఆలోచనలు, సామాజికంగా (నయా) భూస్వామ్య పోకడలు. మొత్తంగా సమాజ అభివృద్ధి నిరోధక తత్వం. ఇటువంటి అభివృద్ధి నిరోధక ఆధునికుడు (reactionary modernist) ఫాసిస్టులు కలలుగనే రేపటి 'నూతన ఫాసిస్టు మానవుడికి' ప్రాథమిక రూపం.

**ఈ నూతన మానవుడు ప్రశ్నలను సహించడు. ఎందుకంటే తన తలను పెట్టుబడి ఉన్మాదానికో లేక మతోన్మాదానికో ఎప్పుడో తాకట్టు పెట్టాడు. పురాణాలను విజ్ఞానశాస్త్రం చేసినా, నేరస్తులు చట్టసభల్లో ప్రజా ప్రతినిధులుగా మారినా, న్యాయం చీకటి గదుల్లో బంధీ అయినా తప్పులేమీ కనబడవు. ఎందుకంటే తనొక పరాధీన జీవి. ఇటువంటి జీవులను ఆడించడానికి ఫాసిస్టులు చెప్పిందే మళ్లీ మళ్లీ చెబుతారు. అబద్ధాలను నిజమని నమ్మేలా చేస్తారు. మొత్తంగా ఒక మాస్ హిస్టీరియాను సృష్టించి, తద్వార అహేతుకమైన, అరాచకమైన శక్తులను తయారుచేస్తారు. ఇవన్నీ దేశ ప్రయోజనాల కోసం "దేశ భక్తులు" చేస్తున్న పనిగా చెప్పుకుంటారు.**

ఇటువంటి సామాజిక సందర్భంలో చరిత్ర చెబుతున్నట్లు ఉదారవాద ప్రజాస్వామ్యం ఒక అడుగు వెనుకకు వేస్తే, ఫాసిజం పది అడుగులు ముందుకువేస్తుంది. ఇక ప్రజలను విడదీయడా నికి వాడు నిరంతరం కుట్ర చేస్తూనే వుంటాడు. మాట మాట్లాడ కుండా భయాన్ని ఆయుధంగా ప్రయోగిస్తూనే ఉంటాడు. పోరాడే ప్రజల మీద యుద్ధం తీవ్రం చేస్తాడు. అణగారిన కులా ల, మతాల, జాతుల మీద హింసను కొనసాగిస్తాడు. ఇవన్నీ చేయకపోతే వాడు ఫాసిస్టే కాడు. అయితే, ప్రజలు, వాళ్లకు మద్దతుగా నిలబడే బుద్ధిజీవులు, కవులు, రచయితలు, కళాకారు లు ఎప్పటికి బాధితులుగానే మిగిలిపోరు. వాడి బెదిరింపులకు బెదిరిపోరు. అనివార్యంగ తమ ఆచరణ పరిధిని విస్తరించుకుం టారు. అయితే చరిత్ర చెబుతున్నట్లు ఫాసిజాన్ని పార్లమెంటులో ఓడించలేము. అది కేవలం అనేక ప్రజా పోరాటాల ద్వారానే సాధ్యమవుతుంది. ప్రజలు త్యాగపూరిత పోరాటాల ఒరవడిలో ఏకమవుతారు. ఫాసిస్టులను ఒంటరి చేస్తారు. ప్రజలు ఎన్నికల్లో ఓడినా, పోరాటాలలో గెలుస్తారు. ఇదే చరిత్ర చెబుతున్న సత్యం. అంతిమ విజయం ప్రజలదే. ❑

# చెవులు పగిలే మౌనం మధ్య నుంచి



- ఫే డి సౌజా

**వ్యాపారాలూ, ఆదాయాలూ, ఉద్యోగాలూ సద్యోగాలూ, పరువులూ ప్రతిష్ఠలూ ఇవన్నీ వున్నవాళ్ళు, - అంటే, పోగొట్టుకోడానికేదో ఒకటి వున్న వాళ్ళన్నమాట ఈ రోజుల్లో మహాలౌక్యంగా మౌనం పాటిస్తున్నారు! బాలీవుడ్‌లో సుప్రసిద్ధులుగా వున్న మగమహారాజుల మౌనం చెవులు పగిలేలా వినబడుతోందీ రోజున! వాళ్ళందరూ బడాబడా ప్రాజెక్టుల పల్లకీలపై స్వారీ చేస్తున్నారు. కండలు తిరిగిన వస్తాదుల బండ బుజాలపై ఆ పల్లకీలు ఊరేగుతున్నాయి! మహిళామణులకన్నా ఈ మగ మహారాజులే ఎక్కువ నొల్లుకుంటున్నారు - అంచేత, వాళ్ళు నోళ్ళు విప్పితే వాళ్ళకే ఎక్కువ నష్టం మరి!**

ఇక మన కార్పొరేట్ సామ్రాజ్యాధిపతులు–సర్కారును కొనగోటితో తాకడానికి సైతం గజగజలాడుతున్నారు! ఆ అలా చేస్తే, తమ ఫైళ్ళు నార్త్ బ్లాక్‌లో ఇరుక్కుపోతాయేమోనన్నది అన్నీ వున్న ఆ పరిశ్రమాధిపతుల భయం !

అంతేకాదు–ఎప్పట్లాగే ఎక్కువ సంపాదించలేకపోయిన నేరానికి తమను ఎవరు ఎక్కడ శిక్షిస్తారోనని వణుకుతున్నారు వాళ్ళు! ఏతవాతా, వున్న వాళ్ళం దరూ నోళ్ళునొక్కుకుని మౌనవ్రతం పాటిస్తున్నారు!!

మరో వైపున మానవ హక్కుల ఉల్లంఘనల వల్ల స్రవించే గాయాలతో మన వీధులు రక్తసిక్తమవుతున్నాయి! ఈ లౌకిక దేశ స్వభావాన్ని బలవంతంగా మార్చే ప్రయత్నాలతో, నేరాలూ ఘోరాలతో మన వీధులు రక్తసిక్తమవుతున్నాయి!!

కానీ – చదువు సంధ్యలున్న వాళ్ళూ, పత్రికల్లోనూ తదితర సమాచార సాధనాల ద్వారానూ సొంత గొంతు వినిపించగలిగిన వాళ్ళు మాత్రం నిలువెల్లా నిశ్శబ్దం అనే ముసుగును నిగడతన్ని నిద్రనటిస్తున్నారు!

కశ్మీర్లో, అస్సాంలో, జామియాలో, ఉత్తర్‌ప్రదేశ్‌లో, జేఎన్‌యూలో ఎక్కడ మానవ హక్కుల ఉల్లంఘన జరిగినా భద్ర జీవుల వీధుల్లో వినిపించింది మౌనమే! ఈ అన్ని సందర్భాల్లోనూ కాపా డుకోవలసి ఉండినదీ అపారమే – కోల్పోయినదీ అనంతమే!! ఔను బాబాయ్, మీరనేదీ నిజమే, నేనర్థం చేసుకోగలను ! పాపం నడిమి తరగతి బడుగుజీవులు! కోరికోరి కొట్లాటలు ఎలా కొనితెచ్చుకోగలరు మీరు?

నిజమే కానీ ఇలాంటి గడ్డు రోజుల్లో కూడా తలదించుకోకుండా, వంచుకోకుండా నిలబడుతున్నదెవరు బాబాయ్?

ఓ కణ్ణన్ గోపీనాథ్, ఓ కన్హయా కుమార్,
ఓ వరుణ్ గ్రోవర్, ఓ స్వరా భాస్కర్,
ఓ జీషాన్ అయూబ్, ఓ దీపికా పదుకోన్,
ఓ ఫర్హాన్ అఖ్తర్, ఓ సంధ్యా మృదుల్,
ఓ షైలా రాషీద్, ఇప్పటికీ (ఈ ప్రసంగం చేసే నాటికి) కటకటాల్లో మగ్గుతున్న ఓ షా ఫైజల్,
దేశమంతటా వ్యాపించి వుండి,
నియంతృత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తి నినదిస్తున్న,
నిలబడుతున్న లక్షలాది మంది విద్యార్థులు
వీళ్ళెవరికీ కాపాడుకోవలసిన కుటుంబాల్లేవా?
వాళ్ళకి పోయే ఆదాయాలేం వుండవా ??
వాళ్ళకంటూ ఓ ఉద్యోగమూ సద్యోగమూ, వృత్తి వ్యాపారమూ, భద్రతా భవితా ఏం అక్కర్లేదా బాబాయ్?
వాళ్ళకీ అన్నీ వున్నాయ్ – ఆ వున్నవాటికన్నిటికీ ముప్పు వచ్చి పడింది కూడా!!

అసలు మన ఉనికే ముప్పులో పడిందిప్పుడు బాబాయ్!

ఓ ప్రజాతంత్ర, లౌకిక రాజ్యంగా మన ఉనికే ముప్పులో పడిందిప్పుడు!

"మిలే సుర్ మేరా తుమ్హారా" అనుకునే ఉనికే ముప్పులో పడిందిప్పుడు! ఆ ఉనికే మొత్తంగా ముప్పులో పడిందిప్పుడు!!

ఈ ఉనికి వుందే, ఇది లక్షల కోట్ల రూపాయల ఆదాయం కన్నా, ఎంతో ముఖ్యమైంది! లాభసాటి ఉద్యోగ వ్యాపారాలకన్నా, భద్రతా భవితవ్యాలకన్నా ఎంతో ముఖ్యమైంది ఈ ఉనికి!

అవును బాబాయ్, నిజమే!


మనం ఓ సందేశాన్ని వాట్సాప్‌లోనో, ఈ మెయిల్లోనో ఫార్వార్డ్ చేస్తే, దాని మీద వాళ్ళ కన్ను పడుతుందని నాకు తెలుసు బాబాయ్! వాళ్ళు దాన్ని వెంటాడతారనీ, వేధిస్తారనీ నాకు తెల్సు బాబాయ్!! మన సర్కార్ ప్రతి మెసేజ్‌ను చదువుతోందనేది నిజమే బాబాయ్!!

అయితే, ఈ సర్కార్ రాజ్యాంగాన్ని ఎప్పుడైనా చదువుతోందా అన్నది ప్రశ్న!? ఎవరి దాకానో ఎందుకు? – బాబాయ్, మీరైనా మన రాజ్యాంగాన్ని చదువుతున్నారా??

మనకే ఈ రాజ్యాంగం మన సొంతం కాదన్న స్పృహ లేదు! మనకే ఈ దేశం మన సొంతం కాదన్న స్పృహ లేదు! మన ఇష్టం వచ్చినట్టు దుబారా చేసేసి తగలెయ్యడానికి, ఇదేం మన సొంత ఆస్తి కాదు బాబాయ్ !

ఈ దేశాన్నీ, ఈ రాజ్యాంగాన్నీ **(మిగతా 33వ పేజీలో)**

# దేశానికి రానున్నవి చీకటి రోజులు



- జస్టిస్ మార్కండేయ కట్జూ

తెలుగు అనువాదం: ఎన్.వేణుగోపాల్

**హిట్లర్ అధికారానికి వచ్చిన తర్వాత నాజీ జర్మనీకి, బీజేపీ భారత్‌కు పోలికలు చూపుతూ సరిగ్గా జర్మనీలో జరిగినట్టుగానే, అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని అంటున్నారు జస్టిస్ మార్కండేయ కట్జూ, భారతదేశంలో జరుగుతున్న సంగతులు నాకు నాజీల కాలంలో జర్మనీలో జరిగిన సంగతులను, గుర్తుకు తెస్తున్నాయి.**

1933 జనవరిలో – జర్మనీ యావత్తు ఉన్మాదంలో పడిపోయింది. ఎక్కడ చూస్తే అక్కడ జనం 'హెయిల్ హిట్లర్' అనీ 'సీగ్ హెయిల్' అనీ 'యుడెన్ వెరెక్కె' అనీ అరవడం, మత్తెక్కిన మర బొమ్మల్లాగ ఆ పిచ్చివాణ్ణి ప్రశంసించడం చేశారు. మీకు కావాలంటే ఆ దృశ్యాలన్నీ యూట్యూబ్ మీద చూడవచ్చు. జర్మన్లు ఎంత ఉన్నతమైన సంస్కృతీ పరులంటే వారు మాక్స్ ప్లాంక్, ఐన్‌స్టీన్ వంటి గొప్ప శాస్త్రవేత్తలను, గోథె, పిల్లర్ వంటి మహా రచయితలను, హీనె వంటి మహా కవులను, మొజార్ట్, బాక్, బీథోవెన్ వంటి మహా సంగీత విద్వాంసులను, మార్టిన్ లూథర్ వంటి గొప్ప సంస్కర్తలను, కాంట్, నీషే, హెగెల్, మార్క్స్ వంటి గొప్ప తత్వవేత్తలను, లీబ్నిట్జ్, గాస్, రీమన్ వంటి గొప్ప గణిత శాస్త్రజ్ఞులను, ఫ్రెడరిక్ ది గ్రేట్, బిస్మార్క్ వంటి గొప్ప రాజనీతిజ్ఞులను కన్న నేల అది. నేను కలిసిన ప్రతి ఒక్క జర్మన్ కూడ ఎంతో ఉత్తములు. అయినప్పటికీ, రంగస్థలం మీదికి హిట్లర్ వచ్చాక, జర్మనీ ఉత్తమ పాలక జాతి అని, వారి సమస్యలన్నిటికీ బాధ్యులు యూదులే అని ప్రకటించాక, జర్మన్లు ఆ పిచ్చి ప్రేలాపనలను నమ్మడం మొదలుపెట్టారు. యూదుల మీద జరిగిన అత్యాచారాలకు, చివరికి జరిగిన మహామారణ కాండకు వారు ఎదురు చెప్పలేదు. బహుశా దాన్ని సమర్థించి ఉంటారు. అలా ఎలా జరిగింది? కచ్చితంగా జర్మన్ ప్రజలందరూ మూర్ఖులు ఏమీ కాదు. అంతరాంతరాళల్లో దుర్మార్గులేమీ కాదు. అన్ని దేశాల, అన్ని మతాల, అన్ని నరజాతుల, వగైరా అన్ని సమూహాల ప్రజల్లో 99 శాతం మంచివాళ్లేనని నా ప్రగాఢ నమ్మకం. మరి 60 లక్షల మంది యూదులను గ్యాస్ చాంబర్లలోకి పంపి మూకుమ్మడిగా హత్య చేయడానికి జర్మన్లకు చేతులెలా వచ్చాయి? నా ఉద్దేశంలో దానికి కారణమేమంటే, మహా శక్తిమంతమైన ఆధునిక ప్రచారసరళి అత్యంత సంస్కృతీపరుల, ఆలోచనాపరుల మెదళ్లలో కూడ విషం నింపగలదు. ఎక్కువ మంది జర్మన్ల విషయంలో జరిగిందదే.

మొదటి ప్రపంచయుద్ధంలో ఓటమి తర్వాత జర్మన్లలో నిండిన నిరాశా నిస్పృహలు, 1929–మహాసంక్షోభం తర్వాత పెద్దఎత్తున వ్యాపించిన నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభం హిట్లర్ వంటి దుర్మార్గుడి విషప్రచారానికి సులభంగా దొరికిన ఆయుధాలు. ఆ విషప్రచారాన్ని జర్మన్లు మొత్తానికి, మొత్తంగా అక్షరం వదలకుండా మింగి తమ మెదళ్లలో నింపుకున్నారు. ఇవాళ అత్యధిక భారతీయుల విషయంలో అదే జరుగుతున్నది. అభివృద్ధి నిరోధక, హిందూ నయాఫాసిస్టు పార్టీ భారతీయ జనతా పార్టీ 2014లో అధికారానికి వచ్చినప్పటి నుంచి భారతీయ మైనారిటీలకు (ప్రత్యేకంగా ముస్లింలకు) వ్యతిరేకంగా భారీ మతోన్మాద ప్రచారానికి తెరలేపింది. ఆవులను చంపుతున్నారనీ, హిందూ బాలికలకు వల వేస్తున్నారనీ, వగైరా విద్వేషం నిండిన ఉపన్యాసాలతో చాలా మంది హిందువుల మనసులను విషపూరితం చేశారు. రామాలయం నిర్మించాలనే ప్రకటనలూ, ముస్లింలను కొట్టి చంపడం కొద్ది సంవత్సరాలలో సర్వసాధారణమైపోయాయి. పాకిస్తాన్లోని బాలాకోటి మీద వైమానిక దాడి, సానుకూలమైన భారత ప్రచార సాధనాల ద్వారా యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడం కూడా ఈ దండయాత్రలో భాగమే. ఈ ప్రయత్నమంతా ఇటీవలి పార్లమెంటరీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీకి కనీవినీ ఎరగని ఘన విజయం చేకూర్చడం ద్వారా అనుకున్న ఫలితాల ను సాధించింది. భారతదేశంలోని ఏ ఒక్క నిజమైన సమస్యనూ పరిష్కరించ లేని గారడీ చర్యగా అధికరణం 370 రద్దు, దుష్ట పాకిస్తాన్‌పై సాధించిన మహా విజయంగా, ఉత్సవ సందర్భంగా చాలా మంది హిందువులను మరింత ఉన్మాదులుగా మార్చింది. అమెరికాలోని హ్యూస్టన్లో హౌడీ మోదీ ప్రదర్శన దీనికి ఒక సాక్ష్యం.

కనీ వినీ ఎరగని స్థాయిలో నిరుద్యోగం (స్వయంగా భారత ప్రభుత్వ సంస్థ నేషనల్ శాంపిల్ సర్వే వెల్లడించింది), దారుణమైన శిశు పోషకాహార లోపం (దేశంలోని ప్రతి ఇద్దరు పిల్లల్లో ఒకరు పోషకాహార లోపం) పెద్ద సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు (మూడు లక్షలకు పైగా), అందని సరైన ఆరోగ్య సౌకర్యాలు, నాణ్యమైన విద్య, ధనికులకూ, పేదలకూ మధ్య పెరుగుతున్న అంతరం (దేశంలోని 135 కోట్ల జనాభాలో సగం మంది దగ్గర

ఉన్న సంపదకన్నా ఎక్కువ సంపద ఏడుగురు భారతీయుల దగ్గరే ఉంది) వంటి భారత దేశంలోని నిజమైన సమస్యలలో ఏ ఒక్కటీ ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో చర్చకే రాలేదు. లౌకిక వాదమనేది ఉత్తర అమెరికా, యూరప్‌ల వంటి పారిశ్రామిక సమాజాల లక్షణం. అది ఆసియా దేశాలలో అత్యధికంగా ఉన్న భూస్వామ్య, అర్ధ భూస్వామ్య సమాజాల లక్షణం కాదు. రాజ్యాంగంలో ఆ మాట ప్రస్తావించినంత మాత్రాన దేశం లౌకిక దేశం అయిపోదు. భారతదేశం ఇంకా అర్ధ భూస్వామ్యమేననేది ఈ సమాజంలో విస్తృతంగా ఉన్న కులతత్వం, మతతత్వం రుజువు చేస్తున్నాయి. భారతీయులలో అత్యధికులు లోలోతుల నుంచి మత విశ్వాసాలు కలవాళ్లు, భారతీయులలో దాదాపు 80 శాతం హిందువులు గనుక వారు అతి సులభంగా మతోన్మాద ప్రచారానికి గురికాగలరు. భారతదేశంలో హిందువులు, ముస్లింలలోనూ అత్యధికులు. మతతత్వానికి గురైనవాళ్లే. నా చిన్నతనంలో నా హిందూ బంధువులూ, మిత్రులూ చాలామంది ముస్లింల మీద విషం కక్కుతుండడం నేనుచూశాను. కాకపోతే వాళ్లు ఇలా మాట్లాడుతున్నప్పుడు పక్కన ముస్లిం లేకుండా చూసి జాగ్రత్త తీసుకునేవారు. ఇవాళ ఒక ముస్లింను కొట్టి చంపేశారంటే. చాలామంది హిందువులకు అది పట్టడమే లేదు. బహుశా కొందరు సంతోషిస్తున్నారేమో కూడా. ఒక తీవ్రవాది తగ్గాడని అనుకుంటున్నారేమో! మైనారిటీలపై ప్రత్యేకించి ముస్లింలపై విద్వేషం రూపంలో మతోన్మాదం. చాలా మంది హిందువులలో పైకి కనబడకుండా ఎప్పుడూ ఉంటూనే ఉంది. ఎక్కడో ఒకచోట నిప్పు రవ్వపడితే పేలిపోయే మందుపాతర లాగ అది వేచి చూస్తూ ఉండింది. 2014 నుంచి 2019 వరకూ ఆ మతోన్మాద మంటలను భారతీయ జనతా పార్టీ ఎగసన దోస్తూ వచ్చింది. ఈ పార్టీ మీద ఆధిపత్యం వహిస్తున్నది. భయంకరమైన ముస్లిం వ్యతిరేక, క్రైస్తవ వ్యతిరేక మతోన్మాద సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ “ఇప్పుడిక భారతీయ జనతా పార్టీ, దాని నాయకుడు మోడీ అసాధారణ విజయం సాధించారు గనుక, ప్రజలవైపు నుంచి తమ సమస్య లు పరిష్కరించే పాలన ఇమ్మని ఒత్తిడి పెరుగుతుంది. అంటే ఉద్యోగాలు కల్పించమనీ, రైతులు నిస్సహాయ స్థితిని మెరుగు పరచమనీ, శిశు పౌష్టికాహార లోపాన్ని తగ్గించమనీ, మంచి ఆరోగ్యసేవలు అందించమనీ, నాణ్యమైన విద్య అందించమనీ, వగైరా ఆకాంక్షలు పెరుగుతాయి. కాని ఈ పాలకులకు ఆ పరిష్కారాలు ఎలా సాధించాలో తెలియదు. అంతేకాదు, పరిష్కరించకపోవడం మాత్రమే కాదు, దేశంలో ప్రస్తుతం ఆర్థిక స్థితి మరింతగా దిగజారింది. జాతీయాదాయ పెరుగుదల రేటు ఒక్కసారిగా ఐదు శాతానికి పడిపోయింది.

వాహనాల తయారీ రంగం సహా పారిశ్రామిక ఉత్పత్తులలో, రియల్ ఎస్టేట్, విద్యుచ్ఛక్తి ఇటువంటి మరెన్నో రంగాలలో పతనం కనబడుతున్నది. మున్నెన్నడూ లేనంత నిరుద్యోగం తలెత్తడం మాత్రమే కాదు, అది ఇంకా పెరుగుతున్నది. సరిగ్గా హిట్లర్ యూదులు అనే బలి పశువును కనిపెట్టినట్టుగా భారతదేశంలో అటువంటి బలిపశువు ముస్లింలు. ముస్లింల మీద అత్యాచారాలు ఇంకా పెరుగుతాయనీ, తక్కువగా క్రైస్తవుల మీద కూడ పెరుగుతాయనీ నాకు భయం కలుగుతున్నది. సరిగ్గా నాజీ పాలనాకాలంలో జర్మనీలో విజ్ఞానశాస్త్రాన్ని ఎట్లా జాత్యాహంకార పూరితమైన అర్థరహిత ప్రేలాపనగా మార్చారో, భారతదేశంలో కూడా 2014 తర్వాత విజ్ఞానశాస్త్రాన్ని అట్లాగే మార్చారు. నాజీ జర్మనీ లో చరిత్రను ఎట్లా వక్రీకరించారో, 2014 తర్వాత భారత దేశంలో కూడా అట్లాగే వక్రీకరిస్తున్నారు. సరిగ్గా జర్మన్ ప్రచార సాధనాల మీద గోబెల్స్ ఆధిపత్యం చలాయించినట్టుగానే, భారత ప్రచారసాధనాలు కూడా వంగిపోయి, లొంగిపోయి, సర్వం సహా చక్రవర్తి'కి ప్రణామాలు పటుకుతున్నాయి. దేశానికిక రానున్నవి చీకటి రోజులే. ❑

## చెవులు పగిలే మౌనం మధ్య నుంచి

(31వ పేజీ తరువాయి)

తర్వాతి తరాల వారికి అందచెయ్యడానికి ఉద్దేశించిన ధర్మకర్తలం మాత్రమే మనం!! మనం నోరువిప్పకుండా వుండిపోయి, ఏ కుటుంబాన్ని కాపాడు కుంటున్నామని అనుకుంటున్నామో అదే కుటుంబ సభ్యులు రేపు నడి రోడ్డుమీద మిమ్మల్ని నిలదీయ కపోరు బాబాయ్! “మా వారసత్వ సంపదనలా దుబారా చేసి తగలబెడుతుంటే మీరేం చేస్తున్నారయ్యా మహానుభావా?” అని వాళ్ళు మిమ్మల్ని నిలేస్తారు. చరిత్రకు మనం జవాబుదారులంగా ఉండక తప్పదు బాబాయ్! అది మిమ్మల్నీ నిలదీస్తుంది - నన్నూ నిలదీస్తుంది- అందర్నీ నిలదీస్తుంది!! చరిత్ర అలా నిలదీసినప్పుడు దానికి రేపు దక్కే జవాబిదే.“పెద్దరికం కిరీటాలు నెత్తిన పెట్టుకున్నవాళ్ళు, మంచి ఉద్యోగాలూ, సద్యోగాలూ, వ్యాపారాలూ, ఆదాయాల మూటలు నెత్తికెత్తుకున్న వాళ్ళు - పోవడానికంటూ ఏదో ఒకటి వున్న వాళ్ళందరూ మన వారసత్వ సంపద తగలడుతున్నప్పుడు కిక్కురుమనకుండా మౌనముద్రలో మునిగిపోయారు!

**కుర్రకారు మాత్రమే తల ఎత్తుకు నిలబడింది! పోవడానికి ఏమీ లేనిదీ, సర్వం కోల్పోయే ప్రమాదం వున్నదీ కూడా అయిన కుర్ర కారు మాత్రమే అణచివేతకు ఎదురు నిలబడింది! శిథిల శైతల్యం కమ్ముకున్న ఆ అమావాస్య చీకట్లో రాజ్యాంగాన్ని రక్షించేందుకు కుర్ర కారు మాత్రమే తల ఎత్తుకు నిలబడింది! మనకి ఈ మాత్రమైనా భద్రత ఏర్పడడానికి ఆ కుర్రకారే కారణం ! తర్వాతి తరాల వాళ్ళకి ఓ దేశాన్ని భద్రంగా అందచేసే అవకాశాన్నిచ్చింది ఆ కుర్రకారే!! యువతరం శిరమెత్తి నిలబడింది, గొంతెత్తి నిలిచింది, పిడికిలెత్తి పోరాడింది! బాబాయ్! ఆ స్ఫూర్తి రూపంలో మీరు మాలో, మాతో వున్నారు!!” ❑**

# ఆధునిక తెలుగు సాహిత్యంలో 'అస్తిత్వ స్పృహ' - ఓ పిట్టచూపు

- మందలపర్తి కిషోర్



**అస్తిత్వం అంటే ఏమిటి? : నిర్దిష్ట సామాజిక నేపథ్యం - జాతి, జాతీయత, భాష, మాండలికం, ప్రాంతం, మతం, కులం, లింగభేదం, లైంగిక ప్రాధాన్యం, సామాజిక శ్రేణి(ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ), వృద్ధాప్యం లాంటి వయోశ్రేణిలాంటివి - ప్రాతిపదికగా రూపు దిద్దుకునే గుర్తింపునే అస్తిత్వ స్పృహగా వ్యవహరిస్తున్నారు. అన్ని సామాజిక జీవన రంగాల్లోనూ - ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో- ఈ అస్తిత్వ స్పృహ ప్రతిఫలిస్తుందని అంటారు. సాహిత్యంలో ఈ అస్తిత్వాలన్నీ ప్రతిఫలించడం ఇటీవల ఎక్కువైంది. మొదట్లో విమర్శరంగంలో తరచు ప్రస్తావనకు వచ్చిన అస్తిత్వ స్పృహ క్రమంగా కాల్పనిక రచనల్లో ఎక్కువవుతూ వచ్చింది.**

"అసలు ఆధునిక తెలుగు సాహిత్యం మొదలైందే అస్తిత్వ స్పృహతో అనిపిస్తుంది. 'హితసూచని' అనే చరిత్రాత్మక గ్రంథ రచయిత సామినేని ముద్దునరసింహం పేరు, అచ్చయిన పుస్తకం మీద 'ముద్దు నరసింహం నాయుడు'గా కనిపించడం లోనూ తొంగిచూస్తున్నది అస్తిత్వ స్పృహే. వీరేశలింగం-చిలకమర్తి-గురజాడ గిడుగులాంటి వాళ్ళ పేర్లకు 'పంతులు' అనే బిరుదనామం(?) వచ్చి చేరడం వెనక పనిచేసింది కూడా అస్తిత్వ స్పృహే అనిపిస్తుంది. తర్వాతి రోజుల్లో టంగుటూరి ప్రకాశాన్ని అందరూ 'పంతులు గారు' అనడంలోనూ ఉన్నది అస్తిత్వ స్పృహే. వాడుక భాషలో దాన్నే కులం అనడం కద్దు!

- పందొమ్మిదో శతాబ్ది ముగుస్తోందనగా, కాకినాడలో జరిగిన గోదావరీ మండల కాపుల(రైతుల) మహాసభలో చిలకమర్తి చెప్పిన పద్యాలే తొలి 'ఆధునిక' కవితలుగా చెప్తోంది మన సాహిత్య చరిత్ర! అవి కూడా ఓ ఆర్థిక అస్తిత్వ స్పృహతో చెప్పిన పద్యాలే! వాటిని ఇంగ్లిష్‌లోకి అనువదించాల్సిందిగా ఆ సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర భీష్మ న్యాపతి సుబ్బారావు, గురజాడను అభ్యర్థించగా ఆయన ఆ పని చేసిపెట్టారు. కానీ, చరిత్రాత్మకమైన ఆ అనువాదాన్ని పోగొట్టుకోవడం తెలుగువాడి అస్తిత్వ నిస్పృహకు నిదర్శనం!!
- 1910లో గురజాడ రాసిన 'దేశమును ప్రేమించుమన్నా!' పాట కూడా అస్తిత్వ స్పృహతో రాసిన జాతీయ గీతమే. ఆ పాట వెలువడిన పదేళ్ళకు గరిమెళ్ళ - అదే స్ఫూర్తితో - 'మాకొద్దీ తెల్ల దొరతనమూ' పాట రాశారు. ఆ రెండింటికీ మధ్యలో మంగిపూడి వెంకటశర్మ వెలువరించిన చరిత్రాత్మక కావ్యం 'నిరుద్ధ భారతము' అస్తిత్వ స్పృహతో రాసిందే - అస్పృశ్యతకు వ్యతిరేకంగా సందేశమిచ్చిన రచన ఈ ప్రబోధాత్మక కావ్యం. వడ్డాది రామాంజనేయులు, రాయప్రోలు సుబ్బారావు తదితరు లు జాతీయవాద స్పృహతోనే ఎన్నో గీతాలు రచించారు.
- కుసుమ ధర్మన్న తెలుగునాట తొలిసారి దళిత అస్తిత్వ స్పృహ తో "మాకొద్దీ నల్ల దొరతనమూ" అంటూ గొంతెత్తాడు. ధర్మన్నకన్నా పదేళ్ళు వెనకగా రంగం మీదికొచ్చిన జాషువా తెలుగు సాహిత్య చరిత్రలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు. గబ్బిలం, కోకిల, గిజిగాడు, కాందిశీకుడు, శ్మశా నం తదితర ఇతివృత్తాలతో తెలుగు కవిత్వ సీమలో అంత వరకూ ప్రాతినిధ్యానికి నోచుకోని వర్గాలకూ, ప్రాంతాలకూ గొంతిచ్చిన కవి జాషువా. బుద్ధుడు, క్రీస్తు, బాపూజీల గురిం చి జాషువా రాసినంత విస్తారంగా రాసిన కవులు తక్కువ.
- జాషువాకు సమకాలికులైన కవుల్లో చెప్పుకోదగిన వారు పింగళి కాటూరి జంటకవులు. వాళ్ళు రాసిన 'తొలకరి' గ్రామీ ణ జీవితం నేపథ్యంగా, రైతు వారీ జీవన సౌందర్యానికి అక్షర రూపమిచ్చిన కవులు పింగళి కాటూరి. ఈ తరహాలో ఒక్కడుగు ముందుకు వేసిన వారు తుమ్మల సీతారామమూర్తి. 'పఱిగ పంట', 'పైరపంట' లాంటి కావ్యాల్లో రైతు జీవితం లోని కష్ట నష్టాలనే ఇతివృత్తాలుగా తీసుకుని రాశారాయన. ఆయన రచనలు మొత్తం అస్తిత్వ స్పృహతో చేసినవేనంటే అతిశయోక్తి కాదు!
- 1947-1970 మధ్యకాలంలో బోయి భీమన్న, సురగాలి తిమోతీ జ్ఞానానంద కవి, బొజ్జా తారకం దళిత స్పృహతో దశా బ్దాల తరబడి కవిత్వం రాశారు. ఇక జాషువా శత జయంతికి అటూ ఇటూగా మొదలుపెట్టి సతీష్ చందర్ (పంచమ వేదం), ఎండ్లూరి సుధాకర్ (గోసంగి), శిఖామణి (తవ్వకం), మద్దూరి నగేష్బాబు(వెలివాడ), పైడి తెరేష్ బాబు (నిశానీ), తదితరులు ప్రభావశీలమైన దళిత కవిత రాశారు. వీళ్ళందరూ బాగా చదువుకున్న దళితులు. ఆ చదువుల సాయంతో మంచి ఉద్యోగాలు చేశారు. మా బాగా తెలిసొచ్చే సమస్య "సామాజిక న్యాయం!" అదే వాళ్ళను మార్క్స్ వైపు నుంచి అంబేద్కర్ వైపు నడిపించిందనిపిస్తుంది. 'చిక్కనవుతు న్న పాట' సంకలనం చాలామంది దళితవాద కవుల

ఆలోచనల్లో వచ్చిన మార్పుకు ప్రాతినిధ్యం వహించింది.

- దళిత అస్తిత్వ స్పృహకు కవల సహోదరిలాంటిది స్త్రీవాద అస్తిత్వ స్పృహ! ఇవి రెండూ 20వ శతాబ్ది చివరి పాదంలో మొదలయినవే. అబ్బూరి ఛాయాదేవి, వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ, కొండవీటి సత్యవతి, రేవతీదేవి, ఓల్గా లాంటి పాతతరం రచయిత్రులు మొదలుకుని జయప్రభ-విమల-కొండేపూడి నిర్మల-ఘంటసాల నిర్మల - మహెజబీన్ - బి. పద్మావతి-పాటిబండ్ల రజని-కుప్పిలి పద్మ తదితర సమకాలీనులు ఎందరో స్త్రీలమనే అస్తిత్వ స్పృహతో కవిత్వం రాశారు. 'నీలిమేఘాలు' సంకలనం చాలా మంది కొత్త స్త్రీవాద కవయిత్రులను తెలుగు పాఠకుడికి పరిచయం చేసింది. మిగతా ప్రక్రియలన్నింట్లోనూ ఈ అస్తిత్వ స్పృహ ప్రతిఫలించింది!
- దళితవాదం-స్త్రీవాదాలకు మరో సోదరి వుంది! అదే, మైనారిటీ స్పృహ నుంచి పుట్టుకొచ్చిన సాహిత్యం!! ప్రతి సామాజిక శ్రేణికీ ప్రత్యేకమైన సమస్యలూ, అస్తిత్వ స్పృహ ఉండడం సహజం. 11 వందల సంవత్సరాలుగా భారతీయ సామాజిక జీవనంలో పాలుపంచుకుంటున్న ఇస్లామ్కి భారతీయ - ప్రాంతీయ అస్తిత్వ స్పృహలు అనేకం ఏర్పడిన మాట వాస్తవం. కబీర్ లో కనిపించేది అలాంటి విశిష్టమైన ఓ అస్తిత్వ స్పృహ. ఇరవయ్యో శతాబ్ది రాజకీయ పరిణామాలు సరికొత్త సవాళ్ళను జాతి ముందుంచాయి! ఈ పరిణామాల నుంచి పుట్టుకొచ్చిందే మైనారిటీ స్పృహ. ఖాదర్ మొహియుద్దీన్ (పుట్టు మచ్చ) - ఇక్బాల్ చంద్ (ఆరో వర్ణం)- యాకూబ్ (సరిహద్దు రేఖ) వేంపల్లి షరీఫ్ (జుమ్మా- కథలు) ఖదీర్ బాబు (దర్గా మిట్ట కథలు) స్కైబాబా (జలలా- సంపాదకత్వం) షా జహానా (న ఖాబ్) లాంటివాళ్ళు ఈ ధోరణికి ప్రాతినిధ్యం వహిస్తారు.
- అస్తిత్వ స్పృహ కోవకే చెందినది ప్రాంతీయ స్పృహ కూడా. మరీ ముఖ్యంగా తెలుగువాళ్ళు నివసించే విభిన్న ప్రాంతాల్లో వాడకం చేసే మాండలిక భాష - సామాన్యుల వ్యవహారంలో 'యాస' - ఆయా ప్రాంతాల ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్యగా పరిణమించడం నిన్న మొన్నటి పరిణామం కాదు. సినిమాలూ, టీవీలూ, నాటకాల్లో వెకిలి హాస్యానికి ప్రాంతీయ 'యాస'ను ఆకారంగా చేసుకునే ప్రయత్నం వికటించి ఇలా పరిణమించింది. కొన్ని ప్రాంతీయ మాండలికాల్ని కాల్పనిక సాహిత్యంలోనే కాకుండా, పత్రికల మాండలికంలోనూ విస్తృతంగా వినియోగించడం ఇటీవల ఎక్కువయింది. ఇదే విభిన్న కులాల-తెగల-మతాల మాండలి కాలకు సైతం వర్తిస్తుంది. ట్రాన్స్ జెండర్స్‌గా భావించే వ్యక్తుల ప్రవర్తన ఫలానీ విధంగా వుంటుందని ఊహించుకుని చేసే ప్రయోగాల విష ఫలితాలను మనం త్వరలోనే చూస్తామనిపిస్తుంది. తమిళ-మలయాళ సినిమాల్లో సున్నితమైన ఈ లైంగిక అస్తిత్వంపై సీరియస్ సినిమాలు వస్తుండగా తెలుగు సినిమా అంగుష్ఠమాత్రులు మాత్రం వెకిలితనాన్ని మించి అంగుళం కూడా ఎదగడం లేదు! "ఇలా రకరకాల అస్తిత్వ స్పృహలు సాహిత్యంలో ప్రతిఫలిస్తున్నాయి.

## ఫాసిజం రూపురేఖలు ఎలా వుంటాయి?

(26వ పేజీ తరువాయి)

### 11. మేధావులూ, కళల పట్ల తృణీకారం

ఫాసిస్టు ప్రభుత్వాలు ఉన్నత విద్యపట్ల, అధ్యయనాత్మక పరిశోధనాత్మక సంస్థలపట్ల వ్యతిరేకతను బాహాటంగానే ప్రదర్శిస్తారు. ప్రొఫెసర్లూ, పరిశోధకుల రచనలను సెన్సార్ చెయ్యడం, వారిని అరెస్టు చెయ్యడం తరచూ జరుగుతూంటుంది. కళారం గంలో స్వేచ్ఛగా భావవ్యక్తీకరణ చెయ్యడంపై దాడులు జరుగు తుండడం కద్దు. ఈ రంగానికి నిధులివ్వడానికి నిరాకరిస్తుంటారు.

### 12. బండగా నేరము-శిక్ష పద్ధతి అమలు

చట్టపాలన సక్రమంగా జరిపించే పేరుతో ఫాసిస్టు ప్రభుత్వాలు పోలీసులకు హద్దుమాలిన అధికారాలు కట్టబెడుతుంటాయి! పోలీసులు హద్దుమీరి చేసే అత్యాచారాలను ప్రజలు చూసీ చూడనట్లు నిర్లక్ష్యం చేయడంకద్దు. దేశభక్తి పేరిట, తమకున్న కొద్దిపాటి పౌర హక్కులను 'త్యాగం' చెయ్యడానికి జనం తెగబడుతుంటారు. ఫాసిస్టు ప్రభుత్వాలు వున్న దేశాల్లో నియంత్రణ లేని అధికారాలు కలిగిన జాతీయ పోలీస్ బలగం ఒకటి రూపుదిద్దుకోవడం జరుగుతూ ఉంటుంది.

### 13. ఆశ్రిత పక్షపాతం-అవినీతి చెట్టపట్టాలు

ఫాసిస్టు ప్రభుత్వాలను, సాధారణంగా, కొన్ని మిత్రబృందాలు నడిపిస్తూవుంటాయి. ఈ బృందాల్లోని వ్యక్తులే పరస్పరం ప్రభుత్వ పదవులకు తమను తామే నియమించుకుంటూ వుంటారు. జవాబుదారీతనం నుంచి తమ తమ మిత్రబృందాలను కాపాడుకోవడానికి అధికారాన్నీ, పదవులనూ వాడుకుంటారు. ఫాసిస్టు ప్రభుత్వాల అధికారులు జాతి సంపదను తరచూ స్వాహా చెయ్యడం, స్వాయత్తం చేసుకోవడం కొత్తేం కాదు!

### 14. బూటకపు ఎన్నికలు

ఫాసిస్టు ప్రభుత్వాలు అధికారంలో ఉన్న దేశాల్లో ఎన్నికలు కేవలం బూటకంగా జరగడం కొత్తేం కాదు! ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థులపై దుష్ప్రచారం చెయ్యడం, ప్రతిపక్ష నేతలను హత్య చెయ్యడం, ఓటింగును నియంత్రించడానికి శాసనాధికారాన్ని దుర్వినియోగం చెయ్యడం, నియోజకవర్గాల పరిధులను యథేచ్ఛగా మార్చేయడం, సమాచార, ప్రసార సాధనాలను లొంగదీసుకోవడం జరుగుతూ వుంటుంది. ఫాసిస్టు ప్రభుత్వాలు, ఎన్నికల ఫలితాలను నియంత్రిం చే ఉద్దేశంతో, తమ దేశాల్లోని న్యాయవ్యవస్థను దుర్వినియోగం చేస్తాయి. ❑


# చరిత్ర సాహిత్యాల సంగమస్థలిలో ఉపశ్రేణులు



- కొప్పర్తి వెంకటరమణమూర్తి

**పులికొండ సుబ్బాచారి గారు ఈ నవలను చారిత్రక నవల అనడానికి సంశయిస్తున్నారు గానీ ఇది చారిత్రక నవలే. వారిది వినయం వల్ల వచ్చిన సంశయం మాత్రమే. ఇందులో చారిత్రక ఘటనలతోపాటు వాటిపై ఆధారపడి చేసిన కల్పన కూడా కొంత ఉంది అని ఆయనే అన్నారు. ఇకనేం, చారిత్రక నవల లక్షణమే అది. చారిత్రక నవల అంటే నవలంతా చారిత్రక పాత్రలూ చారిత్రక ఘటనలూ ఉండేది కాదు. ఉంటే అది చరిత్ర డాక్యుమెంటు మాత్రమే అవుతుంది. కొంత కల్పన కూడా ఉండాలి. అది చారిత్రక వాస్తవం మీద ఆధారపడి ఉండాలి. అప్పుడు మాత్రమే అది సాహిత్యం అవుతుంది.**

చారిత్రక నవలలోని కల్పనాత్మకమైన ఇతివృత్తమూ, పాత్రలూ, సంఘటనలూ ఆ కాలపు చారిత్రక వాస్తవాలలో ఉండే కార్యకారణ సంబంధం కలిగి ఉండాలి. అప్పుడు మాత్రమే అది చారిత్రక నవల అవుతుంది. చారిత్రక నవల అన్న పదబంధంలో ఉన్న చరిత్ర, నవల అనే రెండు వేర్వేరు పదాల మధ్య బంధాన్ని కలిగించే అంశం ఈ కార్యకారణ సంబంధమే. ఒక చారిత్రక సందర్భాన్ని సాహిత్యం చెయ్యాలనుకునే రచయిత ముందుగా చారిత్రక సందర్భానికి దారితీసిన కారణాన్నీ, పర్యవసానంగా జరిగిన చర్యనీ, ఆ చర్య మళ్లీ కారణంగా మారి మరొక చర్యకు దారితీస్తున్న వైనాన్నీ వీటన్నిటిలోని dynamicsను అర్థం చేసుకోవాలి. కల్పిత పాత్రలకు ఆ గమనశీలతను అన్వయించి చరిత్రను పునఃసృజించాలి. చారిత్రక ఆధారాలను ముందుపెట్టుకుని చరిత్రకారుడు చరిత్రను rewrite చేస్తే సాహిత్యకారుడు దాన్ని కళాత్మకంగా recreate చేస్తాడు. మనం చూడని కాలానికి సందర్భానికి చెందిన నిజ జీవితాల చోదకశక్తులు సృష్టించే సంఘర్షణల్ని సంవేదనల్నీ సౌందర్యాన్నీ కల్పిత పాత్రల్లోకి ప్రవేశపెట్టి చరిత్రను సాహిత్యం చేస్తాడు సాహిత్యాన్ని చరిత్రను చేస్తాడు. చరిత్రను సాహిత్యం చేసినపుడు శాస్త్రం, కళగా మారుతుంది.




సాహిత్యంలోకి చరిత్రను ప్రవేశపెట్టినపుడు కళ, శాస్త్రీయం అవుతుంది. ఇవి రెండూ సమపాళ్లలో కలవగా ఏర్పడే చరిత్రో సాహిత్యమో తెలీని సందిగ్ధ స్థితే చారి త్రక నవల అత్యున్నత స్థితి.

Facts are sacred but subject to interpretation అని అంటూ ఉంటారు. అంటే facts మారవు కానీ అవి వేర్వేరు వ్యాఖ్యానాలకు గురికావొచ్చు అని అర్థం. 'వాస్తవం పవిత్రం' అన్నప్పుడు పవిత్రమైన వాటిని మార్చడానికి వీలుండదు అనే religious bigotry ఉంది. but subject to interpretation అనడం చరిత్రకారునికి మనోధర్మం ఉంటుందని అంగీకరించడం. చరిత్రకారుడు వాస్తవాలను ఎంపిక చేసుకుంటాడని అంటారు. అంటే కొన్నిటిని వదలివేస్తాడని అర్థం కాదు. అవాస్తవాల నుంచి వాస్తవాలను వేరు చేస్తాడని. ఇదంతా చరిత్ర నిర్మాణానికి సంబంధించిన వ్యవహారం. మరి సాహిత్యకారుడి పాత్ర ఏమిటీ అంటే ఈ మొత్తానికి సృజనాత్మక రూపాన్నివ్వడం. వాస్తవ జీవన కాలపు చలనశీలతను ప్రతిఫలించడం. చారిత్రక వ్యక్తులను పాత్రలను చెయ్యడం నుంచి మొదలుపెట్టి ఇతివృత్త కాలపు నిజమైన వ్యక్తుల్లాంటి వారిని పాత్రలుగా సృష్టించడం. సంఘటనల్ని సృష్టించడం. అప్పుడా పాత్రలూ, సంఘటనలూ ఏక కాలంలో ఉండవు ఉంటాయి, జరగవు, జరుగుతాయి. ఇక్కడే ఊహకూ వాస్తవానికి మధ్య సాహిత్యకారుడు సృజించే ఇంద్రజాలం ఉంటుంది. ఏక దిశాత్మకమైన కాలంలో ఒక సంఘటన ఒకసారే జరుగుతుంది. కానీ దాన్ని పునఃసృజించే సాహిత్యకారుడు చదివిన ప్రతీసారి మళ్లీ మళ్లీ జరిగేటట్టు చేస్తాడు. చరిత్రకారుడు చరిత్రను రికార్డ్ చేస్తే, సాహిత్యకారుడు దాన్ని గ్రామఫోన్ రికార్డ్‌గా మార్చి మళ్లీ మళ్లీ play చేసుకొమ్మంటాడు. సాధారణంగా సార్వజనీన పాత్రలకు సాహిత్యంలో విలువ ఎక్కువ. సార్వజనీనమైన వ్యక్తులు సర్వకాలాల్లోనూ ఉంటారు కాబట్టి అటువంటి పాత్రలు చారిత్రక

నవలలోకూడా ఉండొచ్చుకానీ ఆ నవలను నిలబెట్టేదీ దాన్ని చారిత్రక నవలను చేసేదీ ఆ ప్రత్యేక స్థలకాలాల్లో ఉద్భవించిన చారిత్రక పాత్రలే. సార్వజనీనమైన పాత్ర ఏకాలపు సాహిత్యంలోనైనా ఇట్టే ఇమిడిపోతుంది. దానికి మరణం ఉండదు. చారిత్రక పాత్ర అట్లాకాదు. ఆ సందర్భం నుంచి విడదీయగానే కూలిపోతుంది. ఏ ఇతర సందర్భంలోనూ దాన్ని నిలబెట్టలేం. బయట ఎంత త్వరగా కూలిపోతే అంత లోతుగా ఆ పాత్ర తన చారిత్రక సందర్భంలోకి వెళ్లుతుందనీ, తన కాలాన్నీ చరిత్రగా మార్చగలిగిందనీ అర్థం. దేవతలు చిరకాలం జీవిస్తారు. మనుషులే మరణిస్తారు. మానవుడే చరిత్ర నిర్మాత.

1950-55 మధ్య కాలం ఈ నవలాకాలం. అంతకుముందు ఐదేళ్ల కాలం, అంటే 1945-50 మధ్య దానికి పూర్వరంగం అని రచయిత అన్నారు కానీ, గతమంతా నేపథ్యమే. ఆ ఐదేళ్లూ సమీప గతం. రచయిత చిత్రించిన సామాజిక ఆర్థిక వ్యవస్థకు శతాబ్దాల చరిత్ర భూమికగా ఉంది. కథా కాలంలో జరిగిన సామాజిక సంచలనానికి కావలసిన కదలికను ముందున్న ఐదేళ్లలో జరిగిన పోరాటాలు ఉద్యమాలు ఇచ్చాయి. నిజాం రాజ్యంలో తెలంగాణ ప్రాంతానికి చెంది బ్రిటీష్ ఆంధ్ర సరిహద్దుకు దగ్గరగా ఉన్న గ్రామం ఈ నవలా క్షేత్రం. 1945-50 కాలం ఒక చారిత్రక విభాత సంధ్య. పురాతన వ్యవస్థ కూలిపోయి అధునాతన వ్యవస్థ నిర్మితమౌతున్న మధ్య కాలం. ఈ దశలోనే శతాబ్దాల ఫ్యూడల్ వ్యవస్థ అవశేషం మీద సాయుధ పోరాటం జరిగింది. రజాకార్ వంటి విధ్వంసకర శక్తులు విజృంభించగా అణచివేయబడ్డాయి. వేర్పాటు ధోరణిని జాతీయభావం విలీనం చేసుకుంది. రాచరికాన్ని అంతమొందించి ప్రజాస్వామ్యం పాలనావ్యవస్థగా అవతరించింది. ఇక, 1950-55 మధ్యకాలం అంటే ఈ తెలిరేకల ఉషోదయ వేళ. మర్లపాడు అనే సిద్ధినేని గూడెంలో చేతివృత్తి కులాలు తమ మీద సాగిన చిరకాలపు శ్రమ దోపిడికి, సాంస్కృతిక అణచివేతకు వ్యతి రేకంగా పనిముట్లు వదిలేశారు. ఒక్కటై నిలుచున్నారు. ఆత్మ గౌరవం కోసం జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ఆకలిని పేదరికాన్ని తట్టుకున్నారు. ఒకరు పడిపోకుండా మరొకరు పట్టుకోవడం మొదలుపెట్టి అందరూ పడిపోయే పరిస్థితి ఏర్పడినా ఒకరినొకరు పట్టుకుని చివరికి ఎవరూ పడిపోకుండా అందరూ నిలబడడం నవలా సారం.

ఈ సాత్విక తిరుగుబాటు రజకులతో మొదలైంది. ఉతకడానికి వేసిన చొక్కాకు బొటనవేలు మును భాగమంత చిరుగు పడింది. కొర్రు పట్టిందేమో తెలియదని, కావాలంటే చొక్కా ఖరీదుని మేర గింజల్లో మినహాయించుకోమ్మని చెప్పినా వినక చాకలి బొర్రమ్మ ను మోతుబరీ, గొర్రెల కాపరీ అయిన కనకరాజు కొడుకు పోలురాజు దుర్భాషలాడడంతో తగవు మొదలైంది. ఇదేమని అడగడానికి వెళ్లిన బొర్రమ్మ భర్త చెన్నయ్య మీద కనకరాజు దాడి చెయ్యగా ఊరి చాకళ్లంతా ఆ ఇంటిని వెలివేశారు (మురగేశారు). తగవు తీర్చడానికి పిలిచిన ఊరి పెద్దలు జులుం ప్రదర్శించి వారిని లొంగదీయడానికి ప్రయత్నించడంతో ఊరి రజకులంతా కలిసి ఊరంతటినీ మురగేశారు. మురికి గుడ్డలూ ముట్టు గుడ్డలూ ఉతకడమంటే ఏమిటో తెలిసొచ్చింది. చావు కబురు చెప్పడానికి చాకలి లేడు. పెళ్లిళ్లకు పేరంటానికి రజకులు లేక అవి 'చలప'చెయ్యలేదు. ఒక మహా సామాజిక సమరం మొదలైంది. ఈ ఆత్మగౌరవ పోరాటానికి ఆకలి పోరాటం తోడయ్యింది. మంగలి, వడ్రంగి, సాలె, కమ్మరి, కుమ్మరి, మాదిగ వంటి వృత్తి కులాల వారికి ఏటా రైతులు ధాన్యరూపంలో కొలిచి ఇచ్చే మేరల్ని పెంచమని ఎన్నాళ్లుగానో చేస్తున్న అభ్యర్థన నిరాదరణకు గురి కాగా వారంతా సమ్మెకు దిగారు. అడుగడుగునా గ్రామ జీవనం స్థంభించింది. వడ్రంగులు పెళ్లిపీటలు చెయ్యలేదు, భాషికాలు కట్టలేదు. కంసాలి తాళిబొట్టు చెయ్యలేదు. మంగళ్లు మంగళ వాద్యాలు వాయించలేదు. విరిగిన నాగలి బాగు చేసేవాడు లేడు. నాగలి కర్రును మొనదేల్చేవాడు లేవడు. క్షవరం లేక మనుషులు మాసిపోయారు. చివరికి దొడ్లో గేదె చనిపోతే లాక్కుపోయే నాథుడు, మాదిగ లేడు. వ్యవసాయంతోపాటు సమస్త సామాజిక జీవన పార్శ్వాలు స్థంభించిపోయాయి. గ్రామమే యుద్ధభూమి. సామాజిక అవసరాలే ఆయుధాలు. సాధారణంగా పోరాటాల్లో పనిముట్లు ఆయుధాలౌతాయి. పనిముట్లు క్రింద పడెయ్యడమే ఇక్కడ యుద్ధం. ఇరుపక్షాలకు కనిపించని గాయాలయ్యాయి. చెన్నుడి హత్య మినహా రక్తపు చుక్క ఒలకకుండా ఒక glorious revolution జరిగింది. సత్యం గెలిచి, మేరలు పెరిగాయి. ఆత్మ గౌరవం నిలబడింది. ఇదీ కథ. నవలలో చేతివృత్తి కులాల పాత్రల తర్వాతి తరాలు చదువుకుని ఉన్నతస్థానాలు చేరుకుని సామాజిక గౌరవాన్ని పొందుతున్న వర్తమానంలో కథ మొదలై గతంలోకి ప్రయాణించి మళ్లీ వర్తమానంలోకి తేరుకుని, చరిత్ర అంటే గతానికి వర్తమానానికి జరిగే అంతులేని సంభాషణ అన్న ఇ.హెచ్.కార్ మాటల్ని రుజువు చేస్తూ ముగుస్తుంది. ఈ సంభాషణలో రెండు పొరలున్నాయి. చారిత్రక ఘటన జరుగుతున్న virtual time లో గతంతో చేసే సంభాషణ మొదటిది. అది చరిత్రకారుడు చేసేది. ఆ సంభాషణా సారాన్ని సాహిత్యం చేసే క్రమంలో దాన్ని మన వర్తమానంతో చేయించే సంభాషణ రెండవది. ఈ నవల చెయ్యాల్సినదీ, చేస్తున్నదీ అదే.

ఈ నవల కట్టుకథ కాదు. తెలంగాణా గ్రామాలలో అనేక చోట్ల జరిగిన యదార్థ ఘటనల సమాహారం. ఆంధ్ర మహాసభ, స్టేట్ కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ వంటి సంస్థలు కలిగించిన చైతన్య ఫలితం. ఈ సంఘటనలన్నీ ఒకేచోట జరిగినవి

కాకపోవచ్చు. జరిగినట్లు చెప్పడం రచయిత ఆశావహం. బహుశా భవిష్యత్ నిర్దేశం. అంతేకాదు, ఈ నవల సిసలైన మన సామాజిక నవల. కులం, వర్గం తమ అస్తిత్వాలను నిలుపుకుంటూనే ఏకమైన సందర్భాన్ని చూపించిన నవల. అంబేద్కర్ మార్క్స్‌ల ప్రస్తావన లేకుండానే వారిద్దరినీ కలిపేసిన సందర్భం. సిద్ధాంతాన్ని సృష్టిస్తే దాన్ని అనుసరించి జీవితమూ సమాజమూ నడవవు. జీవితమూ సమాజమూ నడిచే నడకలో నుంచే సిద్ధాంతం పుడుతుంది అన్న కొడవటిగంటి కుటుంబరావు మాటల్ని చారిత్రక ఘటనల ఆధారంగా రాసిన ఈ నవల నిజం చేస్తున్నది. ఆత్మగౌరవ, ఆర్థిక సమానత్వ పోరాటాలు కలిసికట్టుగా సాగాల్సిందేనని చరిత్ర సాక్షిగా చెబుతున్నది.

ఈ నవలను చదువుతున్నపుడు ఇటాలియన్ మార్క్సిస్ట్ మేథావి ఆంటోనియో గ్రాంసీ, ప్రపంచ ప్రసిద్ధి చెందిన భారతీయ చరిత్రకారుడు రంజిత్ గుహ గుర్తుకురాక మానరు. ఆధిపత్య వర్గాలతో పోరాటానికి కార్మికవర్గం కలుపుకోవలసిన ఇతర వర్గాలను subalternsగా, అంటే ఉపశ్రేణులుగా మొదటిసారి ప్రస్తావించాడు గ్రాంసీ. రైతులు, చేతివృత్తుల వారు, గిరిజనులు, మహిళలే ఈ ఉపశ్రేణులు. దీన్ని అందిపుచ్చుకున్న రంజిత్ గుహ వలస భారతదేశ చరిత్ర రచనలో విస్మరణకు గురైన ఈ వర్గాల మీద వెలుతురును ప్రసరింప చేశాడు. భారత స్వాతంత్ర్య పోరాటం కేవలం శిష్ట వర్గాలు (elite groups) చేసింది మాత్రమే కాదనీ, ఆ వర్గాల ప్రమేయం లేకుండానే ఉపశ్రేణులు తమంత తాముగా నిర్వహించిన పాత్ర సరిగా ఉటంకించబడడం గానీ, వ్యాఖ్యానించబడడం గానీ జరగలేదనీ అన్నాడు. ఈ వ్యాఖ్య చేస్తూ ఆయన రాసిన వ్యాసం ప్రపంచ చరిత్రలో Subaltern perspectiveఅనే నూతన దృక్కోణానికి తలుపులు తెరిచింది. స్వాతంత్ర్యానంతర చరిత్రకు లేదా నిజాం పాలనానంతర తెలంగాణ తక్షణ చరిత్రకు సంబంధించి ఉపశ్రేణుల చైతన్యాన్ని ఈ నవల శక్తివంతంగా వ్యక్తీకరించిందనడంలో సందేహం లేదు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో కింది కులాలు కూడా తమకంటే క్రింది కులాల పట్ల అభిజాత్యం ప్రదర్శిస్తాయని పోలురాజు బొర్రమ్మను తూలనాడడంలో రచయిత గుర్తించారు. ఉపశ్రేణులు తమకు మార్గదర్శనం చేయడంతోపాటు నాయకత్వం వహించే వర్గాన్ని తమ నుంచే రూపొందించుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తూ వారిని organic intellectuals అన్నాడు గ్రాంసీ. ఈ సవర్గ మేథావులకు అద్భుత ఉదాహరణ ఇందులో రజకులకు సారథ్యం వహించిన పానయ్య. గ్రాంసీని చదవకుండానే ప్రపంచంలో చాలాచోట్ల ఆయన భావజాలం ఆచరణలోకి రావడాన్ని సద్యోజనిత గ్రాంసీజం (instinctive gramscism) అన్నారు. ఇదీ అటువంటిదే. రంజిత్ గుహ ఉపశ్రేణుల మీద రాసిన వాటిల్లో తెలంగాణ సాయుధపోరాటంలో మహిళలు నిర్వహించిన పాత్ర మీద రాసిన వ్యాసం కూడా ఒకటని చెప్పడం ఇక్కడ అప్రస్తుతం కాకపోవచ్చు.

ముందే చెప్పినట్టు ఇది కేవలం చరిత్ర కాదు, సాహిత్యం కూడా. చరిత్ర అస్థిపంజర(structure)మైతే, సాహిత్యం రక్తమాంసాలు. ఏకాలంలోనైనా కనిపించే పాత్రలు ఎన్ని ఎక్కువ వుంటే అది అంత తక్కువస్థాయి చరిత్ర నవల అవుతుంది. ఆ దోషం ఈ నవలకు పట్టలేదు. నవలలోని ప్రధాన పాత్రలన్నీ చారిత్రక భూమిక కలిగిన పాత్రలే. నవల రచనలో గ్రామీణ జీవనంలో వివిధ వృత్తుల వారు ఒకరి మీద మరొకరు అనివార్యంగా ఆధారపడడం గురించి మొదలుపెట్టి వారి మధ్య ఉండే సాంస్కృతిక సారూప్యతనూ, వైవిధ్యాన్నీ ప్రతిష్టించడంలో రచయిత ఎంతో ప్రతిభను చూపారు. ఏదో ఒక వృత్తి మూలాలు రచయితలో లేనట్లయితే రచనకు ఈ ప్రాణశక్తి వచ్చేది కాదు. రజకులలో కలిగిన చైతన్యాన్ని ఇతరవృత్తుల వారికి వ్యాపింప చెయ్యడంలో భాగంగా ఎప్పుడూ రజక వీథికి మాత్రమే పరిమితమై ప్రదర్శించే వీరభద్ర, మడేలు పురాణాల్ని ఊరు మధ్య జెండా అరుగు మీద పటం వారు (రజకుల ఆశ్రిత కులం) ప్రదర్శించేటట్టుగా కథని నడిపించి ఇతరవృత్తుల వారందరికి సహానుభూతి కలిగించడంలో రచయిత గొప్ప రచనా కౌశలం ప్రదర్శించారు. అట్లాగే కంసాలి, మంగలి, మాదిగ వృత్తులనూ వారి సాంస్కృతిక జీవనాన్ని సజీవంగా ప్రతిఫలింపచేశారు.

అయితే చేతి వృత్తుల పట్ల రచయితకున్న గాఢమైన అనురక్తి వల్ల వారు విజయం సాధించవలసిన అవసరాన్ని అంతే గాఢంగా నమ్మడం వల్ల కథలోనూ, కథలోని పాత్రల చైతన్యంలోనూ రచయిత కొంత జోక్యం చేసుకున్నారనిపిస్తుంది. మనుషులు మంచి చెడుల మిశ్రమంగా ఉంటారనీ, పరిస్థితులు మంచినీ లేదా చెడునీ ప్రజ్వలింప చేస్తాయనీ కాక, కేవలం కొన్ని మంచి పాత్రల్నీ కొన్ని చెడు పాత్రల్నీ సృష్టించినట్టు అనిపిస్తుంది. కొన్ని సందర్భాలలో పాత్రలు రచయిత చెప్పినట్టు మాట్లాడాయని తెలిసిపోతుంది. ఒకేలా ఉండే అచ్చు పాత్రలకు మినహాయింపైన పటేలు పాత్ర కూడా ముందు చెడుగా ఉండి తర్వాత మంచిగా మారుతుంది. ఇది రచనల్లో సాధారణంగా కనిపించేదే. కానీ ఉదాత్తంగా, మంచిగా కనిపించే మనుషులు కూడా ప్రతికూల పరిస్థితులు ఎదురైనపుడు ఎంతో కొంత స్వార్థంతో ప్రవర్తిస్తారు. దాన్ని కూడా ప్రతిఫలించిన రచన సజీవంగా మిలమిల లాడుతుంది. ఆ ప్రయత్నం ఈ నవలలో కొంత జరిగింది, మరింత జరగాలనిపిస్తోంది. ఇది గొప్ప ప్రయత్నం. రచయిత సుబ్బాచారి గారికి నా ఆలింగన. ❑

**(మన తెలంగాణ సౌజన్యంతో..)**

# కారల్ మార్క్స్ పెట్టుబడి గ్రంథం
## పుట్టుక, నిర్మాణం



- మార్సెల్లో మస్తో

### పుస్తకంలో ఒక భాగం.. వాల్యూమ్ 1 పూర్తి చేయడం

1866 ప్రారంభంలో క్యాపిటల్, వాల్యూమ్ 1కి మార్క్స్ కొత్త ముసాయిదా రాయడం ప్రారంభించాడు. జనవరి మధ్యలో విల్ హెల్మ్ లీబ్కెంట్ (1826–1900)కు తన పరిస్థితిని వివరిం చాడు. 'అనారోగ్యం, అనేక రకాల ఇబ్బందులతోపాటు ఇంటర్నేషనల్ పనుల కారణంగా నాకు నిమిషం తీరిక లేకపోయింది. రాత ప్రతిని మేలు ప్రతిగా రాయడానికి సమయం చిక్కడం లేదు. 'ఏది ఏమైనప్పటికీ తాను రాయడం దాదాపు పూర్తి కావచ్చిందని, మార్చిలో పబ్లిషర్‌కు వాల్యూమ్ 1 అందజేస్తానని, రెండు వాల్యూములు ఒకేసారి అచ్చవుతాయని ఆయన వెల్లడించాడు. కుగుల్‌మన్‌కు రాసిన మరొక లేఖలో 'తాను రోజుకు 12 గంటలు పనిచేస్తూ రాతప్రతి తిరిగి రాస్తున్నానని' ఆయన వెల్లడించాడు. రెండు మాసాలలో హాంబర్గ్‌లోని పబ్లిషర్‌కు రాత ప్రతి అందజేస్తానని ఆయన తెలిపాడు. తర్వాత కొద్ది రోజులకు మార్క్స్ తీవ్రమైన అస్వస్థతకు గురయ్యాడు. ఆయనకు ప్రాణాపాయ స్థితి ఏర్పడింది. మళ్లీ కోలుకొని రాత మొదలు పెట్టడానికి వీలు కుదిరిన తరువాత ఆయన ఎంగెల్స్‌కు ఈ విధంగా తెలియజేశాడు :

ఈసారి నిజంగా తీవ్రమైన ప్రమాదం ఎదురైంది. నాకు వచ్చిన వ్యాధి ఎంత తీవ్రమైనదో నా కుటుంబ సభ్యులకు తెలియదు. ఇదే విధంగా మూడు లేదా నాలుగుసార్లు వస్తే మరణించడం ఖాయం. కొన్ని రోజులు విశ్రాంతిగా గడిచిపోయినప్పటికీ ఇంకా నేను బలహీనంగానే ఉన్నాను. కానీ మన సుకు బలహీనత లేదు. కాళ్లు, నడుము చాలా బలహీనంగా ఉన్నాయి. వ్యాధి తిరగబెట్టడానికి అధికంగా శ్రమ చేయడం, రాత్రుళ్ళు పనిచేయడం కారణం అని డాక్టర్లు సరిగ్గానే గుర్తించారు. నేను ఎటువంటి పరిస్థితులలో అతిగా ఎందుకు పని చేస్తున్నాననేది, ఈ డాక్టర్లకు చెప్పలేను. చెప్పినా ప్రయోజనం ఉండదు. ఈ క్షణంలో శరీరమంతా వ్రణాలున్నాయి. చాలా బాధగా ఉంది. కానీ ప్రమాదభరితమైనవి కావు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ మార్క్స్ ఆలోచనలు తాను చేయవలసిన పనిపై కేంద్రీకృతమై ఉన్నాయి :

జనవరి ఒకటో తేదీ నుంచి అద్భుతంగా కొనసాగుతున్న పనికి, కాలేయ వ్యాధి మూలంగా అంతరాయం ఏర్పడి చాలా చికాకు కలిగిస్తున్నది. కూర్చోడానికి కూడా అవకాశం లేదు. రోజులో కొద్దిసార్లు పని చేయగలిగినా నా పనిముందుకు సాగేది. కానీ సైద్ధాంతికంగా ఏ మాత్రం ప్రగతి సాధించలేకపోయాను. నా మెదడు సహకరించలేకపోయింది. అందువల్ల నేను 'పని దినం' భావనను చారిత్రక దృక్పథంతో వివరంగా రాశాను. ఇది అసలు ప్లాన్‌లో లేదు. 'నా పుస్తకం పూర్తి చేయడానికి రాయగలిగిన సమయం కేటాయిస్తాను' అనే మాటలతో లేఖను ముగించడాన్ని బట్టి మార్క్స్ తన జీవితంలో ఈ కాలానికి ఆయన ఇచ్చిన ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. 1866 చాలా ముఖ్యమైన కాలం అనేది అందరికీ తెలిసిందే. ఈ పరిస్థితి చూసి ఎంగెల్స్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అసలుకే మోసం వస్తుందని గ్రహించి జోక్యం చేసుకున్నాడు. అదే తీరులో పని చేయడం మంచిది కాదని మార్క్స్ ఒప్పించడానికి ప్రయత్నం చేశాడు :

'నీ పుస్తకం మరో మూడు నెలలపాటు ఆలస్యమైనా, ముందుగా నువ్వు వ్రణాల సమస్య నుంచి బయటపడాలి. దీనికోసం నువ్వు అర్థవంతమైన ప్రయత్నం చేయాలి. ఈ సమస్య చాలా తీవ్రంగా పరిణమిస్తున్నది. సైద్ధాంతికపరమైన పని చేస్తున్నప్పుడు మెదడు సహకరించడం లేదని నువ్వే చెబుతున్నావు. విస్తృత సైద్ధాంతిక కృషి నుంచి కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలి. కొంతకాలం రాత్రి పూట ఎక్కువ పనిచేయడం నిలిపివేయాలి. సాధ్యమైనంత వరకు మామూలు జీవితం గడపడానికి ప్రయత్నం చేయాలి' అని ఆయన మార్క్స్‌ను కోరాడు. ఎంగెల్స్ వెంటనే డాక్టర్ గుంపెర్ట్‌ను సంప్రదించాడు. మరోసారి ఆర్సెనిక్ మందు వాడాలని డాక్టర్ సూచించాడు. పుస్తకం పూర్తి చేయడం గురించి మార్క్స్‌కు ఎంగెల్స్ సలహా ఇచ్చాడు. క్యాపిటల్ పూర్తిగా రాసే వరకు అందులో ఏ భాగం అచ్చు వేయకూడదనే అభిప్రాయం వాస్తవానికి దూరంగా ఉందని, ఆయన చెప్పాడు. ముందుగా వాల్యూమ్ 1 అచ్చు వేయడానికి ఇచ్చి తర్వాత రెండు మూడు మాసాల్లో వాల్యూమ్ 2 ఇవ్వడానికి ప్రయత్నించడం మంచిదని ఆయన సలహా ఇచ్చాడు. పరిస్థితులన్ని పరిగణనలోకి తీసుకొని ఆయన మంచి సలహా ఇచ్చాడు. 'అనుకోని సంఘటనలు జరిగితే మొత్తం పుస్తకంలో మరికొన్ని చాప్టర్లు రాయలిగినప్పటికీ, వ్యాల్యూమ్ 1 అచ్చు వేసే పరిస్థితి ఉండదు' అని ఎంగెల్స్ వివరించాడు. ఎంగెల్స్ ప్రస్తావించిన అన్ని



అంశాలకు మార్క్స్ వాస్తవాలను తెలియజేస్తూ, ప్రతి అంశం తీవ్రతను వివరిస్తూ లేఖ రాశాడు. ఆర్సెనిక్ మందుకు సంబంధించి దానిని వాడే విధానం, తదితర వివరాలతో డాక్టర్ గుంపేర్ట్ నుంచి ప్రిస్క్రిప్షన్ తీసుకోవలసిందిగా ఆయన ఎంగెల్సును కోరాడు. నాకు డాక్టర్‌పై నమ్మకం ఉన్నందువల్ల, మాంచెస్టర్ నుంచి ఆయన చేస్తున్న సేవలు రాజకీయ, ఆర్థిక శాస్త్రానికి ఉపయోగపడతాయని ఆయన తెలిపాడు. తన పనికి సంబంధించిన ప్లాన్ కూడా ఆయన వివరించాడు :

**ఇక నన్ను వెంటాడుతున్న పుస్తకం పరిస్థితి**

డిసెంబర్ చివరకు అది సిద్ధమవుతుంది. భూమి అద్దెకు సంబంధించి నేను రూపొందించిన (చివరి దానికన్నా ముందున్న) చాప్టర్ ప్రస్తుత రూపంలో అదొక్కటే ఒక పుస్తకంగా తయారవుతుంది. పగలు నేను బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయానికి వెళుతూ రాత్రి పూట రాసుకుంటున్నాను. జర్మనీలో కొత్తగా ఆవిర్భవించిన వ్యవసాయ రసాయన శాస్త్రం గురించి నేను పెద్ద ఎత్తున సమాచారం సేకరించవలసి వచ్చింది. ప్రత్యేకించి లీబిగ్, స్కాబీన్ గురించి సమాచారం సేకరించవలసి వచ్చింది. ఆర్థికవేత్తలు అందరినీ కలిపి చూసినప్పటికీ వారికన్నా వ్యవసాయ రసాయన శాస్త్ర ప్రాధాన్యం చాలా ఎక్కువ. ఇంతకు ముందు నేను చూసినప్పటికన్నా ఫ్రెంచ్ వారు దీనికి సంబంధించి విస్తృత సమాచారం ప్రచురించారు. భూమి అద్దెకు సంబంధించిన నా సైద్ధాంతిక పరిశోధన రెండేళ్ల క్రితమే పూర్తి చేశాను. ఈ రంగంలో ఈ రెండేళ్ల కాలంలో పెద్ద ఎత్తున ప్రగతి సాధించారు. ఈ ప్రగతి నా సిద్ధాంతాన్ని రుజువు చేస్తున్నది. ఆ తరువాత జపాన్లో (వృత్తిపరంగా అవసరమైతే తప్ప నేను సాధారణంగా ట్రావెల్ పుస్తకాలు చూడను.) కొనసాగుతున్న 'షిఫ్ట్ పద్ధతిని' 1848–50 మధ్యకాలంలో జుగుప్స కలిగించే ఇంగ్లీష్ తయారీదారులు అమలు చేశారు. దీనిని నాకు నేనే వర్తింపచేసుకున్నాను. తాజా పరిశోధనల వివరాలు తెలుసుకోవడానికి పగలంతా గ్రంథాలయంలో, రాత్రిపూట రాతప్రతి రాయడంలో మార్క్స్ మునిగిపోయాడు. పుస్తకం పూర్తి చేయడానికి తన శక్తినంతటిని కూడగట్టుకొని క్రమం తప్పకుండా ఇటువంటి కఠినమైన శ్రమ చేస్తూ తనని తాను శిక్షించుకుంటున్నట్టు కృషి చేశాడు. 'ముసాయిదా పూర్తిగా తయారయినప్పటికీ, అది చాలా పెద్దదిగా ఉంది. దాన్ని ప్రచురించడం ఆ ఒక్కడి వల్లే అవుతుంది. వేరే ఎవరికీ సాధ్యం కాదు. నీకు కూడా వీలు అని ఎంగెల్స్‌కు లేఖ రాస్తూ, ఆయన అంతకుముందు వారాలలో చేసిన కృషిని నా పుస్తకానికి మెరుగులు దిద్దుతూ కాపీ చేసే పని జనవరి ఒకటో తేదీన ప్రారంభించారు. అది సజావుగా సాగిపోతున్నది. పశువులు ఈనిన వెంటనే తమ బిడ్డలను నాకి శుభ్రం చేసినట్టు, నేను పని చేస్తున్నాను. కానీ మళ్ళీ ఒక వ్రణం అడ్డుపడింది. ఆ తరువాత నేను పెద్దగా ప్రగతి సాధించలేకపోయాను. అయితే మొదటి ప్లాన్ ప్రకారం దాదాపు పూర్తి చేసిన కొన్ని విభాగాలలో వాస్తవాలను నింపే పని చేస్తున్నాను. తన పుస్తకాలు ప్రచురణ వ్యవధిని ప్రకటించాలని ఎంగెల్స్ చేసిన సూచనలను చివరకు మార్క్స్ ఆమోదించారు. నేను నీ సూచనకు అనుగుణంగా మొదటి వాల్యూమ్ రెడీ కాగానే మీస్నర్‌కు పంపుతాను. అయితే కూర్చోడానికి వీలు లేకుండా నిజానికి మార్క్స్ ఆరోగ్యం దిగజారుతోంది. ఫిబ్రవరిలో శరీరంపై మరో రెండు పెద్ద వ్రణాలు వచ్చాయి. వాటికి నేనే చికిత్స చేసుకోవడానికి ప్రయత్నించా. పదునైన రేజర్‌తో స్వయంగా వ్రణం పైభాగం తొలగించాను. వ్యాధి సోకిన రక్తం గాలిలోకి చిమ్మింది. దీనితో వ్రణాలు పూర్తిగా తగ్గినట్టేననుకున్నాను. అయితే దీనికి సేవలు తీసుకోక తప్పలేదు. అయితే రెండో వ్రణం బాగా మొండికేసింది. నేను దానిని అదుపు చేయలేకపోయాను. వ్రణాలు ఇదే విధంగా కొనసాగితే మళ్ళీ డాక్టర్‌ను పిలిపించక తప్పదు. వ్రణం లోపలి భాగం చూడడం లేదా చికిత్స చేసుకోవడం నావల్ల కాలేదు" అంటూ ఎంగెల్స్‌కు లేఖ రాశాడు.

ఇది తెలుసుకున్న ఎంగెల్స్, స్నేహితుడిని తీవ్రస్థాయిలో మందలించాడు. 'ఇంత దీర్ఘకాలం వ్రణాలను తట్టుకోవడం చాలా కష్టమే. ఈ పరిస్థితులలో బాగు చేయడానికి వీలుగాని వ్రణం వస్తే అది నిన్ను మట్టుబెట్టే అవకాశం ఉంది. అప్పుడు నీ పుస్తకం ఏమవుతుంది? నీ కుటుంబం ఏమవుతుంది?' అని ఎంగెల్స్ ప్రశ్నించాడు. తాను ఎటువంటి ఆర్థిక సహాయం చేయడానికైనా సిద్ధమేనని హామీ ఇచ్చాడు. దీనితో మార్క్స్‌కు ఉపశమనం లభించింది. జాగ్రత్తగా ఉండాలని, కొంత కాలం పూర్తి విశ్రాంతి తీసుకోవాలని మార్క్సును ఎంగెల్స్ ప్రాధేయపడ్డాడు :

నువ్వు ఈ వ్యాధిని నయం చేసుకొని నీ కుటుంబానికి, నాకు మేలు చేయాలి. ఏదైనా జరిగితే ఉద్యమమంతా ఏమవుతుంది? నువ్వు ఇదే విధంగా పని చేస్తూ పోతే ఈ పరిస్థితి తప్పనిసరిగా ఎదురవుతుంది. నీకు ఈ వ్యాధి వచ్చినప్పటి నుంచి నాకు రాత్రి, పగలు ప్రశాంతత లేకుపోయింది. ఏ రోజు ఏ కబురు వినాల్సి వస్తుందోనని భయపడుతూ కాలం వెళ్లదీస్తున్నాను. మళ్లీ వ్రణాలు వచ్చాయని, ఈ పరిస్థితి మరింత దిగజారిందని అనుకుంటున్నాను. ఈ పరిస్థితి నాకు చాలా బాధ కలిగిస్తున్నది. జాగ్రత్త (nota bene). నేను రేజర్‌తో వ్రణాన్ని తొలగించాను. మరొక దానిని తొలగించలేకపోయాను అనే పరిస్థితికి వెళ్ళవద్దు. అది చాలా ప్రమాదకరమైనది. చిట్టచివరకు పని నుంచి విశ్రాంతి తీసుకోడానికి మార్క్స్ కూడా ఒప్పుకున్నాడు. మార్చి 15న టెంపుల్లోని సముద్ర తీరంలోని రిసార్టుకు బయలుదేరి వెళ్లాడు. పది రోజుల తర్వాత తన పరిస్థితిని ఎంగెల్స్‌కు వివరించాడు. నేను చదవడం లేదు. రాయడం లేదు. రోజుకు మూడుసార్లు ఆర్సెనిక్ మందు వేసుకున్నందు వల్ల కేవలం భోజనం చేయడం, తిరగడానికి మాత్రమే ఉపయోగపడుతున్నది. ఇక్కడ మిత్రులు ఎవరూ లేరు. నేను 'మిల్లర్ ఆఫ్ ది డెక్' అంటూ పాటలు పాడుకుంటున్నాను. 'నేను ఎవరిని పట్టించుకోవడం లేదు. నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదు.' ఏప్రిల్ ప్రారంభంలో తన మిత్రుడు కుగుమాన్‌కు లేఖ రాస్తూ చాలా వరకు కోలుకుంటున్నానని మార్క్స్ తెలియజేశాడు.

రెండు, మూడు మాసాలలో చేయాల్సిన పని పూర్తిగా నష్టపోయి నట్టు వాపోయాడు. పుస్తకం పూర్తి కావడమనేది వాయిదా పడిందని వెల్లడించాడు. లండన్‌కు తిరిగి వచ్చిన తరువాత మోకాలి నొప్పులు, తదితర సమస్యలతో మరి కొన్ని వారాలపాటు ఏ పనిచేయలేకపోయాడు. ఆయన బాగా అలసిపోయినందువల్ల అనారోగ్యం చోటు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. అదృష్టవశాత్తు తనకు వ్రణాలు రాలేదని జూన్‌లో ఆయన ఎంగెల్స్‌కు తెలిపాడు. శారీరక అనారోగ్యం వల్ల తన పని కుంటుపడుతున్నందుకు ఆయన విచారం వెలిబుచ్చాడు. మూడు ప్రధానమైన సమస్యలతో ఇబ్బంది పడేవాడు. (Livy spericulumin morna) అంటే వాటి కారణంగా జాప్యం జరిగే ప్రమాదం ఎదురవుతూ ఉండేది. ఇంటి అద్దె బకాయిలు, వ్రణాలు, తాజాగా కాలేయ సమస్య ప్రారంభమైంది. జూలైలో మార్క్స్ వీటన్నిటిని ఒకేసారి ఎదుర్కోవలసి వచ్చింది. తన ఆరోగ్యం రోజూ ఒడుదుడుకులకు లోనవుతున్నప్పటికీ పరిస్థితి మెరుగ్గానే ఉందని, తాను పని చేయగలిగే పరిస్థితిలో ఉండడం ఎంతో ఉత్సాహం కలిగిస్తుందని, ఆగస్టులో ఆయన ఎంగెల్స్‌కు తెలియజేశాడు. శరీరంపై అక్కడక్కడ కొత్త వ్రణాలు వస్తున్నప్పటికీ అవి తగ్గిపోతున్నాయి. అందువల్ల డాక్టర్ అవసరం పడలేదు. తాను పరిమితంగా కొన్ని గంటలు మాత్రమే పని చేయగలుగుతున్నానని లేఖలో ఎంగెల్స్‌కు తెలిపాడు. అదే రోజు కుగుల్‌మాన్‌కు రాసిన లేఖలో 'మొదటి వాల్యూమ్ రాతప్రతులను అక్టోబర్‌లోగా హాంబర్గ్‌లోని పబ్లిషర్‌కు అందజేసే పరిస్థితి కనబడడం లేదని, కొద్ది గంటలు మాత్రమే పని చేయగలుగుతున్నానని వివరించాడు. ఈసారి ఆయన చాలా ఆశా వాదిగా కనిపించాడు. ఆయన నిత్యం ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులలో పుస్తకం పూర్తి చేయడానికి మరొక అవాంతరం తలెత్తింది. దీనికితోడు వస్తువులు తాకట్టు పెట్టి చిన్న చిన్న మొత్తాలను సమకూర్చుకోవడానికి ఆయన సమయం వెచ్చించాల్సి వచ్చింది. హింసకు గురిచేస్తున్న తిరగరాసిన అనేక ప్రామిసరీ నోట్ల సమస్యను పరిష్కరించవలసి వచ్చింది. అక్టోబర్ మధ్యలో కుగుల్‌మాన్‌కు లేఖ రాస్తూ, దీర్ఘకాలిక అనారోగ్యం, దానికోసం డబ్బు ఖర్చు పెట్టడం తదితర కారణాల వల్ల అప్పుల వాళ్లకు జవాబు చెప్పలేని పరిస్థితి వచ్చిందని, తన కొంప కూలిపోవడం తథ్యమని తెలుస్తున్నదని మార్క్స్ వివరించాడు. అక్టోబర్‌లోను ఇదే పరిస్థితి కొనసాగుతున్నపుడు, రాత ప్రతికి తుది మెరుగులు దిద్దడం సాధ్యం కావడం లేదని వెల్లడించాడు. తన స్నేహితునికి పరిస్థితి వివరిస్తూ, దానికి కారణాలు తెలుపుతూ, రాతప్రతి పూర్తి చేయడానికి ప్రస్తుతం తన మనసులోని ప్రణాళిక ఆయన వ్యక్తం చేశాడు. నేనున్న పరిస్థితులలో (శారీరక, సామాజికపరమైన అంతులేని అవాంతరాలు ఏర్పడుతున్నందువల్ల) ఇంతకుముందు అనుకున్నట్టు రెండు వాల్యూమ్లు ఒకేసారి ముద్రణకు ఇచ్చే ప్రయ త్నం చేయకుండా, ముందుగా వాల్యూమ్ 1ని ముద్రణకు సిద్ధం చేయాలని నిర్ణయించుకున్నాను. అప్పుడు పుస్తకం మూడు వాల్యూ మ్‌లు అవుతుంది. పుస్తకాన్ని కింది భాగాలుగా విభజించడం అవసరం. పుస్తకం 1. పెట్టుబడి ఉత్పత్తి క్రమం, పుస్తకం 2. పెట్టుబడి చెలామణి క్రమం, పుస్తకం 3. సంపూర్ణ నిర్మాణం, క్రమం., పుస్తకం 4. సైద్ధాంతిక చరిత్ర.

మొదటి రెండు పుస్తకాలు మొదటి వాల్యూంలో, రెండో వాల్యూంలో మూడో భాగంలో, మూడో వాల్యూంలో 4వ పుస్తకం చేర్చాలనుకుంటున్నాను. 1859లో 'కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' ప్రచురించిన తరువాత తాను చేస్తున్న కృషిని సమీక్షిస్తూ మార్క్స్ ఈ విధంగా చెప్పాడు : మొదటి పుస్తకంలో మళ్ళీ మొదటి నుంచి ప్రారంభించాలని నా అభిప్రా యం. అంటే డంకెర్ ప్రచురించిన నా పుస్తకంలోని 'వ్యాపార వస్తువులు, ద్రవ్యంపై చాప్టర్ సారాంశం తీసుకోవడం అవసరం. సమగ్ర రూపం ఇవ్వడమే కాకుండా, అది సమస్యను అర్థం చేసుకోడంలో ఇబ్బందులు ఉన్నందువల్ల, వేరే మాటల్లో చెప్పాలంటే ఇంతకు ముందు పుస్తకంలో ప్రత్యేకించి వాణిజ్య వస్తువుల విశ్లేషణలో లోపాలు ఉన్నందువల్ల ఇది అవసరమని నేను భావిస్తున్నాను. నవంబర్‌లో తీవ్ర పేదరికంతో ఇబ్బందులు పడ్డాడు. నిత్య జీవితంలో విశ్రాంతి లేకుండా చేస్తున్న, దుర్భరమైన పరిస్థితులను వివరిస్తూ ఆయన ఎంగెల్స్‌కు లేఖ రాశాడు : 'ఈ పరిస్థితులు నా పనికి ఆటంకం కలిగించడమే కాకుండా, నష్ట పోయిన సమయాన్ని తీసుకోవడానికి రాత్రిపూట పనిచేస్తున్నాను. దీనికితోడు మర్మావయవంపై వ్రణం ఏర్పడింది' వేసవిలో, శర త్కాలంలో తన అనారోగ్యం, ఆర్థిక పరిస్థితుల వల్ల సాధారణంగా జరుగుతున్నదని, ఈ జాప్యానికి సైద్ధాంతిక సమస్యలు కారణం కాదని ఆయన తెలిపాడు. మూడేళ్ల క్రితం నుంచి వ్రణాల సమస్య ప్రారంభమైందని, అప్పటి నుంచి అప్పుడప్పుడు కొద్దిపాటి సమయంలో మాత్రమే పని చేయగలుగుతున్నానని గుర్తుచేశాడు. పేదరికం కారణంగా కాలాన్ని, శక్తిని ఉపయోగించుకోవాల్సి వస్తున్నదని వెల్లడించాడు. ఆయన వ్యాపారస్తులకు మాత్రమే దివాలా ప్రకటించడానికి అవకాశం ఉంటుందని, ఈ అవకాశం ప్రైవేటు వ్యక్తులకు లేకపోవడం దురదృష్టకరమని డిసెంబర్లో వాపోయాడు. చలి కాలంలో ఆయన సమస్యలకు పరిష్కారం లభించలేదు. 1867 ఫిబ్రవరి చివరలో మాంచెస్టర్ స్నేహితునికి (ఆయన లేఖ వ్రాసినప్పుడల్లా ఎంతో కొంత సహాయం చేస్తూనే ఉన్నాడు) లేఖ రాస్తూ 'ఎల్లుండి అంటే శనివారం దుకాణదారుడు పోలీసులను పంపుతున్నాడు. అప్పుడు నేను కనీసం 5 పౌండ్లు చెల్లించాలి. నేను చేసే పని త్వరలోనే పూర్తవుతుంది. ఇబ్బందులు లేనిపక్షంలో ఇప్పటికే పని పూర్తయ్యేది.' 1867 ఫిబ్రవరి చివరలో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న శుభవార్త చెప్పాడు. పుస్తకం పని పూర్తయిందని చెపుతూ ఎంగెల్స్‌కు లేఖ రాశాడు. ఇప్పుడా పుస్తకాన్ని జర్మనీకి తీసుకువెళ్లాలి. 'తన దుస్తులను, చేతి గడియారాన్ని అవి ఎప్పుడూ ఉండే చోటికి అంటే తాకట్టుకు తరలించానని, లేనిపక్షంలో జర్మనీ బయలుదేరడం సాధ్యం కాదని ఆయన ఎంగెల్స్‌కు వివరించాడు. హాంబర్గ్ చేరుకున్న మార్క్స్, పుస్తక ప్రచురణకు మీస్నర్ ప్రతిపాదించిన కొత్త ప్లాన్‌ను ఎంగెల్స్‌తో చర్చించాడు :

పుస్తకాన్ని మూడు వాల్యూమ్‌లుగా విభజించాలని ప్రస్తుతం మీస్నర్ ప్రతిపాదించాడు. నేను అనుకుంటున్నట్టు చివరి పుస్తకాన్ని (చారిత్రక–సాహిత్య భాగం) కుదించడాన్ని ఆయన వ్యతిరేకించాడు. ప్రచురణ ప్రాధాన్యతలను అనుసరించి ఈ భాగం చాలా ముఖ్యమైనదని ఆయన తెలిపాడు. దీనికి సంబంధించి ఆయన చెప్పినట్టే చేస్తానని నేను చెప్పానని అంటూ మార్క్స్, ఎంగెల్స్‌కు వివరించాడు. కొద్దిరోజుల తరువాత ఇదే అభిప్రాయాన్ని బెకర్‌కు మార్క్స్ వివరించాడు :

ప్రస్తుతం పుస్తకం మూడు వాల్యూమ్లుగా వెలువడుతుంది. పుస్తకం పేరు, 'క్యాపిటల్, ఏ క్రిటీక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ'. మొదటి వాల్యూమ్‌లో మొదటి పుస్తకం ఉంటుంది. పెట్టుబడి ఉత్పత్తి క్రమం' ఇందులో ఉంటుంది. బూర్జువాకు (భూ యజమానులతో కలిపి) ఇంతకు ముందెన్నడూ లేని తీరులో ఇది బృహత్తర శరాఘాతం అవుతుంది. హాంబర్గ్ కొద్ది రోజులున్న తరువాత ఆయన హనోవర్ వెళ్ళాడు. అక్కడ తన స్నేహితుడైన కుగుల్మన్‌కు అతిథిగా ఉన్నాడు. చాలాకాలం ఉత్తరాల ద్వారా కొనసాగిన స్నేహం, మరింత గాఢమైన స్నేహంగా మారింది. అమ్మాయికి, మీస్నర్కు ప్రూఫ్ రీడింగ్‌లో సహకరించడానికి మార్క్స్ అక్కడే ఉన్నాడు. తన ఆరోగ్యం చాలా మెరుగైందని, పాత అనారోగ్య సమస్య మళ్ళీ తలెత్తలేదని, కాలేయ సమస్య లేదని, అన్నిటినీ మించి తాను అత్యంత ఉత్సాహంగా ఉన్నానని ఎంగెల్స్‌కు ఆయన లేఖ రాశాడు. మాంచెస్టర్ నుంచి స్నేహితుడు క్రింది విధంగా జవాబిచ్చాడు : నువ్వు చాలా కాలంగా రాస్తున్న ఈ పుస్తకం నీకు పెను భారమైందని నేను అనుకుంటూనే ఉన్నాను. నీ దురదృష్టాలకు అన్నిటికీ ఇది మూలమని నాకు తెలుసు. ఆ భారం వదిలించుకునే వరకు నీకు సాంత్వన చేకూరదని నాకు అర్థమైంది. పుస్తకం పూర్తి చేయడంలో ఎదురైన ఆటంకాల కారణంగా నువ్వు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా బాగా కుంగిపోయావని, ఈ పీడకల తొలగిపోగానే నువ్వు నూతన మానవుడిగా రూపొందుతావని స్పష్టంగా అర్థమైంది. తన పుస్తకం ప్రచురిస్తున్నారనే విషయం తన స్నేహితులందరికీ తెలియజేయాలని మార్క్స్ కోరుకున్నాడు. న్యూయార్క్‌లో కార్మిక ఉద్యమం కోసం పనిచేస్తూ, ఇంటర్నేషనల్లో సభ్యుడైన జర్మనీకి చెందిన సోషలిస్టు సిగ్ ఫ్రీడ్ మేయర్ (1840–1872)కు లేఖ రాస్తూ:


'వాల్యూమ్ 1లో పెట్టుబడి ఉత్పత్తి క్రమం ఉంటుంది. వాల్యూమ్ 2లో సైద్ధాంతిక అంశాల కొనసాగింపు, నిర్ధారణ ఉంటాయి. వాల్యూమ్ 3లో 17వ శతాబ్దం మధ్యకాలం నుంచి పొలిటికల్ ఎకానమీ చరిత్ర ఉంటుంది. 'మే–జూన్ 1867 మధ్యకాలంలో గ్రంథానికి సంబంధించి సవరణలు చేయడంలో ఎంగెల్స్ పనిచేయడం ప్రారంభించాడు. 1859 నాటి 'ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటీక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ'లో కన్నా, ప్రస్తుత పుస్తకంలో గతితార్కికత చాలా పదునుగా ఉందని ఎంగెల్స్ భావించాడు. ఎంగెల్స్ ఈ వ్యాఖ్య చేసినందుకు మార్క్స్ చాలా సంతోషపడ్డాడు. 'మిగతా ప్రపంచమంతా ఏమి చెప్పినప్పటికీ నువ్వు సంతృప్తి చెందడం చాలా ముఖ్యమైనది' అని మార్క్స్ వ్యాఖ్యానించాడు. కానీ విలువకి సంబంధించి ఎక్కువ భాగం అమూర్తంగా ఉందని, సాధారణ పాఠకుడు స్పష్టంగా తెలుసుకోవడం కష్టమని ఎంగెల్స్ తెలిపాడు. ఈ భాగంపై వ్రణాల బాధ స్పష్టంగా ప్రభావం చూపిందని ఆయన విచారం వెలిబుచ్చాడు. ఈ అభిప్రాయానికి జవాబిస్తూ, మార్క్స్ తన ఇబ్బందులకు కారణమైన బూర్జువాను నిందించాడు. 'ఈ బూర్జువాలు అంతమయ్యే రోజు వరకు నా వ్రణాలను గుర్తుంచుకుంటానని' అన్నాడు. అయితే విలువ రూపంపై అనుబంధాన్ని చేర్చి అందరికీ అర్థమయ్యే విధంగా చేయాల్సిన అవసరం ఉందని అంగీకరించాడు.

జూన్ ఆఖరు నాటికి 20 పేజీల ఈ అనుబంధాన్ని ఆయన రాశాడు. 1867 ఆగస్టు ఒకటో తేదీ తెల్లవారుజాము రెండు గంటలకు ప్రూఫ్ దిద్దే పని మార్క్స్ పూర్తి చేశాడు. కొద్ది నిముషాల తరువాత మాంచెస్టర్లోని ఎంగెల్స్‌కు లేఖ రాస్తూ, 'మిత్రమా ప్రూఫ్ దిద్దడంలో చివరి పేజీ కూడా ఇప్పుడే పూర్తి చేశాను. అంటే ఈ వాల్యూమ్ పూర్తి అయినట్టే. ఇది పూర్తి అయిందంటే, నీ ఒక్కడికి మాత్రమే నేను రుణపడి ఉంటాను. హృదయ పూర్వకమైన కృతజ్ఞతలతో నేను నిన్ను ఆలింగనం చేసుకుంటున్నాను. కొద్దిరోజుల తరువాత ఎంగెల్స్‌కు మరొక లేఖ రాస్తూ, తన పుస్తకం సారాంశాన్ని వివరిస్తూ అందులో రెండు చాప్టర్లు మూల స్తంభాల వంటివని తెలిపాడు : '1. వాస్తవాలను అర్థం చేసుకోవడానికి ఇది మౌలికమైనది.) ఉపయోగ విలువగా, మారకపు విలువగా వ్యక్తమయ్యే తీరును బట్టి శ్రమకు రెండు ప్రధాన లక్షణాలు ఉన్నాయి. దీనిని మొదటి చాప్టర్లో చర్చించాను. 2. అదనపు విలువ వ్యక్తమయ్యే లాభం, వడ్డీ, అద్దె తదితర రూపాలతో సంబంధం లేకుండా చర్చించాను." 1867, సెప్టెంబర్ 11వ తేదీన క్యాపిటల్ పుస్తకాన్ని అమ్మకానికి పెట్టారు. తుది మార్పుల తరువాత విషయసూచిక ఈ విధంగా ఉంది :

**ఉపోద్ఘాతం :**


1. వాణిజ్య వస్తువు – ద్రవ్యం
2. ద్రవ్యం, పెట్టుబడిగా మార్పు చెందడం
3. నిరపేక్ష అదనపు విలువ ఉత్పత్తి
4. సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తి
5. నిరపేక్ష, అదనపు విలువలపై మరికొంత పరిశోధన
6. పెట్టుబడి సంచయ క్రమం ఉండి

అనుబంధం ఒకటవ భాగం : 1. విలువ రూపం సుదీర్ఘ సవరణలు, తుది మార్పులు తరువాత పుస్తకాన్ని విస్తరించారు. తర్వాత సంవత్సరాలలో అనేక మార్పులు చేశారు. అందువల్ల క్యాపిటల్ ప్రచురించిన తరువాత కూడా ఈ మార్పుల కోసం మార్క్స్ చాలా శ్రమ చేయవలసి వచ్చింది. ❑




ఆటకు గాయం

న్యాయం బతకాలి









చరిత్రకు చెదలు

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 1 - Issue No : 8 May 2023




## కొత్త పుస్తకాలు స్వీకారం




if undeliverd please return to:

**B.Ramesh Chandra Babu**

34-15-1, Doddipatal Vaari Thota

Veedhi, Tanuku - 534 211

West Godavari, Ap

Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.